# కథ 2017



సాహితీమిత్రులు

Regd. No. 48/2012/IV విజయవాడ.

# కవిత - 2017

పర్యవేక్షక సంపాదకులు

**విశ్వేశ్వరరావు**

సంపాదకులు

**కొండేపూడి నిర్మల**

**జి. లక్ష్మీనరసయ్య**

సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.

**KAVITHA - 2017**
A Collection of Poems of the Year 2017

*Released By* : **K. Satyanarayana,** *IPS*

*First Edition* :
1 May 2018

*Cover Painting & Design :*
A. GIRIDHAR

*Published by*
**SAHITI MITRULU** - VIJAYAWADA
28-10-16, Maszid Street, Arundalpet,
Karlmarx Road, VIJAYAWADA - 520 002
Ph. : 0866 2433359,
Cell : 9392971359

*e book : www.kinige.com*

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 63 4849

₹ : **150**

“ఏ కాలానికాకాలం తనకు కావలసిన రచయితను, కవిని సృష్టించుకుంటుంది”
ఈ మూడు దశాబ్దాల బహు సంకీర్ణ, సంక్షుభిత, సంక్లిష్ట
సాంఘిక చరిత్రతో నిండిన కాలం చంద్రశేఖరరావును కన్నది.

కాలం తనకు అప్పజెప్పినపని అమోఘంగా నిర్వర్తించాడు.

తెలుగు వచనానికి కొత్త రూపురేఖలను, కొత్త సౌందర్యాన్ని
కవిత్వంతో తులతూగే కాంతిని, సత్తువను, లోతును
డాక్టర్ చంద్రశేఖరరావు అందించాడు.



సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ

వ్యవస్థాపక సభ్యులు
డా. **VCR** ను
స్మరించుకుంటూ...

## 14వ మైలురాయిని దాటుకుంటూ...

తెలుగు కవిత్వపు అస్థిత పరిభాషను పదేపదే సరికొత్తగా కనుగొనే క్రమంలో ఆ పలుకుబడి ఏ విధంగా అనేకానేక హొయల్ని వయ్యారాల్ని పలికిస్తున్నదో గమనిస్తూ 14 ఏళ్ళుగా 'కవిత' వార్షిక సంకలనాల ప్రస్థానం కొనసాగుతోంది. ఆ అక్షరాల సొగసునీ సోయగాల్ని చూస్తూ అబ్బురపడుతూ, ఆనందపడుతూ నిరంతరంగా 'మే' డే నాడు కవిత్వం పండుగ నిర్వహిస్తోంది. 14 ఏళ్ళ తరువాత కూడా తొలినాటి పసితనపు ఛాయలతోనే మెత్తటి హృదయాలుగల కవితల్ని ఒక పుస్తకంగా తీసుకువచ్చి 'కవిత 2017' గా మీముందు పెడుతున్నాం. ఏడాది పొడవునా ఛిన్నపోకడలు పోయిన కాలం కాలరుపట్టుకుని ఒకచోట కుదురుగా కూర్చోబెట్టటానికి ప్రయత్నం ఎప్పటిలానే చేశాం. ఈ మహత్కార్యానికి, లక్ష్మీనరసయ్యగారు, నిర్మలగారు మాకు చేదోడుగా నిలిచారు. ఈ మంచిపనిని వాళ్ళు సహృదయతతో స్వీకరించి, మా నమ్మకాన్నీ, సంతృప్తిని ఇంకో ఏడాదికి పదిలంగా భద్రపరచారు. వాళ్ళకి కృతజ్ఞతలు. కాలం నిండా కత్తిపోట్లు. ఇంకా కులం మోరెగరేసిన వూళ్ళు, తెలుగుబళ్ళను మూసేసిన జీవోలు, శవాల్ని సుదూరతీరాలకు మోసుకెళ్ళాల్సిన స్థితి, మత అసహనం లాంటి రకరకాల గాయాల బారినపడ్డ కాలం యొక్క దృశ్యాల్ని కవిత్వీకరించిన కవుల అంతరంగాల్ని ఆవిష్కరించిన పుస్తకం ఇది. భావాల్ని, భావనాబలాల్ని బేరీజువేస్తున్న తూనిక రాళ్ళని తోసిరాజని కొత్త వాక్యాలు నిర్మాణమౌతున్న సందర్భమిది. ఆ సందర్భాన్ని ఒడిసిపట్టుకునే ప్రయత్నమే ఈ కవితా సంపుటి. రూపకీకరణకి భాష తన హద్దుల్ని సైతం చెరిపేస్తున్న కవిత్వ సంకలనాన్ని మీకందిస్తున్నాం. ఆస్వాదించండి.

సాహితీమిత్రులు
Regd. No. 48/2012/IV విజయవాడ.

# టేకిట్ ఆర్ లీవిట్

– జి. లక్ష్మీనరసయ్య

సీరియస్ కవులెప్పుడూ తమచుట్టూ ఉన్న సామాజిక వాస్తవికతనీ, తాము బతుకుతున్న బతుకునీ, రాసేనాటికి తమకు అందుబాటులో ఉన్న కవిత్వ నిర్మాణం సామాగ్రితో తమది మాత్రమే అయిన హృదయముద్రతో కవిత్వంగా మలుస్తారు. ఈ క్రమంలో తమ కుల, మత, వర్గ, ప్రాంత, లింగ నేపథ్యం నుంచి తమకబ్బిన సంస్కృతీ పరిమళాన్ని తమ కవిత్వంలో దట్టిస్తాడు అందుకే వివిద కవులు వాడే కవితా నుడీ, వడీ విభిన్నంగా సాగుతాయి. తమ టెంపర్‌మెంటును పుణికిపుచ్చుకున్న వాయిస్ కల్చర్‌తో కవిత్వాన్ని ఎప్పటికప్పుడు సుసంపన్నం చేస్తారు కవులు. సీనియర్ కవులయినా, జూనియర్ కవులయినా ఈ సాధారణ లక్షణాలకు లోబడుతూనే కొత్త కొత్త ప్రయోగాలు చేయడం ద్వారా, అమలులోని కవితా నిర్మాణాల్ని డిజ్‌మాంటల్ చేసేవాళ్ళూ ఉంటారు. వర్తమాన వ్యక్తీకరణలతో సంతృప్తి చెందలేక, సరికొత్త దారుల్ని అన్వేషించే తపనలో ఏదారీ లేనివైపుకు నడవటానికీ భయపడని ధోరణితో తమ సమకాలీనులకీ, రాబోయే తరాలకీ కూడా కళా సాంకేతిక మార్గదర్శకులవుతారు కొంతమంది. శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, కృష్ణశాస్త్రి, అజంతా, శివసాగర్, శివారెడ్డి, మో, ఇస్మాయిల్, సీతారాం, సిద్ధార్థ, అఫ్సర్, మద్దూరి నగేష్‌బాబు, వేముల ఎల్లయ్య, జయప్రభ, కొండేపూడి నిర్మల, తెరేష్‌బాబు, జూపాక సుభద్ర... ఇలాంటి కవులంతా తరతమ స్థాయీ బేధాలతో తెలుగు కవిత్వానికి ఈ రకమైన మార్గదర్శకత్వం వహించిన వాళ్ళే.

ప్రస్తుతం మనముందున్న పుస్తకంలోని కవులలో కూడా కొంతమంది ఈ కోవకు వచ్చే వాళ్ళున్నారు. ఈ విషయాన్ని కొంచెంసేపు పక్కనబెడితే ఇందులోని కవులంతా తమ సమకాలీనతకు తమ తమ సాంస్కృతిక మూలాల నుంచీ, వ్యక్తిగత ముద్రల నుంచీ స్పందించిన వాళ్ళే. ఫలితంగా ఇందులో స్టేట్ స్పాన్సర్డ్ హిందూత్వపు విధ్వంసాన్ని, కవులు పట్టుకగోలిగారు. దళితులూ, ముస్లింలూ, క్రైస్తవులూ, ఇతర

పీడిత కుల ప్రజా సమూహాలూ బతుకుదెరువులు కోల్పోవటానికి కారణమైన అన్యాయ ఆర్థిక సంస్కరణల మీద ఆగ్రహం ప్రకటించిన కవులు ఇక్కడ తారసపడ్డారు. నకిలీ అభివృద్ధి తీసుకొచ్చిన వ్యవసాయ సంక్షోభానికి పిట్టల్లా రాలిపోతున్న పేద, మధ్యతరగతి, రైతుల విషాదాన్ని కదిలించే రీతిలో అద్దంపట్టిన కవితలూ ఇందులో వున్నాయి. ఇలా ఒక పక్క అభివృద్ధీ, మరొక ప్రక్క హిందూత్వ – రెండూ జమిలిగా నములుతున్న పీడిత జన ఆక్రందనల్నీ, ఆరాట పోరాటాలనీ రికార్డు చేసిన కవితలు ఈ పుస్తకంలో పుష్కలంగా ఉన్నాయి. ఐడియలాజికల్ హత్యలకు తెగబడ్డ హిందూ రాజకీయాలకు బలైన గౌరీలంకేష్‌మీదా, అగ్రరాజ్యాల ఆర్థిక ఆధిపత్య గేమ్‌లో కకావికలైన సిరియా ప్రజల విషాదం మీదా, ఇప్పటికీ విద్యా, వైద్యం, ట్రాన్స్‌పోర్టు వసతి లేని కారణంగా గిరిజనులు ఎదుర్కొంటున్న అత్యంత దయనీయత మీదా, రోహ్యింగ్యా ప్రజలపై సాగుతున్న అణచివేత, తుడిచివేతల తాలూకూ అమానవీయతపైనా, ప్రేమించినందుకో, సమానత్వాన్ని ప్రకటించినందుకో ఆత్మగౌరవాన్ని హక్కుగా నినదించినందుకో పీడిత కులాల మీద, పీడిత కుల పెత్తందారులు సాగించిన దమన దహనకాండల మీదా, ఎప్పటికప్పుడు జనం మీద వ్యవస్థాగతంగా, రాజ్యపరంగా జరుగుతున్న అన్యాయ, అమానవ ఘటనల మీదా విజృంభించిన కవితలు ఈ సంకలనానికి ఒక హైలైట్. మూలాల నుంచి వేరుపడి, కృతకప్రపంచంలో అసహజ ఉద్వేగాలతో, అప్రేమగా, గాడితప్పి బతుకుతున్న పేద బహుజన యువత తండ్లాటను విమర్శనాత్మకంగా ఎత్తిపొడిచిన కవితలతో సహా, రోజు రోజుకూ క్షీణిస్తున్న పర్యావరణ పరిణామాల్నీ, చెరువులూ, కుంటలూ, సరసులూ, అడవులూ మాయమవుతున్న విషాదాన్నీ ట్యాకిల్ చేసిన కవితలూ ఇందులో ఉండటం వల్ల అరుదైన పొయెటిక్ రన్నింగ్ కామెంట్రీ కూడా అందుబాటులో కొచ్చింది. సంక్షేమ కార్యక్రమాల నుంచి, ముఖ్యంగా విద్య నుండి ప్రభుత్వం విత్‌డ్రా అవుతున్న ఇతివృత్తాన్ని కొనసాగిస్తూ ఈ ఉపసంహరణల వల్ల తగలబడుతున్న దళిత బహుజన భవితవ్యాన్ని విజువలైజ్ చేసిన కవితలు కూడా పుస్తకానికి ప్లస్ పాయింటని చెప్పాలి. సీమ కరువుకోత, పాలమూరు వలస కోతలు కూడా కవిత్వమై సాకారం పొందాయి.

బాహ్య జీవితపు సంక్షోభాన్ని తట్టుకోలేక ఆంతరంగిక లోకాల్లోకి మాయ మవుతున్న యువత దైన్యాన్నీ, అంతర్జాల లోకం తెరిచిన కొయ్య జీవితాన్నీ,

లోహప్రేమనీ, స్త్రీ పురుష సంబంధాల సంక్లిష్టతలో స్త్రీలు అనుభవించే ఒంటరితనపు రోదనల్నీ, తోడులేని అలంకునీ పలికించిన కవితలూ, స్వయం మానసిక సంవాదంలో తమను తాము తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్న నవతరపు గమ్య, అగమ్య గోచరత్వాన్ని కూడా అక్షరబద్ధం చేసిన కారణంగా ఈ కవితా సంకలనం గొప్ప వైవిధ్యాన్ని అందించగలిగింది.

కవిత్వానికి సామాజిక వాస్తవికత అనేది ఒక ప్రేరణ మాత్రమే. కవిత్వం కవిత్వమయ్యేది సామాజికేతర అంశం వల్లనే కానీ సామాజికాంశం వల్ల కాదు. చుట్టూ ఉన్న పరిస్థితి కవిలో ఒక ఆగ్రహాన్నో, వ్యాకులతనో, దిక్కుతోచని స్థితినో, తెగింపునో, వివరణకందని అలజడినో, ఆకలినో రగిలించటం ద్వారా కవితకు మూలం అవుతుంది. అంతవరకే దాని పాత్ర. రగిలిన వ్యాకులత కవిత కావాలంటే తగిన టెక్నిక్‌తో అది జతకలవటం ఉంటుంది. "A Poem is what heppens when an anxiety meets a technique" అని అందుకే అంటాడు Laurence Durrella. ఈ కోణం నుంచే Robert Frost, "Writing a Poem is discovering" అంటాడు. కవి ఏం డిస్కవర్ చేసే అవకాశం ఉంది, టెక్నిక్‌ని తనలోపలి అలజడిని ఛానలైజ్ చేయగల కళాత్మకతని, ఈ కళాత్మకతే మనం కవిత్వ నిర్మాణ పద్ధతి అనో, శిల్పమనో అనేది. ఇందులో భాగంగా కొంతమంది వర్ణనాత్మకతకీ, మరికొంతమంది కథనాత్మకతనీ, ప్రతీకాత్మకతనీ, భావ చిత్రాత్మకతనీ, అపరిచయీకరణాత్మకతనీ, సన్నివేశాత్మక నాటకీయతనీ ఇలా రకరకాల టెక్నిక్స్‌ని కవులు ఉపయోగిస్తారు. ఈ టెక్నిక్స్ అసంఖ్యాకం అవి ఇప్పటికే ఉన్నవి కావచ్చు, కవులు ఎప్పటికప్పుడు కొత్తగా కనిపెట్టినవి కావచ్చు. ఈ సంకలనంలోని కవుల్లో రెండు కోవలకు చెందిన సృజనకారులున్నారు. ఇప్పటికే అమలులో ఉన్న కళాత్మక సాఫ్ట్‌వేర్‌ను ఎఫెక్టివ్‌గా వాడిన వాళ్ళూ, కొత్త సాఫ్ట్‌వేర్‌ను కనిపెట్టిన వాళ్ళూ ఉన్నారు. వాళ్ళెవరూ అనేది కవితల్ని చదివే క్రమంలో, ఆస్వాదించే ప్రయత్నంలో మీరే తేలిగ్గా గమనిస్తారు. కవిత్వంతో నిమిత్తం లేకుండా స్వయం ప్రతిపత్తితో ఉండే సామాజిక వాస్తవికత నుంచీ, కవుల సృజన వ్యాపారం నుంచీ నిర్మితమైన కవిత పుస్తకానికెక్కి జనంలోకెళ్ళినాక దానికంటూ ఒక జీవితాన్నీ, దానిదే అయిన ఒక ప్రపంచాన్నీ పొందుతుంది. ఈ ప్రపంచం చదివే పాఠకుల

మానసిక దృక్పథాన్ని బట్టి మారుతూ, విస్తరిస్తూ పోవచ్చు లేక అంతరించీ పోవచ్చు. ఇదంతా చదివేవాళ్ళ, విశ్లేషించేవాళ్ళ నిర్దిష్ట మానసికతతో ముడిపడి ఉంటుంది. ఆ విధంగా కవిత్వంలో మానవ స్వేచ్ఛకు చెందిన రహస్యం వెల్లడవుతుంది నేనంటున్న మానవ స్వేచ్ఛ సాక్షికమనీ, కాలికమనీ, ఆవరణాత్మకమనీ వేరే చెప్పనవసరం లేదు.

అందుకే ఈ కవిత్వాన్ని ఆస్వాదించటానికి నేనేమీ ప్రత్యేక నిబంధనలు విధించటం లేదు. you are free to go about it in your own way.

ఇక ఈ కవితల సెలక్షన్స్ విషయంలో సమకాలీనత, సృజనాత్మకత, సాంకేతికత సమపాళ్ళలో కలిసిన కవితలకే పెద్దపీట వేయడం జరిగింది. సంపాదకులుగా ప్రతి కవితనూ చదివి వైవిధ్యాన్నీ, తాజాతనాన్నీ, పట్టుకోవడానికే నేను కానీ, నా సహ సంపాదకులు నిర్మలగారు గానీ ప్రయత్నించాం. కవితా క్రమం కూడా ఇతివృత్తపరంగానో, కవుల సీనియారిటీపరంగానో, కవితల గట్టితనం పరంగానో కాక, ఆయా కవితలు పత్రికల్లో అచ్చయిన తేదీల ప్రకారమే ఏర్పాటు చేశాం 'కవిత' నిర్వాహకుల గైడ్‌లైన్స్ ప్రకారం వారు చూపిన దారిలోనే మేమీ విషయంలో నడిచాం. మా పనికి చెందిన బాగోగుల్ని మీరు స్వేచ్ఛగా మీ అభిప్రాయాలతో బేరీజు వేయొచ్చు. కవిత్వాన్ని మాత్రం హాయిగా, ఆలోచనాత్మకంగా, సంవేదనాత్మకంగా చదువుకోండి. ఇందులో మనల్ని చిత్రవధ పెట్టే కవితలున్నట్లే అక్కడక్కడా చక్కిలిగింతలు పెట్టే కవితలూ ఉన్నాయి. పిడికిల్ని బిగింపజేసి యుద్ధానికి పంపే కవితలూ ఉన్నాయి. వెచ్చటి ఈ కవితల చేతుల్ని అందుకుంటారా, విదిలించుకుంటారా అనేది మీ ఇష్టం.

*Take it or Leave it.*

## 92 కవితలు ఇలా.....


| | | |
|---|---|---|
| 14వ మైలు రాయిని దాటుకుంటూ.... | 5 | సాహితీమిత్రులు |
| టేకిట్ ఆర్ లీవిట్ | 6 | జి. లక్ష్మీనరసయ్య |
| తిరిగిరాదు | 13 | మోహన్ రుషి |
| బిందు రూపాలు | 14 | నామాడి శ్రీధర్ |
| కందిరి | 15 | డాక్టర్ వాణీ దేవులపల్లి |
| మా నాన్న రైతు | 18 | వెంకటేష్ పైడికొండల |
| ఆమె చెట్టు | 20 | మెర్సీ మార్గరెట్ |
| యానాం ప్రేయసి | 22 | దేశరాజు |
| బొక్కెన | 24 | రామా చంద్రమౌళి |
| పనిముట్లు | 27 | జి. లక్ష్మీనరసయ్య |
| కూలగొట్టాల్సిందే | 29 | వఝల శివకుమార్ |
| దృశ్య ప్రవాహం | 31 | ఖాదర్ షరీఫ్ |
| మనుషులు | 34 | దేవిప్రియ |
| నిర్వాణం | 36 | అఫ్సర్ |
| అప్పుడప్పుడూ | 38 | పుట్టి గిరిధర్ |
| రిషితేశ్వరీ... రిషితేశ్వరీ... | 39 | కోసూరి రవికుమార్ |
| కనీస్త్రుటి చుక్క శబ్దం | 41 | వైష్ణవి శ్రీ |
| నేలమాలి | 42 | కొత్తపల్లి సురేష్ |
| సిగ్గుపడదాం రండి | 43 | ఉదయమిత్ర |
| ఆమె.. అదృశ్య చిత్రం | 45 | తోట నిర్మలారాణి |
| ఒక కవిత | 46 | హెచ్చార్కె |
| చదువలేదు | 48 | స్వేచ్ఛ |
| నాన్న జ్ఞాపకం | 49 | ఆకెళ్ళ రవిప్రకాష్ |
| పంజరం చిలుక | 51 | అనిల్ డ్యాని |
| పర్యావరణం | 54 | గరికపాటి మణీందర్ |
| ఉరితాడు | 55 | డా. పత్తిపాక మోహన్ |
| క్యాష్‌లెస్ ఈగిల్ | 57 | వడ్డెబోయిన శ్రీనివాస్ |
| మాట్లాడే మనిషి | 59 | పల్లిపట్టు నాగరాజు |
| నేను | 61 | చెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి |

| | | |
|---|---|---|
| గిట్ల గిట్ల అనిపిస్తది | 63 | కందికొండ |
| ప్రేమ ఋతువుని | 65 | కృపాకర్ మాదిగ |
| కలడంబేద్కరు నా సహోదరుడు... | 67 | తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ |
| చిగురించే కాలాన | 69 | బండ్ల మాధవరావు |
| బోధివృక్షం నీడలో | 72 | దర్భశయనం శ్రీనివాసాచార్య |
| ??? | 74 | వేణు ఊడుగుల |
| నీడలు | 77 | లాస్యప్రియ కుప్పా |
| పాములూ పద్యాలు | 78 | మమత |
| దక్షిణం వైపు ఇల్లు | 80 | మానస చామర్తి |
| మిరప కోరులో | 82 | పాపినేని శివశంకర్ |
| వూరూ... నేనూ..వానా... ఏరూ... | 84 | సిద్ధార్థ |
| ఏ దృశ్యమూ అస్పృశ్యం కాదు | 87 | సతీష్ చందర్ |
| ఒక దుఃఖానికి కొంచెం ముందు.... | 90 | బొల్లోజు బాబా |
| మార్కెట్ శ్మశానంలోకి | 91 | యింద్రవెల్లి రమేష్ |
| రూపాయి | 93 | అరసవిల్లి కృష్ణ |
| రాత్రి చెరువొద్దు | 94 | విజయ్ కుమార్ ఎస్వీకే |
| అవసరంలాంటిదే | 95 | కాశిరాజు |
| డెజావు | 96 | శ్రీకాంత్ కె. |
| మాఊరి పురాణం | 98 | మామిడి హరికృష్ణ |
| పిట్టల తొట్టెలు | 102 | మునాసు వెంకట్ |
| ఖర్మభూమి | 104 | సిరికి స్వామినాయుడు |
| మాస్టారూ | 106 | నూకతోటి రవికుమార్ |
| ది రెయిన్ డాన్స్ | 108 | నరేష్కుమార్ సూఫీ |
| నగర 'వరూధిని' | 110 | అశోక్ ఆవారి |
| దువా | 112 | షేక్ కరీముల్లా |
| కల దొంగిలించబడింది | 114 | ఊర్మిళ |
| నల్ల జెండాలు | 116 | శ్రీరామ్ పుప్పాల |
| ఘర్ వాపసీ | 117 | వరవరరావు |
| నశ్యెం డబ్బ | 120 | వడ్లకొండ దయాకర్ |
| దిగులు మబ్బు | 123 | మహమూద్ |
| నక్షత్రాల పంట | 125 | శిఖా-ఆకాష్ |
| జొన్న రొట్టెలు | 127 | రమేశ్ కార్తీక్ |
| సంకేతం | 129 | కె. శివారెడ్డి |
| జీవ బంధం | 131 | గోరటి వెంకన్న |

| | | |
|---|---|---|
| ఖాళీ గమ్యం | 134 | ఎం.ఎస్. నాయుడు |
| నేను లేను... | 135 | కృష్ణుడు |
| తలుపులు | 137 | పాలపర్తి ఇంద్రాణి |
| డెలీరియం | 138 | పసుపులేటి గీత |
| పాలమూరు వలస | 140 | ఎన్. గోపి |
| రోహింగ్యా | 142 | అజిత |
| కవనవనం | 145 | టి. నందకిషోర్ |
| ప్రజాయుద్ధ కనుపాప | 148 | సంహితా కిరణ్ |
| నేల ఈనుతుంది | 149 | దేవరాజ్ |
| ఆమె | 152 | రేఖాజ్యోతి |
| సోహం | 153 | దాము |
| బైపాస్ | 154 | రమణ జీవి |
| నీడ్స్ వర్సెస్ ఛాయిస్ | 155 | అరుణ గోగులమండ |
| నాన్న గొడ్డలి | 157 | తగుళ్ళ గోపాల్ |
| కవిత్వం వెలిగితే దీపం ఎందుకు? | 159 | కొండేపూడి నిర్మల |
| అచేతనం | 161 | కోడూరి విజయకుమార్ |
| తాత కోసం | 163 | ప్రసాదమూర్తి |
| లవ్ జిహాద్ | 165 | సాబిర్ |
| పచ్చి కడుపు వాసన | 167 | యార్లగడ్డ రాఘవేంద్రరావు |
| పగలు - రాత్రి | 170 | పాయల మురళీకృష్ణ |
| ముఖం తుడుచుకుంటుంది నగరం | 171 | అరుణ నారదభట్ల |
| సిట్టి గువ్వ | 173 | అందెశ్రీ |
| మోహనా! | 175 | లెల్లె సురేష్ |
| ష్...! | 177 | యాకూబ్ |
| మట్టి పొరల్లోంచి | 179 | బాల సుధాకర మౌళి |
| వలస | 183 | కాట్రాజు లావన్య సైదీశ్వర్ |
| అంతర్జాలం ప్రేమ | 185 | సునీత చొల్లేటి |
| నాకు యుద్ధమో, శాంతో కావాలి | 186 | రెహనాబేగం |
| ధిక్కార కలం - స్వరం | 187 | ముసునూరి ప్రమీల |
| కలగంటున్నాను | 188 | శిఖామణి |
| ఊరిగాలి | 191 | నందిని సిధారెడ్డి |

# తిరిగిరాదు

మోహన్ రుషి - 83417 25452

మరింత ప్రేమ దొరికివుండేది.

అందినదాని విలువ తెలిసివుంటే.
వున్నది అలుసుగా చూడకుంటే, కోల్పోతేగానీ
చూపు నేలకు దిగకుండా వుండివుంటే.
నమ్మకం నాలుగు పాదాల మీద నడిచే కాలం
కాదు. నడ్డి విరిగింతర్వాత ఏ కేపాల్ కట్టూ
పనికిరాదు. స్పందించుటలేదు వినా మరో
సమాధానం వినబడదు.
అంటుకడితే ఆనందమయ్యేది. అల్లుకుంటే
పరిమళమయ్యేది. నింపుకుంటే గుండెనిండా
ఒదిగిపొయ్యేది. కాదనుకున్నందుకే కల
నిజం కాకుండాపొయ్యింది.
గుండెచప్పుడు వినగలిగితే, గుర్తులు పదిలంగా
భద్రపర్చగలిగితే. మబ్బుల్లోని నీళ్ల మాయను
చూడగలిగితే. హృదయాన్ని హృదయం వైపుకు
ఇంకొంచెం జరపగలిగితే.
తప్పకుండా మరింత ప్రేమ దొరికివుండేది.■

*సాక్షి 2, జనవరి 2017*

# బిందు రూపాలు

నామాడి శ్రీధర్ - 93968 07070

తెలతెలవారే కొలనులోంచి
రెండు కలువల్ని కోసితెచ్చాను
ఒకటి కుంకుమ యెరుపు
మరొకటి పరాగమంటిన పాలవన్నె

ఆది మధ్యాంతం
ఒక్కగానొక్క రోజు జీవితం కాబోలు
చిమ్మచీకటి నుంచి
దిగంతంలోకి గురిచూచి పూచిన పూలు

నీ ముద్దుపేరు 'సూర్యకాల'
నువ్వేమో 'చంద్రశాల' అని పిలిచావు

రాతబల్ల మీది వాజ్‌లో
పెంపుడుతల్లి వొడిలో మల్లే
నిశ్చింతగా పవళించాయి అపరాహ్నవేళకి

అవి మేలుకొనే ఘడియ కోసం
కాపుదలలో మాటిమాటికీ ఆశపడిన
ఎదురుచూపుల రెప్పలు మూసికొని
కనులు తెరచుకున్నాయి అంతర్లోకాన

తుళ్ళిపడిన మళ్ళీ పొద్దు లేచే సరికి
ఎదురుబదురుగా చిరునవ్వుతో
రేకులు చాచిన నవనవ కలువలు
అనుదిన మృత్యు భీతి యెరుగని
రాత్రింబగళ్ళకి బిందురూపాలు. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 2, జనవరి 2017*

# కందిరి

డాక్టర్ వాణీ దేవులపల్లి - 98669 62414

నా చిన్నప్పుడు...
మొదటిసారి అమ్మమ్మ వాళ్ళింట్లో చూసాను
ఎక్కా బుడ్డి దీపాన్ని; కందిలినీ!

రోజంతా పక్కపక్కనే తల్లీబిడ్డల్లా...
చూడముచ్చటగా ఉండే ఆ దీపకాంతలు -
రాత్రిళ్ళు మాత్రం తప్పని ఎడబాటుతో
ఎక్కెక్కి వెలిగేవి!

అలనాటి ఆ అపురూప దీపశిఖలంటే
నాకిప్పటికీ అంతులేని మైమరపే!
పేదవాడి సెంటులాంటి ఆ దీపికల-
గ్యాసునూనె పలకరింత నాకిప్పటికీ పులకరింతే!

సందెవేళయిందంటే సాయబానులో కూర్చొని -
కందిలి, ఎక్కా గాజు బుగ్గలను
ఒడుపుగా పట్టుకుని ఓపిగ్గా అవలీలగా శుభ్రం చేసే
మా అమ్మమ్మ తలపు ఓ మనసైన అబ్బరమే !

మా యింట్లోనయితే -
కరెంటు పోయినప్పుడే కాదు
కరెంటు బిల్లు కట్టలేకపోయినప్పుడే
తెలిసింది నాకు కందిలి అందాలు !

ఇంటెనక కరివేపాకు చెట్టుకింద

కరిమబ్బుల్లా ముసురుకున్న
కందిలి బుగ్గ మసిని
పాలనురగ సొగసుతో
పారదర్శకంగా మెరిపించాక –

కందిలి ఆకుపచ్చ అద్దకం ఫ్రేములో
మధ్యన వేలాడే –
నాజూకు ఇనుప చిమ్మీల తొడుగులో
అమ్మ ఒడుపుగా ఒదిగించే కందిలి గాజు బుగ్గ
హరిత హారానికి చందమామను తొడుగుతున్నట్టుగా –
ఓ అద్భుతంలా తోచేది!

అమ్మ దినచర్యగా చేసే ఆ పనిని
అదేపనిగా –
బుగ్గన చేతితో ఇంతేసి కళ్ళతో
ఆశ్చర్యంగా సంభ్రమంగా అవలోకించడం
నాకో ఆకుపచ్చని జ్ఞాపకం !
అలవాటులేని పనేమో !
హఠాత్తుగా గాజుబుగ్గ పదునైన అంచు
చేసిన గాయంతో –
పాలరాతిలాంటి అమ్మచేతులు
సర్రున చిందే రక్తంతో
మోదుగుపూల ధారలు చిమ్మేవి !

అప్పుడు అమ్మ 'అమ్మా' అంటూ –
చేసిన ఆర్తనాదం –
పరలోకంలో ఉన్న వాళ్ళమ్మకు తప్పక వినిపించే ఉంటుంది !

సాయంకాలానికల్లా ఆ రాత్రి వెలుగులు పంచడానికి
అందంగా ముస్తాబైన కందిలి –
రాత్రి చీకటిని ఒళ్ళంతా పులుముకొని

మరునాటి పొద్దుటికల్లా మసిబారి
పసివాడి పోయేది !

కానీ, మళ్లీ అమ్మ చేతుల్లో
తెల్ల కాలువ కాంతులతో విచ్చుకుని –
జాబిలి వెలుగులు ఇల్లంతా రువ్వుతూ –
ముద్దబంతి ముగ్ధత్వంతో
'వెన్నెల ఇంతి'లా –

మా ఇంటి మధ్య 'వసారా'లో
కళకళలాడుతూ –
దర్జాగా ఒదిగి కూర్చుని
ఒయ్యారాలొలకబోసేది
అందాల కందిలి !■

*నవ్య 4, జనవరి 2017*

# మా నాన్న రైతు

వెంకటేష్ పైడికొండల - 81215 33112

పొద్దున్నే
పొలం వెళ్ళే మా నాన్న శిరస్సున
కిరీటంలా అమరిపోతాడు సూర్యుడు

చీకటి గబగబా పక్కకి తప్పుకొని
వెలుతురు దారి చూపిస్తుంది

చేనుగట్లు రోజూ
ఆయన పాదాల్ని ముద్దాడుతాయి

కొబ్బరి, అరటి, బత్తాయి, వంటి చెట్లు
ఆయన చేతుల్లో పురుడుపోసుకుంటాయి

మా నాన్న వ్యవసాయం చేస్తాడు
ప్రపంచం ఆయనతో వ్యాపారం చేస్తుంది

దాంతో ప్రపంచం లాభాల్లో తేలుతుంది
ఆయన నష్టాల్లో మునుగుతుంటాడు

డబ్బులు దాచుకుంటే డబ్బులొచ్చే రోజులుగాని
డబ్బులు నాటినా డబ్బులు రాని రోజులు కదా
పొలం అమ్మేసి డబ్బు బ్యాంకులో వేద్దాం అంటాన్నేను

చిన్నగా నవ్వేసి
వ్యవసాయం వ్యాపారం కాదు

రైతు వ్యాపారి కాదు అంటాడు నాన్న.

రైతులంతా మా నాన్నలాంటి వారే

పరవాలేదు
మనుషులకింకా భూమ్మీద నూకలున్నాయి
ఈ ప్రపంచం ఇంకొన్నాళ్లు తిండి తింటుంది ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 23, జనవరి 2017*

## ఆమె చెట్టు

మెర్సీ మార్గరెట్ - 9052809952

ఆమె
మాయమైపోయిందని చదవడం
కొత్తేమి కాదు
వో సందర్భం నుంచో
సమూహం నుంచో
సమిష్టి జీవనం నుంచో

పొరలు పొరలుగా
భూమిలోకి వర్షపు నీరింకినంత సునాయాసంగా
మాయమైపోవడం
ఆమెకి కొత్తేం కాదు
దుఃఖపు వస్త్రాన్ని త్యజించే
చోటుకూడా లేని ఆమె
నిర్మల సౌకుమార్య దీపపుంజమై
వెలుగులాంటి చీకటి తెరకింద
కనీ కనపడకుండా మాయమైపోవడం
ఆమెకి కొత్తేం కాదు

ఆమె మీద అక్షరాలు రాయబడో
అక్షరాలు ఆమెని తమ కింద నలిపేసో
వో అసంపూర్ణ కావ్యంలా ఆమె రెపరెపలాడుతుంటే
కాయితాల్ని తిప్పినట్టు
ఆమెను కనబడకుండా తిప్పేయడం కొత్తేంకాదు

ఆమె రక్తమాంసాల చెట్టు
ప్రతినెలా
నెత్తుటి ప్రవాహమయ్యే వెన్నెల ముద్ద

ఆమె
వేయిబాహువుల వ్యాపిత
కల్లోలిత కలల జీవనసంఘర్షణా తీరాన
వెలుగుచేతులతో దుఃఖితులను హత్తుకునే
లైట్ హౌస్. ■

*నవతెలంగాణ, 23, జనవరి 2017*

# యానాం ప్రేయసి

దేశరాజు - 99486 80009

ప్రేయసి ఏకవచనమనుకునేవాడు మూర్ఖుడు
ప్రియురాలు బహువచనమని గ్రహించినవాడు-
నిత్య యవ్వనుడు

❊

ఉషోదయాన తెలిమంచు తెరల మధ్య
విచ్చుకునే వలల అలికిడికి
ఒళ్లు విరుచుకునే మిలమిలల గోదారి
పొద్దెయ్యాక స్లీవ్‌లెస్ టాప్ వేసుకుని
చేయిచాపే అమలాపురం బ్రిడ్జి
పరలోక ప్రాప్తి కోసం ప్రార్థించమంటూ
రెండు చేతులూ సాచి ఆహ్వానించే ప్రభువు
ఓరకంట నవ్వే వగల వగల గోదావరి

మిట్ట మధ్యాహ్నం పచ్చని పైట తొలగిన
కోరంగి రేవు మీదుగానో, మడ అడవుల మాటుగానో
కస్సున కసిదీరా కాటేసే ఉద్వేగ తరంగాలు
ఇంకా రాత్రంతా రక్తం కక్కుకు చావాల్సిందే
సముద్రంతో కలిసి కులికే ముసిముసి గోదారి

సాయంత్రం వేళ
అరుణిమ దాల్చిన అలల బుగ్గలతో
ఒంటరి నావలను ఒక్కటిగా అక్కున చేర్చుకుని
తనివితీరా ముద్దాడే వేయి పెదవుల తమకాల గోదారి

పరిమళాలను పొదుపుగా జారవిడుస్తూ తడబడే దేహాలు
ఈఫిల్ టవర్ అద్దాల్లో మైమరపు ప్రతిఫలనాలు
గిరియం పేట చుట్టూ గిరగిరా తిప్పే కెరటాల తిమ్మిరి గోదారి

సాయంత్రం చీకటిగా మారబోయే వేళ
నిద్రగన్నేరు పూలు పరుచుకున్న ఫెర్రీ రోడ్డు చివర
తెలిసురగం నవ్వుల పాటల గుసగుసల గోదారి
మెర్క్యురీ లైట్ల నీడల కింద
ఊగుతున్న మోహపు ఊలు దారాల మధ్య
కనుపాపల కోయిలల గాన కచేరి
గాలి పెదవులతో గోలగోల చేసే ఈల గోదారి

✻

యవ్వనం ఒక రుతువు
అది మళ్లీమళ్లీ వస్తుంది ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 23, జనవరి 2017*

## బొక్కెన

రామా చంద్రమౌళి – 93901 09993

వృద్ధాశ్రమం కిటికీ అవతల వరండాలో కురిసే వెన్నెల
అక్కడక్కడా చెట్లు... మౌనంగా... నిశ్శబ్ద శృతి
తీగలు తెగిపోయిన తర్వాత రాగాలు
చిట్లిపోయినట్టు
శబ్ద శకలాలు చిందరవందరగా
గోడలపై మేకులకు వ్రేలాడ్తూ...
చిత్రపటాలౌతాయి
జ్ఞాపకాలూ, కన్నీళ్ళూ, ఎండుటాకుల
సవ్వడులుగా
అన్నీ... అడుగుజాడల వెంట
మట్టిచాళ్ళలో నీటిజల వలె జారుతూ...
పారుతూ
పిడికెడు గుండె వాకిట్లోకి
స ర్ ర్ ర్ ర్ న... ఒక బొంగరాన్ని విసిరేస్తాయి
హృదయంపై ముల్లు గిరగిరా... పొక్కిలి చేస్తూ
ఏదోమొన దిగుతూంటుంది లోపలికి
తొలుచుకుంటూ
ఎర్రగా రక్తం.... ఏవీ... రెండు బొట్ల కన్నీళ్ళు
గాలితుఫానులా తరుముకొస్తుండగా
ఆ రోజురాత్రి మట్టి ప్రమిదల్లో మనం
వెలిగించిన దీపాల పెనుగులాట

అటువేపేమో హోరుగాలి
ఇటువేపు.. నల్లని ఇంక్‌లా... కుమ్మరించబడ్తున్న చీకటి
నడుమ ఎర్రగా... అప్పుడే జ్వలిస్తున్న గాయం
ఒక అగ్నిమొలక... రక్తనేత్రం
ఇంతకాలం.. దశాబ్దాలకు దశాబ్దాలుగా
నడచి వచ్చిన తర్వాత
వెంట ఎవరో ఉంటారనుకున్న భ్రమ...
ఒక తెగిన గాలిపటమై
ఒంటరి... ఒంటరి అడుగులు...
ఒంటరి ప్రయాణం... ఒంటరి దుఃఖం
కమ్.. హగ్ మీ
ఒక ఆర్ద్రమైన అగ్నిస్పర్శతో నన్ను దహిస్తూ
దహిస్తూ హత్తుకో
కరిగి కరిగి... కనలి కనలి
ఎర్రని నిప్పుకణికలపై కాలుతున్న మొక్కజొన్న కంకిలా
రోల్... రోల్.. తిప్పబడి తిప్పబడి
లోపల ఉడికిపోతూ... పైన అన్నీ నిప్పుమరకలు
హింసరా తండ్రీ... జానెడు జాగాకోసం,
రవ్వంత బంగారం కోసం... బెత్తెడు మానం కోసం
స్తనాలపై విస్తరించాలని తపించే రెండు చేతుల
దాహంకోసం
ఎన్ని ఖడ్గ ప్రహారాలో, ఎన్ని వ్యూహ విలాపాలో
గడీల్లో, కోటల్లో, దుర్గాల్లో, దుర్భేద్య
శిలా ప్రాంగణాల్లో
ఎలుగెత్తి ఎలుగెత్తి అరిచే ఆక్రందనలన్నీ
ఒట్టి... మట్టిలో మరికొన్ని రేణువులే...
అశ్రుతుంపర
మనిషిలో దుమ్ములా... దాగి దాగి

దోబూచులాడే
ఒక శిశువు... ఒక జంతువు.. ఒక దేవత
మనిషిలో వర్తులమై భ్రమించే ఋతుక్రీడ–
ఒక మోటబావి నుండి తోలుతిత్తి గోళెం నీళ్ళను
మోసుకొస్తూ మోసుకొస్తూ
తాడు ఫటేల్మని తెగిపోయిన తర్వాత
బావి ఎవరిదో... మోట బొక్కెన ఎవరిదో... నీరు
ఎవరిదో
అసలు... యుగయుగాలుగా అడుగులను మోస్తున్న
ఈ భూమి ఎవరిదో –

....

ఎదురుగా... గిరగిరా తిరుగుతూ భూమిని
తొలుస్తూ
బొంగరం ముల్లు,
ప్రక్కన తాడు... నిశ్చలంగా... నిసర్గంగా ■

*నవ్య 25, జనవరి 2017*

# పనిముట్లు

జి. లక్ష్మీనరసయ్య – 98494 08204

తెగటానికి కొయ్యటానికీ నడుమ
దారం అంచు మీద అంచలంచల కసరత్తు చేసి
నునుపు అందాన్ని
మెరుపు కొసలకందించే మడక కత్తి.
తల చుట్టూ పిచ్చుకలా రెక్కలార్పుతూ
తలకొక ప్రపంచాన్ని నిర్మించే కత్తెర.

ఒళ్ళు కందకుండా
ముల్లును గల్లా పట్టుకుని బయటికీడ్చే గోరుగల్లు
కొత్త జంట కాలిగోళ్ళ మీద కురిసే
సుతారపు జల్లు.

కత్తి చర్మాన్ని కొంచెం కొంచెంగా ఒలిచి
కక్కుపెట్టే సానరాయి
మెదడు నాదును మెత్తగా నూరి
సాదు చేసే మాలిష్ చేతులు
ఒక తాజా కేరింతను లోకానికి
ఒక లోకాన్ని తాజా కేరింతకీ
సమర్పించే చేతులు.
ఒక తల్లి శరీర మూల రహస్యాల మీద
హార్మోనియం వాయించే మంత్రసాని చేతులు
ఆత్మను అత్తరు గీతం చేసి సంగీత పడవల్లో

సమయ సముద్రాల్ని దాటించే సన్నాయి.
కళపెళా కదిలి పందిరికి స్పందన తెచ్చే డోలు.
వేదాంతి నిలకడలా ఉదరంతో శ్వాసించే సుతిబూర
ఇల్లు ఇల్లుగా పెళ్ళి పెళ్ళిగా పుట్టుక పుట్టుగ్గా
బతుకు బతుగ్గా మొగ్గ తొడిగే మేళం.

మా పనిముట్లు కనికట్లు కావు.
మాకే మంత్రాలూ రావు
బతుక్కి కళల రక్తాన్నెక్కించడటం
కళలకి బతుకు వారసత్వాన్నివ్వటం
మా విద్య

నెర్రెలిచ్చిన లోకం గుండెకు మేము కట్టే
పసరుకట్లు మా పనిముట్లు
మీ అందరి మీద మా వృత్తి
రోజూ ప్రేమగా రాల్చే వెలుగు పొరలు
మా పనిముట్లు

ఉపాలి కపాలం నుండి ఊడిపడ్డ
ఈ వినయ మాధుర్యాలు
సేవను సౌందర్య భాషలోనే పాడే
మా పనికి సజీవ సంకేతాలు
మంగలత్వమే మధురమని ఎలుగెత్తే నినాదాలు. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 30, జనవరి 2017*

# కూలగొట్టాల్సిందే

వఝల శివకుమార్ – shivakumarvajjala@gmail.com

కూలగొట్టాల్సిందే
బాహ్యంగానే కాదు ఆంతర్యంలోనూ
ముక్కలౌతున్న మనిషిని పునర్నిర్మించుకుంటూ
మాటై నిలువడానికి కూలగొట్టాల్సిందే.
స్వార్థాన్నో స్వప్రయోజనాన్నో
అహాన్నో అభిజాత్యాన్నో వేటినైతేనేం
పాతుకుపోయిన పాతవాసనలన్నిటినీ
నిస్సంకోచంగా ధ్వంసం చెయ్యాల్సిందే

ప్రయోజనం సామూహికమైనప్పుడు
ప్రయాణం సామయికమైనప్పుడు
ఏ కార్యమైతేనేం కొనసాగించాల్సిందే
పొంతనలేని చర్యలకు చూపుండదు
చింతనలేని ఆదర్శాలకు వైపుండదు

ఎన్నాళ్ళని ఆశ్రయిస్తాం
సమర్థించుకున్నప్పుడల్లా
ఓ అబద్ధపు వంకనో, ఓ వాగ్దానపు ఎరనో
ఎన్నాళ్ళని ఆశ్రయిస్తాం.
మాయ కనపడకుండా, మాట పెగులకుండా
ఎన్ని కళ్ళని మూస్తాం
ఎన్ని నోళ్ళని నొక్కుతాం
ఆవులింతను ఆపేసుకున్నా

పేగుల లెక్క కాలవాహికలో రికార్డవుతూనే ఉంటుంది

పురెక్కిస్తున్న వాళ్ళను పుట్టెడు అవసరాలు
ఎగదోస్తున్న వాళ్ళవి ఎన్నో కుట్రలు
పరిగెత్తే ఎడ్లకు కళ్ళున్నా చూడలేవ్
ములుగర్రనుబట్టే వేగం
పగ్గం ఎవరిచేతిలో ఉందన్నదే ప్రశ్న.
పతనం అంచు మీద
ఆశలూ పగబడుతయ్
పాశాలూ పగబడుతయ్
దేని టార్గెట్ దానిదే.
మనసుగా కదిలిందానికీ
మనిషిగా మిగిలిందానికీ మధ్య దూరం
ఆచరణకు ఆయువైనంత

ఔను కూలగొట్టాల్సిందే
ఒక నిర్మాణంగా నిలిచి
నిర్వచనంగా మిగులకపోతే
గతం వర్తమానానికి పారమై
రేపటికో చూపునివ్వలేకపోతే
కాళ్ళులేని మరో కథ కంచికి చేరుతుంది
తన కళ్ళు తానే పొడుచుకుంటూ
మళ్ళీ కాలం కబోదిలా మిగిలిపోతుంది.■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 30, జనవరి 2017*

# దృశ్య ప్రవాహం

ఖాదర్ షరీఫ్ - 94419 38140

కొన్ని దృశ్యాలు
గుండెని నిశ్శబ్దంగా గాయపరుస్తాయి
అవి కన్పించాలంటే కళ్ళముందున్న పొరల్ని చీల్చాలి
ధగ్ధమయిపోయిన బ్రతుకులు కదుల్తూ ఉంటాయి
మట్టి రెక్కలు కూలిన మనుషులు కన్పిస్తారు
ముక్కలయిన ఇంద్రధనస్సులు కాళ్ళకి గుచ్చుకుంటాయి
మానని గాయాలు కళ్ళముందుకొచ్చి పలకరిస్తాయి
కన్నీటి చుక్కల వర్షం ఒక్కసారిగా తడుపుతుంది
తల్లి శవాన్ని అసహాయంగా భుజానికెత్తుకున్న
నిర్భాగ్యపు తనయుడు నీకు ఎదురుపడతాడు
కొన్ని సజీవదేహాలు మైలు రాళ్ళలా పాతబడి ఉంటాయి
అవయవాల్ని అమ్ముకుంటున్న
అభాగ్యులూ ఉంటారు.

కొన్ని దృశ్యాలు
ఒక కొత్త సత్యాన్ని విప్పిచెప్పి
నిన్ను మనిషిని చేస్తాయి.
విశ్వాసం నేర్పించి నీ వెంటే
తోకూపుకుంటూ తిరుగుతాయి
జీవపరిమళంతో నిన్ను చుట్టుకుని
బ్రతుకుని రాగ రంజితపు
ఉయ్యాలలో పరుండబెడతాయి

నీ జీవితానికి వారధి అయి
బరువెక్కిన గుండెతో
నిన్ను ప్రేమిస్తూ కూర్చుంటాయి
నిన్ను సంస్కరించాలని కాదు గానీ
నీకు సంస్కారం నేర్పించాలనే
వాటి తపనంతా
కొన్ని దృశ్యాలు
నీ లోకంలో నిన్ను విహరించనిచ్చి
నిన్ను నీవు నిర్మించుకోవాల్సిన చోట
ఒక సజీవకావ్యాన్ని నాటి
ప్రేమగా నిష్క్రమిస్తాయి
అవి ప్రవహిస్తున్నంత మేరా
నువ్వే ఉంటావందులో
వాటిని చూడ్డం నీకు
అలవాటయిన పనికాదు గానీ
అవి ఒక మహత్తర శక్తి కల్గి ఉంటాయి.
నిన్ను విహంగాన్ని చేసి
ఆవిష్కరించగల్గిన శక్తిని
విశ్వమానవునిగా నిన్ను చెక్కే
ధైర్యాన్నీ కల్గి ఉంటాయి
నీ తరతరాల స్వప్నపు ఆశల పల్లకిని ఊపి
ప్రాణవాయువుతో నిండిన శిఖరాన్ని చేస్తాయి

కొన్ని దృశ్యాలు
వెంటాడుతూనే ఉంటాయి
నిరంతరం దహన సముద్రంలోకి నెట్టి
నిర్దయగా వెంటాడే కాలాన్ని మెడలో వేసి
నీ కుడిచేతికి ఒక రసవద్గీతికని చుట్టి
మనిషికి మనసుకి మధ్య

ఒక విభజన రేఖని గీస్తాయి
ఆత్మీయ వాసన లేని ఈ ప్రపంచం నుంచి
దూరంగా తీసుకుపోయి
రాజీ పడని బ్రతుకులోంచి
నిన్ను వెలుతురు పూల చితిమీదికి చేరుస్తాయి.

కానీ ఏదో ఒక దృశ్యం అనునిత్యం
నీ గుండెలో రగులుతూనే ఉంటుంది
'దృశ్యం' జీవంతో ఉంటేనే నువ్వున్నట్లు
లేకుంటే నిజంగా లేనట్లే
ఖచ్చితంగా లేనట్లే... ■

*'కవితా!' 43, జనవరి 2017*

# మనుషులు

దేవిప్రియ – 98661 11874

మనుషులు
రెండే రకాలు :
మరణించిన వాళ్ళు,
మరణిస్తున్న వాళ్ళు...
మంచివాళ్ళు,
మంచివాళ్ళు కాలేకపోయినవాళ్ళు...

మనుషులు
రెండే రకాలు :
గెలిచిన వాళ్ళు,
గెలవలేకపోయిన వాళ్ళు...
అరణ్యాలు దాటిన వాళ్ళు,
దాటలేకపోయిన వాళ్ళు...

మనుషులు
రెండే రకాలు :
పూలతోటలుగా మారినవాళ్ళు,
మారలేకపోయిన వాళ్ళు....
తోడేళ్ళుగా మారిన వాళ్ళు,
మారలేకపోయిన వాళ్ళు...

నిజానికి మనుషులు
రెండే రకాలు :

మనుషులూ,
మనుషులుగా మారలేకపోయిన వాళ్ళు...
తిరగబడిన వాళ్ళు,
తిరగబడలేకపోయిన వాళ్ళు....

మనుషులు ఇపుడున్నది రెండే రకాలు :
మరణించిన వాళ్ళు,
మరణించబోతున్న వాళ్ళు.... ■

*'కవితా!' 43, జనవరి 2017*

# నిర్వాణం

అఫ్సర్ – afsartelugu@gmail.com

1

మెతుకు మెతుకూ పట్టి
జీవితాన్ని వెతుక్కుంటాను కాబట్టి
నేనెప్పుడూ వొకే భాష మాట్లాడ్తాను
ఇన్ని కన్నీళ్ళ గాట్లూ చీకట్ల ఆటుపోట్లూ
ఆ వొక్క మెతుకులోనే జీర్ణించుకుపోయాయి కాబట్టి
నేనెప్పుడూ
నిన్ను అన్నమ్మెతుకుల నిలువెత్తు అద్దంలోకి దాచుకుంటాను
ఇంకో వేరే యే అద్దంలోనూ నువ్వే కాదు, ఇంకెవరు దొరకరు
ఇంత కచ్చితంగా స్ఫుటంగా పటం కట్టినట్లుగా

2

నేనెప్పుడో ఎంగిలిపడి పోయాను కాబట్టి
యిప్పుడే వండినంత వేడిగా మెరుస్తూ కనిపంచలేను
నా వొంటికేదో పచ్చడి ఎరుపో పెరుగు మెరుపో అంటుకునే వుంటుంది
వొక్క అన్నమ్మెతుకునే కదా
నీలోపల ఉరకలెత్తుతూ వుప్పొంగి వచ్చే ఆకలి కెరటాల్ని
నేనేమీ అడ్డుకోలేను నిజమే
కాని యీ అరక్షణంలో పరవశమై వెలిగిపోతాను నీ కళ్ళలో
వొక్క మెతుకే కదా అనుకుంటావ్ తేలిగ్గా
కానీ

నా లోపల యేమున్నాయో నీకు తెలుసు
నేను లేని లోకంలో యేమేం లేవో కూడా నీకు తెలుసు

3

అన్నముద్ద వొక్కటే నా కలల్లోకి వచ్చి వెళ్తూ వుంటుంది
నీ ప్రేమలో
ని నవ్వులో
నీ కన్నీళ్ళలో
నీ నిట్టూర్పులో
వాయిదా పడుతూనే వున్న అనేకానేక సంబరాల్లో
నేనెప్పుడూ పోగొట్టుకునేది ఆ అన్నమ్ముద్ద వొక్కటే
నేను నిలకడయ్యే అంతర్ తీర్థయాత్రలూ
నన్ను కొట్టుకెళ్ళి ఎక్కడో విస్సిరి కొట్టే రాగద్వేషాలూ అన్నీ
అక్కడే మొదలూ అక్కడే ముగింపూ

4

అవున్నేను
ఆకలికే పుట్టాను
ఆ ఆకల్లోనే ఏ క్షణమైనా రాలిపోతాను
జన్మల్ని నమ్ముతానో లేదో కాని
యింకో పది జన్మల్లో కనీసం ఎంగిలి మెతుకై పుట్టుకొస్తా
పస్తు పడుకునే యే కడుపులోనో
హాయిగా సమాధి అయిపోడానికి ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 13, ఫిబ్రవరి 2017*

# అప్పుడప్పుడూ

పుట్టి గిరిధర్ – 94914 9070

ఒంటరితనపు సరస్సులో
ఓ పిచ్చుక పలుకులను విసిరేస్తే
అంతరాయమా కాదది ఆదరణ
శూన్యాన్ని ముక్కున కరుచుకొని
అలజడిని రేపి ఎగిరిపోయింది ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 13, ఫిబ్రవరి 2017*

# రిషితేశ్వరీ... రిషితేశ్వరీ...

కోసూరి రవికుమార్ - 94913 36488

క్రోధమెలా పుడుతుందో...!?
కొన్ని సందర్భాల నుంచీ....
కొన్ని పంటి బిగువుల భరింపబడే దుఃఖాల నుంచీ...
ప్రాణ పత్రం నేలరాలిందని
హఠాత్తుగా అందుకున్న కబుర్ల నుంచీ
ఎటునుంచైనా పుట్టొచ్చు... క్రోధం
క్షణికావేశం అని కొందరంటారు గానీ
క్షణాలు ఆవేశాలుగా మార్పు చెందాల్సి వచ్చే
అవలక్షణాల గురించి ఆలోచించరు.
వేధించి
వేటాడి
తగులరాని చోట తగుల బెట్టి
లోలోపలే కాలిపోయేంత
మంటబెట్టిన ప్రవృత్తులు
మార్చురీ బయటే ఎలా నిలబడగలిగాయి

అప్పటిదాకా
తిరిగొస్తుందనుకున్న చిట్టి వాసంతం
ఎడతెగని గ్రీష్మాన్ని ఎదలో నాటి
నిలువునా కూలిపోతే...
చూట్టానికెంత నిబ్బరం కావాలి
లాస్ట్ నోట్‌లో కూడా వాళ్ళ పేర్లు రాయలేనంత

మానవీయత నీకిచ్చన పెంపకానికి
నమస్కరించాలి

రిషితేశ్వరీ... రిషితేశ్వరీ...
హైనాల్ని బహిష్కరించి....
నీలాంటి నెమళ్ళను పోగేయాల్సింది పోయి..
నిన్ను నువ్వే ఎందుకు బహిష్కరించుకున్నావ్...!?
క్రోధమెలా పుడుతుందో
తెలీని నీ అమాయకపు చిరునవ్వు...
నీ బేలతనపు సౌందర్యమూ
గుర్తొచ్చినప్పుడల్లా
వాళ్లను చంపెయ్యండీ...
అని అరవాలని అనిపిస్తుంది
కానీ గొంతు పెగలదు
చట్టం కంటే అతీతమైన వ్యధ ఏదో
వాళ్ళ మెదళ్ళను చెదల్లా పట్టాలని మాత్రం
కోరుకోగలం
వాళ్ళు అనుభవించాలని అనుకున్నదేదో
వాళ్ళకు బతుకంతా దొరక్కుండా పోవాలని
కోరుకుంటాం
దాని కోసం దేవులాడి దేవులాడి
ఆ దేవులాట లోనే బతుకు ఆవిరైపోవాలని కోరుకుంటాం
చిట్టి తల్లీ... చిన్న చెల్లీ
మా అమాయకపు జాజిమల్లీ
నీకు మా కన్నీటి తారకాలు
ఇవి జ్ఞాపకాల కార్చిచ్చులు ■
*(ర్యాగింగ్ రాక్షసికి బలైపోయిన రిషితేశ్వరిని గుర్తు చేసుకుంటూ)*

*సాహిత్య ప్రస్థానం, ఫిబ్రవరి 2017*

# కన్నీటిచుక్క శబ్దం

వైష్ణవి శ్రీ - 89772 37345

పరధ్యానంలో ఉన్నప్పుడు
ప్రపంచం
దానికదే !
రెక్కలొచ్చి ఎగిరిపోతుంది.

అంతేకాదు
దానికదే !
రెక్కలు ముడుచుకు వాలిపోతుంది
పరధ్యానానికేం తెలుసు?
రెక్కలొచ్చి ఎగిరినప్పుడు
రాలిన శబ్దం

రెక్కలు వాల్చినప్పుడు
రాల్చిన నిశబ్దం

ఓ క్షణం పరధ్యానం చెదిరితే గానీ! వినపడదు

గుక్కపెట్టి ఏడుపు లంకించుకున్న కాలింగ్ బెల్
రాల్చిన చివరి కన్నీటి చుక్క శబ్దం.■

*సాహిత్య ప్రస్థానం, ఫిబ్రవరి 2017*

# నేలమాలి

కొత్తపల్లి సురేష్ – 94938 32470

ఇపుడు మా ఊరి పొలాల్లో ఎక్కడచూసినా
రెక్కలల్లార్చుకుంటూ తెల్లనికొంగలు
పచ్చనోట్లకార్పెట్ మీదుగా నడిచివస్తున్న కార్పొరేట్ దొంగలు

నేలచుట్టే అల్లుకున్న ప్రేమల పోగులు తెంపి
నిర్ధాక్షిణ్యంగా నిర్వాసితుల్ని చేస్తున్నారు
భావిని భుజాన మోస్తున్న నేలమాలిని –
అస్త్రసన్యాసిని చేసి యుద్ధభూమిలో నిలబెడుతున్నారు
రూకల పేకమేడల నిర్మాణంలో
రైతాంగాన్ని సమిధను చేస్తున్నారు

ప్రపంచీకరణ పడగనీడలో
కాసుల పడవల మీద ఖండాంతరాలు దాటి వచ్చి
తీరప్రాంతాల్ని జలగలై పీల్చేస్తున్న
పెట్రోకారిడార్లూ, సెజ్ లూ
ఆదివాసీల గుండెల గుడారాల్ని పేల్చేస్తున్నా గ్రీన్హంట్లు
అన్నీ దోపిడీకి పర్యాపదాలు

ఆకుపచ్చని ఆకాశంలో జయకేతనమై ఎగరాల్సిన రైతు
నేడు, పొలంగనిలో ఊపిరాడని కార్మికుడైపోయాడు
పైరగాలికి పంచనామా జరిగాక
రైతుకిక శ్వాస ఎలా అందుతుంది???■

*(దొరికినకాడికి అమాయక రైతుల భూములు కొని గాలిమరలు నెలకొల్పిన కార్పొరేట్ శక్తులపై నిరసనగా)*

*సాహిత్య ప్రస్థానం, ఫిబ్రవరి 2017*

# సిగ్గుపడదాం రండి

ఉదయమిత్ర –

చెట్టుపుట్టనడగండి
పశుపక్ష్యాదులనడగండి
మట్టివాసన మోసుకొచ్చే
అడవి గాలులనడగండి
ఆమె చచ్చిపోలేదు
అతని జ్ఞాపకాలలో బతికే ఉంది

నిజానికి
అక్కడి హాస్పిటల్ చచ్చిపోయింది
అక్కడి డాక్టర్లు నర్సులు చచ్చిపోయారు
అక్కడి నాయకులు చచ్చిపోయారు
బతికున్నపుడు సరే,
చచ్చినపుడు శవసాయం చెయ్యలేని
అక్కడి వ్యవస్థ మొత్తంగా చచ్చింది

ఔనులే,
అడవిని ముడిసరుకుగా
ఆదివాసీని అనాగరీకునిగ జూసే చోట
బతికుంటే జైలు పాల్జేసి
చస్తే ఎంగిలి విస్తరాకులా విసిరేసే చోట

మనుష్యుల్ని
మతాలకింద కులాలకింద

చీల్చి చెండాడి
ఒక అసహజ వాతావరణంలో
ఒకఅసహన వాతావరణంలో
ప్రజాస్వామ్య వ్యవస్థను
ఊపిరాడకుండా జేసే చోట
స్వయంకృషితో సమిష్టికృషితో
పీడన లేని సమాజం కోసం
గొంతెత్తిన ఆదివాసీకి
ఏమిచ్చింది సమాజం
గొంతు కోయడం తప్ప
పో, పో, దానామాజీ పో
దుఃఖపు పొరల కింద
నీ భార్యను భద్రంగా పూడ్చిపెట్టు
ఆ పక్కనే మరో బొందదీసి
నాగరీక సమాజం మీదున్న
నీ చివరి ఆశనూ పూడ్చిపెట్టు. ■

*(ఏ అంబులెన్సు సదుపాయం లేనిచోట, ఒక దుర్భరస్థితిలో తన భార్య శవాన్ని మోసుకు పది కిలోమీటర్లు నడిచిన ఆదివాసీన జూసి)*

*మాతృక, ఫిబ్రవరి 2017*

# ఆమె... అదృశ్య చిత్రం

తోట నిర్మలా రాణి -

తన రూపం
బిరడా బిగించిన సీసామూతి లాంటి
గరుకు కనురెప్పల వెనక అదృశ్య చిత్రం !
గుప్పెడు మెతుకుల భ్రమణంలో
గ్రహణం పట్టిన భానుబింబం

తన ఉనికి
ఆత్మగౌరవపు ఆవలిగట్టున
ఉచ్ఛ్వాస మరచిన గుండె వెనక
గడ్డకట్టిన కన్నీటి చుక్క

ఉగ్గుపాల నుండి
ముగ్గుబుట్టయ్యేవరకు
ఎన్ని మొగ్గలు ఆ చేతుల్లో
పువ్వులై విచ్చుకున్నాయో
గుడిలో బడిలో గదిలో మదిలో
పరవశిస్తున్నాయో

గంధం పుప్పొడిదీ కాదు
అందం రేకులదీ కాదు
ముడతలుపడ్డ దేహంలోంచి
ఇంకా చేతులు చాస్తున్న అమ్మతనం!
ముడుచుకుపోయిన జీవితంలోంచి
పరిమళిస్తున్న
శ్రమైక జీవన సౌందర్యం! ■

*మాతృక, ఫిబ్రవరి 2017*

## ఒక కవిత

హెచ్చార్కె – hrkkodidela@gmail.com

చెమట ఏమంత రొమాంటిక్గా వుండదు
రొమాన్స్ లేనిది కవిత్వం కాదు
దేవుడు పని చెయ్యడు
భక్తుడు పని చెయ్యడు
నెత్తిన నెమలీక పెట్టుకుని ఒకరు
తాబేటి చిప్ప పట్టుకుని మరొకరు
బజారు తిరుగుతారిద్దరూ
దేవుడికీ భక్తుడికీ మధ్య రొమాన్స్ కవిత్వం
మీరా, రూమీ, అన్నమయ్య ఎవర్నైనా అడుగు
బజారులోజి
అక్కడక్కడొక అందమైన భవనం
కాంపౌండులో పచ్చికలా పరుచుకున్న తీరిక
లోనికి వెళ్లి చూడు, ఎక్కడా
అమ్మల చెమట మరకలుండవు
నాన్నల నుదుటి మడతలుండవు
వస్తువులన్నీ కొత్త యవ్వనంలా నునుపుగా
ముట్టుకోడానికి భయమేసేంత శుభ్రం
అన్నీ జాగర్తగా తుడిచి వుంచిన గాజు పదాలు
ఆ ఇంటి పెరటిలో ఒక చెట్టు
వేయించడానికి సిద్ధంగా వున్న వరుగుల్లాంటి
ఎండి పోయిన కొమ్మల్ని కొమ్ముల్లా విసిరి

పిచికలు వాలకుండా అదిలిస్తూ
దేని కోసమో ఎదురు చూస్తున్నది
చలి కాలం కప్పుకున్న మంచు దుప్పటి
మూసిన కిటీకీ వెనకాల ఎవరో
వూహల పూవులు విరిసే పానుపు మీద
వసంత మేఘుడు తొందరపడి
గొంతు సవరించుకుంటున్న మెత్తని చప్పుడు
అంతా మెత్తగా మెల్లగా హాయిగా
నా బాధ వేరు
నను దహించే మోహం వేరు
నా పానుపు మీద కురుస్తున్నవి
ఊహలు కాదు, పల్లేర్లు. ■

*ఈమాట, ఫిబ్రవరి, 2017*

## చదువలేదు

స్వేచ్ఛ - 77024 06107

ఆ అక్షరాలన్నీ ఆదుర్దాగా తడిమి
అందులో నిన్ను వెతుక్కున్నా
విషవాయువులు పీల్చుకున్నట్టు
గుండె తెగి దూరంగా పడిపోయింది
అచేతనంగా చల్లబడుతున్న రక్తంపై
ఆసిడ్ లా అశ్రువులు
అప్పుడంతా ఆగిపోయింది
మధ్యలో లీలగా అక్షరాలు ఏమీ మిగలలేనిచోట
అపురూపంగా కన్నీళ్లు గొంతుమీదకు చేరుకొని
ముడి బిగుస్తున్న జ్ఞాపకాలు
అప్పుడప్పుడూ గాలి వీచి
బతికున్నానని గుర్తుచేస్తుంది
చీకటైతే ఉంది కానీ
ప్రాణం గురించి నాకేం తెలుసు
నిర్జీవ క్షణాల్లో ముఖాన్ని దాచేసాయి చేతులు
దుఃఖంలో తడిపిన అక్షరాల్ని
ఈసారి కొత్తగా చూసా
అప్పుడర్థమైంది
నువ్ రాసింది నేనింకా చదవలేదని .. ■

*'కవితా!' 44, ఫిబ్రవరి 2017*

# నాన్న జ్ఞాపకం

ఆకెళ్ళ రవిప్రకాష్ - 9443288034

హైదరాబాదు నుంచి నాన్న రాగానే
పిల్లలంతా ఆయన చుట్టూ మూగే వాళ్ళం
అద్భుత లోకం నుంచి వచ్చిన
మహా మాంత్రికుడిలా
అందరికీ కానుకలు బయటికి తీసేవాడు

ఇక సుల్తాన్ బజార్ ఒకవేపు
అబిడ్స్, కోఠీ, మరోవేపు
మా యింటి గడపల మీద నర్తించేవి.
బాంబే హల్వా కలలు
పుల్లారెడ్డి రుచులు
మా యింటి గదుల్లో కాపురం చేసేవి
పాదలేపనం కరిగిపోయిన ప్రవరుడిలా
మా నాన్న హైదరాబాదు వెళ్ళాడంటే
ఎంతకీ వచ్చేవాడు కాదు
దిగులుగా వున్నప్పుడు
ఆ నగర వీధుల్లో నడిస్తే
మనసు దూదిలా తేలిపోతుందనే వాడు.

అది మోహం అనాలో
పాశం అనాలో
ఏడురంగుల కలలు అనాలో

మేమంతా కూడా
మా నాన్నని ప్రేమించినంతగా
హైదరాబాదుని ప్రేమించడం నేర్చుకున్నాం
నాన్న లోకం వదిలేసి ఇన్నేళ్ళయినా కూడా
ఎపుడు హైదరాబాదు వచ్చినా
నాన్న జ్ఞాపకాలే చుట్టుముడతాయి.

గాలి వీసినపుడల్లా
వర్షం కురిసినపుడల్లా
నాన్న నాతో మాట్లాడుతున్నట్టే వుంటుంది
నను చేయి పట్టుకుని
నడిపిస్తున్నట్టే వుంటుంది
మా నాన్నలాగే మా అబ్బాయి కూడా
హైదరాబాదు ప్రేమికుడు
కొన్ని పోలికలు ఎలా వస్తాయో
ఎవరికి చెప్పనవుతుంది?
నేను హైదరాబాదు వెళ్తుంటే
తననీ తీసుకెళ్ళమని గొడవ చేస్తాడు.
అక్కడ్నించీ తిరిగి రాగానే
నా దగ్గర చేరి నేను తెచ్చిన
హైదరాబాదు వీధుల్ని
గుండెలకి హత్తుకుంటాడు ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 6, మార్చి 2017*

## పంజరం చిలుక

అనిల్ డ్యాని - 97033 36688

బాహ్య రహదారి దాటుకుని
గతుకుల రోడ్డు
సంక్రాంతికి ఊరెదురొచ్చింది
రోడ్డెమ్మట రాలిన పసుప్పూల స్వాగతం

పదేళ్ళ క్రితం ఎర్రబస్సు
ఇప్పుడేమో ఎయిర్ బ్యాగ్ కారు
రోడ్డొక్కటే, అలసటా ఒక్కటే

ఊరు అలాగే వుంది
గాంధీ తాత
అదే కమ్యూనిస్టు ఎర్రదిమ్మ
ప్రైవేటు మాస్టారింట్లో పున్నాగ చెట్టు
పెద్ద మర్రి చెట్టు చల్లగాలి

మూడ్రోజులకి వలసొచ్చిన
సగం పట్నం చాలి కాగినట్టుంది
ఊరంతా నిండిన పొగలో 'ఇగో' వాసన

అమ్మా! కాస్త తలంటూ
కాసిన్ని కుంకుడు నీళ్ళు కంట్లో పోసి
ఏడాది బాదంతా వదిలించు
మంట తగ్గాలంటే మందేమిస్తావ్
ఉప్పుగల్లా, చెరుకు ముక్కా

నీ చల్లని చేతి స్పర్శా

నాన్నలంతా రైతులు
రైతులంతా రాజులు
నాగళ్ళు ఇంటికి ఐమూలగా
కసువు దిబ్బా ఎండుగడ్డి వాము
వారసత్వపు ఆస్తులు
ఇప్పుడంతా ఫెరిగోషన్ గోస
రెండో ప్రపంచ యుద్ధపు తాలూకూ
రసాయన ఆనవాళ్లు కళ్ళాలనిండా

పళ్ళాల నిండా పరుచుకున్న
జాడి చివరి ఆవకాయలో కారం లేదఱు
చేతికి పెరుగన్నం తిన్న జిడ్డు లేదు
నేతి గారెల వాసన వంటగదినిండా
దాటి పోవడానికి చూరెక్కడ
పంచుదామంటే ఎంతకీ తెరవబడని
పక్కింటి పెద్ద టేకు తలుపు
ఏరా అబ్బాయ్ బాగున్నావా?
నాలుగైదు పలకరింపుల మధ్య
ఇరవై ఫోన్ కాల్స్ పల్లెకు
ఏసీ లొచ్చిన రోజులివి
యాక్ట్ నెట్టెందుకు పరుచుకోదు
ఊరంతా వైఫై మయం
'వర్కెట్ హోం' వెసులుబాటు
'పాలేర్ల'కీ పరిచయం చేయాలి

టీవీ సీరియళ్ళకి అరువిచ్చాక
బామ్మల దగ్గర కథలెందుకుంటాయ్
సాయంకాలానికి

చుట్టూరా చేరిన పిల్లలకి చెప్పడానికి

హరిదాసొక్కడే పాడుతున్నాడు
మైక్ వింటుంది
శీతాకాలపు రేయిని
ఊరి థియేటర్ వేడెక్కిస్తుంది
టికెట్ రేటు మాత్రమే ఒకటి
అంతరాల్లో అదే తేడా
అంబేద్కర్ సెంటర్ లో లైటెలగదు

కాస్త నాటుగానే తెగుతుంది కోడి మెడ
నిఖార్సైన పంచెకట్టు కనబడకుండా
తేదీలు మారిపోతాయి
జీవితం
మూడ్రోజుల సెలవలుగా కుదించబడ్డాక
మూట గట్టుకోవడానికి
భుజంపై కండువా లేని శరీరంతో
వెనక్కి ఏం మోసుకెళ్ళాలి
పక్షి నొదిలేసిన గూడునా
గూడునొదిలేసిన పక్షినా

ఎదురు చూస్తూ రాలిన పూల తోవగుండా
కాలం ముందుకి కార్లు వెనక్కి
ఇంత మధనపడ్డ హృదయం
పల్లెల్లో
శాశ్వతంగా ఉండలేవెందుకనే ప్రశ్నల్ని
పల్లె గాలులు ఊరి చివరిదాకా తెచ్చి
వీడ్కోలు చెబుతాయి
జవాబు చెప్పలేని జీతపు చిలక
పంజరంలోకి తనకు తానుగా వెళ్లిపోయింది.■

*'చినుకు' మాసపత్రిక, ఫిబ్రవరి 2017*

# వర్ణావరణం

గరికపాటి మణీందర్ - 99483 26270

గడియారం
ఏం పడేసుకుందో ఏమో కానీ
అదే పనిగా తిరుగుతుంది.

మేఘాలేమో
చినుకు దారాలను
భూమి కండెకు చుడుతుంటాయి

కొవ్వత్తి వెలుగు నాలికతో అంబరాన్ని
తాకాలని చూస్తుంది

పక్షి పదే పదే
ఎగురుతూ రెక్కల చీపుర్లతో
నక్షత్రాలను పోగెయ్యాలని
తపన పడుతుంది

నదిలో చేప పిల్లలు
పాకుడు రాళ్ళపై జారుతూ
అలల ఊయలలూగుతూ
గంతులు వేస్తుంటాయి

అక్షరాలు  సీతాకోక చిలుకలై
గుండె తోట నుండి గుంపులుగా
ఎగురుతుంటాయి.

వెదురు పొద
వేణువై రవళిస్తూ
కొండగాలికి గిలిగింతలు పెడుతుంది.■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 13, మార్చి 2017*

# ఉరితాడు

డా. పత్తిపాక మోహన్ – 99662 29548

పోగు తెగితే కలిపి అతుకు పెట్టొచ్చు
దారం పురితప్పితే వడి పెట్టొచ్చు
బతుకుతాడు తెగితేనే కష్టం
ఇంటిల్లిపాదీ కష్టపడి
జమలంచు చీరలు జరంచు దోతులు నేసినా
భుజమ్మీద జండాలా ఎప్పుడూ
కఫన్ ఎగురుతూనే ఉంటుంది
అక్షరం ముక్క నేర్వకున్నా
పుంజాలకు పుంజాలు పోగులు
తప్పులు పోకుండా లెక్కలు కట్టే నేర్పరి
నెమలీకలు చంద్రవంకలు చేతితో దింపిన నేతకాడు
ఏం శాపమో పాపమో
బతుకు పుంజాలే లెక్క తప్పుతున్నాయి
నేత నేసెటోళ్ళు బట్టలు నేయించెటోళ్ళు
ఎవరికి వారే అయితే
నేత బతుకులు కలవని రైలు పట్టాలు
బద్దెవడని 'లచ్చన' పోగులు
పడుగూ పేకల్ని కలనేయొచ్చు
రంగుల పోగులను
ఇంద్ర ధనస్సులుగా నేల దింపొచ్చు
నేత బతుకులే అర్థంకాని వైకుంఠపాళీ

పడుగూ పేకల్ని కలనేసి
మానం కాపాడినవాడికి
అర్థాంతర మరణం అనివార్యమైతే
పొక్కిలిగా బతుకుతున్న బతుకునే కాదు
చావుని కూడా ప్రశ్నార్థకం చేసిన
ఉరిసిల్ల 'సిరిసిల్ల'దీ తప్పే
బుక్కెడు బువ్వ పెట్టని మగ్గానిదీ తప్పే
నాలుగు మెతుకులు పెట్టని 'కశ్చి'ది తప్పే. ■

*(ప్రతిరోజు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సిరిసిల్ల నేతన్నల యాది)*

*నవ తెలంగాణ 20, మార్చి 2017*

## క్యాష్ లెస్ ఈగిల్

వడ్డెబోయిన శ్రీనివాస్ - 98857 56071

వెన్నుపోటు పెద్దనోటుకు
వెలవెలల పెద్దలనోటు పుట్టాక
చెమటచుక్క
చేతులురాలాయి కాళ్ళూ కరిగాయి
నల్లధనం మూతిమీది మీసం మెలేసింది
నకిలినోటు అమృతం తాగి నవయవ్వనైయ్యింది
పుట్టలోంచే నల్లపాములు
జాతీయజండాతెల్పయ్యాయి
చెమటవాసన ధనమే తెల్లబోయింది

తప్పెడిగురి పెట్టినప్పుడు
పావురం నేలకూలింది
పెద్దలనోటు క్యాష్ లెస్ ఈగిల్ గూడైయ్యింది

డాలరైజేషన్ దాగుడుమూతల్లో
గుంజుకొచ్చుకున్న గాంధీ అద్దాలచుట్టూ
గాడ్సే కాపలున్నట్టు
కమలాల చెట్టాపట్టాల్లో
నల్లదొరలు తుప్పిర్ల తుగ్లక్ ను
నయనానందకరంగామో(ది)స్తుంటే
'క్యూ'కట్టిన తెల్లనోటు
కూలిపోయింది
చేతలోడు చెల్లాచెదురైతే

చూసెటోడు సుడిగాలై చుట్టబెట్టుకున్నడు
న్యాయం ఇంట్లో పైస నల్లపూసైతే
నేరం ఇంట్లో పంచభక్ష్య పరమన్నాల్లా
వడ్డించిన కొత్త నోట్ల కొండలు

కురిసే వెన్నెల కోసం నోరుతెరిచిన
ఫుట్ పాత్ మీది కలలతోట
పుట్టెడు దుఃఖంలో కాలింది
సన్నకారు సరుకు వీధులన్నీ
చలిజ్వరం ముద్దుకున్నాయి

నల్లకుబేరుల హార్టు పుల్లయ్యింది
తెల్ల కుబేరులకు హార్టెటాకొచ్చింది

తస్మాత్ జాగ్రత్తా!
ఇక్కడ మోదీ పాలిస్తున్నాడు పాలిస్తున్నాడు
నల్లధనం నహిహై నహిహై నహిహై నహిహై
అదీఇదీ అవతల్దీ లోపల్దీ అంతా
తెల్లధనంహై తెల్లధనంహై తెల్లధనంహై.■

*నవతెలంగాణ 27, మార్చి 2017*

# మాట్లాడే మనిషి...

పల్లిపట్టు నాగరాజు - 099894 00881

పలకరింపులన్నీ
పరికరాల బొందల్లో బందీలైన
యాంత్రిక భాష ఏమంత రుచిగా లేదు...
అంతరంగపు కడవలో
అనుభూతులు చిలకని కరెన్సీ కూతలు
అక్కరకురాని మాటలేవీ లెక్కకు మించీ అక్కర్లేదు...!
బాంధవ్యాల పూబంతిలో
అనురాగం పరిమళించేలా...
దిగులు దోసిళ్ళలో చేరెడు ధైర్యాన్నినింపి...
మాట్లాడే మనసుకావాలి...
ఇంటెనకాల పెరట్లో పిల్లలకోడి
బాగా దమ్ము చేసిన దుమ్ముపై
మొలకల పున్నమి నాడు చినుకులు పడితే
కమ్మటివాసన ఇంటిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నట్టు
మాట్లాడే మనిషికావాలి...
కుంభవర్షంలో తడిసి ముద్దయిన చెట్టు
బడి నుంచి బాటెంటే వెళ్తున్న బుడతోడి శిరస్సుపై...
గుప్పెడు పూల చినుకులు చిలకిరించి
అమ్మలా ఆశీర్వదించినట్టు...
స్నానాల గదిలో
వొళ్ళంతా రుద్ది రుద్ది శుద్ధి చేసుకుంటున్నప్పుడు

చేతి మునివేళ్లో... ముఖం నుంచి జారిన  నీళ్లో
బొడ్డును తాకగానే పేగుబంధం గుర్తొచ్చి
హఠాత్తుగా "అమ్మా" అన్నమాట
అది ప్రణవనాదమై ధ్వనించినట్టు
మాట్లాడే మనస్సున్న హృదయం కావాలి...
ఏదూరాల తీరాలలోనైనా...
అమ్మను, అమ్మభాషను, అమ్మతోబుట్టువులాంటి కన్న ఊరిని
గుండెలనిండా  నింపుకుని
స్వేచ్ఛగా... స్వచ్ఛంగా మాతృభాషలో మాట్లాడే...
మనిషి కావాలి... కావాలి... ■

*ఉగాది ప్రత్యేక సంచిక,*
*కుసుమ పువ్వులు, హోసూరు 2017*

# నేను

చెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి –

ఉదయమే అటూ ఇటూ తిరుగుతూ
హడావిడి పని చేసుకుంటున్న వేళ
మాటల సందడికి
మౌన శ్రోతను !

భోజనం వడ్డించే వేళ
రుచులు రుచులుగా వంటను విమర్శించేటప్పుడు
నోరులేని మూగ జీవాన్ని!

అలసి సొలసి ఇంటికొచ్చిన
విశ్రాంతి వేళ
పాదసేవ చేస్తున్నప్పుడు
పరమ పతివ్రతను !

అతిథులు ఇంటికి వచ్చిన వేళ
ప్రశంసల వర్షంలో తడిసి ముద్దయి
పరవశించే వివశను !

అందమైన కవితలల్లి
మొదటి తీర్పు నీదేనన్నప్పుడు
ఉపాధ్యాయినిని!

అంతర్యుద్ధంతో మాటలు లేక
ఇల్లు మౌనపోరాటం చేస్తున్న వేళ
మొదటి మాట కలిపినపుడు

రాజీతత్వానికి చిరునామాని !

తీరికవేళల మంజుల మధుర
మనోభావాలను
తెల్లకాగితాలపై కెక్కించేవేళ
నేనూ ఓ రచయిత్రిని !

వెరసి నేనో దిగువ మధ్యతరగతి స్త్రీని ! ■

*'కవితా!' 45, మార్చి 2017*

# గిట్ల గిట్ల అనిపిస్తది

కందికొండ –

ఏగిలిబారంగనేలేశి ఎవ్వలకు శెప్పకుంట
ఉప్పల్‌రింగురోడ్డుకాడ వరంగల్లుపస్టుబస్సెక్కి
మా ఊరునాగూర్లపల్లెకు పోవాల్ననిపిస్తది
మా ఇంటిసాయబాను కింద అరుగుమీదకూసోని
మా అవ్వకడుపుల తలకాయబెట్టుకొని
ఎతతీరెదాక ఏడువాల్నపిస్తది
ఈపట్నంబతుకుపాడుగాను పాణానికినిమ్మలమేలేదు

పొద్దుగాల్నేలేశి మాఊరిచెరువుకట్టకుబొయ్యి
వట్టికాళ్ళతోటి బొడిగెరాళ్ళమీదనడుసుకుంట
బర్రెంకపుల్లతోటి పళ్ళుతోముకోవాల్ననిపిస్తది
గౌలోళ్ళచిచ్చుదగ్గర పోద్దాటికల్లుతీస్కోని
పరిగడుపున కుతితీరెదాకతాగి
దిగుడుచింతశెట్టుకింద కనుమలుపాల్ననిపిస్తది
కంటినిండనిద్రబోయి ఎన్నిరోజుయితాందో

దుబ్బకాలువకుబెస్తోళ్ళుబెట్టిన మాపుతావుకాడికిబొయ్యి
ఉలిశెనగాండ్లు, జెల్లలు, మొట్ట పిల్లలు, కొడిపెలు, పరుకలు
తీరొక్కచావల ఓకిలన్ని మొగ్గుజోకిచ్చుకోని తెచ్చుకోని
మాఅవ్వతోని పులుసుబెట్టిచ్చుకోని
కంట్రోల్‌బియ్యంబువ్వల ఒత్తుగకల్పుకోని
కడుపునిండ తినాల్ననిపిస్తది

ఇక్కడఅంతా మందుల తిండి మాదర్‌చోద్ తిండి
ఎంతతిన్నా తుర్తనిపిస్తలేదు

సలికాలంల సాయంత్రంపూట
ఊళ్ళెవరిగడ్డిండ్లు టాక్టర్లుపోతాంటె
పిరికిళ్ళతోని వరిగడ్డిపీకి ఓ సందెడంత దొంగతనంశెయ్యాల్ననిపిస్తది
మబ్బుల్లలేశి అరికట్లంగట్టుకోని
పోరగాండ్లతోని, ముసలోళ్ళతోని ముచ్చట్లుబెట్టుకుంట
వరిగడ్డిమంటేస్కోని సలిగాగాల్ననిపిస్తది
ఈ అగ్గిపెట్టెలసొంటి అపార్టుమెంటులల్ల ఎవలలొల్లివాళ్ళదే

పొద్దుగూకంగ ఏడుగటలకు
తాపిపనికిపోయ్యచ్చిన మానాయనహాలత్‌జూసి
సిమెంటుతినితెల్లబడ్డ మా నాయనకాళ్ళుశేతులుజూసి
రొంబొచ్చెకు ఆమురుకొని ఏడువాల్ననిపిస్తది
కాళ్ళుజేతులకు కొబ్బరినూనె రాయాల్ననిపిస్తది
మాదళితబహుజ సులబతుకులు ఎప్పుడు మారుతయో ఏమో

మోకాళ్ళుగుంజుతానయ్ మోజేతులు తీపులుతీస్తానయ్
అని మా అవ్వ కండ్లళ్ళనీళ్లుతీస్తే
నాపాణంబోయినంత పనయితది
అప్పుడు నా జీవిడిశి
మా అవ్వమోకాళ్ళళ్ళ మోజేతులల్ల గుజ్జునుకావాల్ననిపిస్తది
బొక్కలల్లుమూలుగను కావాల్ననిపిస్తది
ఈముసలితనం మీద నాలుగు దోషల్లమన్నుబొయ్య ఎంత అవస్తోగదా. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 3, ఏప్రిల్ 2017*

# ప్రేమ ఋతువుని

కృపాకర్ మాదిగ –

యోనుకలూ లింగాలకూ
పూజలు  చేసే దేశం కదా
ప్రకృతి కార్యాన్ని గౌరవిస్తుందనుకున్నాను

వెలివాడలకావల ఊళ్లో పువ్వులకు
ముళ్ళుంటాయని తెలుసుగానీ
కత్తుల బోనులూ రంపపు కోతలు కుంచెలూ
కాపలా ఉంటాయని ఆఖర్నే తెలిసింది

ఏ పుప్పొడైనా సువాసన ఒక్కటే కాదా?
ఏ పరాగమైనా మనువొక్కటే కాదా?
ఏ యుగళ గీతమైనా హృదయ రామొక్కటే కాదా?
అనురాగాలకి అంటరానితనమేమిట్రా కులం రోగుల్లారా?

మానవ స్మృతే అందరి స్మృతి అవుతుందనుకున్నా
నీ మను స్మృతే నా మరణ స్మృతి అవుతుందనుకోలేదు

ప్రేమిస్తే
అంగ విచ్ఛేదనం చేస్తారా?
దేహమే దేవాలయమన్నారే?
ఖండ ఖండాలుగా నరికి
దేశమంతా చల్లుతారా? చల్లండి
కులం గడీలను పగలగొట్టుకొని

విశ్వ ప్రేమనై పరివ్యాపిస్తాను

ప్రేమ హత్యలన్నీ పరువు హత్యలే
అంతకు మించి దళితుల మీద హత్యలే
ఇంకా ఆడవారి మీద హత్యలే
అంటరాని జాతి నిర్మూలనే
ఆడజాతి నిర్మూలనే కదా?

ఏ ఉద్యమకారిణీ గొంతు పెగల్చదే
ఏ కళాకారిణీ గజ్జె కట్టదే
ఏ సాలభంజికా ప్రశ్నలెయ్యదే
ఏ నీలి మేఘమూ సిరా చుక్క రాల్చదే
ఏ మాంస పుష్పమూ మాటలాడదే
ఏం పాపం హిందూ పితృస్వామ్య పరదాలు దాటలేదా?
కులాల ఎడాల ఎడారుల దూరాలు దాటి రాదలచుకోలేదా?

అవున్లే ఇంటి ఆడపడుచుకున్న ఆవేదన
ఎర్ర సిరా చుక్కకుంటుందా?
మాకు గోడల్లేవన్నంత మాత్రాన లేకుండా పోతాయా?
నా శవంతో నేనే కదా ఏడవాలి?

ఆమె డెలీల కాకపోవచ్చు
నేను మాత్రం మాతంగ సంసోనునే
వేల వసంతాలను వెంట తెచ్చే ప్రేమ ఋతువునే
చంపినా బతికుండే వెచ్చని ప్రేమోద్యపు కాంక్షనే
వివక్షల ముళ్ళ పువ్వులపై మృదువుగా వాలే
మధుపాన్నే
మధుకరాన్నే. ■

*(మంతెని మధుకర్ స్మృతికి అంకితం)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 17, ఏప్రిల్ 2017*

## కలడంబేద్కరు నా సహోదరుడు నాకై యష్టకష్టాలకున్ బలియై...

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ – 095380 53030

అనస్తెమర్ అద్భుత జ్ఞానోదయపు అసలు తోటలో
ఆత్మతో పాడే పేదపిల్లల వసతిగృహాల పాలిశ్లోకాలు
లిడ్కాప్ చెప్పుల దుకాణాలపై వికసించిన నీలిసూటు చిత్రాలు
మురికివాడల్లో అతనుగా వినబడే పాటలు...

పాటలెప్పుడూ దేశ సరిహద్దులు దాటతాయి...
అసలు రాగాన్ని రాజ్యమెప్పుడూ వాస్తవాధీనరేఖపై ప్రసారం చెయ్యదు..
పాటలపై నకలు హక్కుల్ని దేశానికి ఉదారంగా రాసిచ్చాక
కృతజ్ఞత లేమిటో జాతికి అర్థ విచలనాలు పుట్టుకొస్తాయి...
ఉష్ణోగ్రతలను వెంటతెస్తూ హద్దులు దాటేవి శీతల పరిధులు గనక
పాదముద్రలు ఊసిన నిక్షేపణ రూపమైన మెడ ముంతల్ని పగలగొట్టినందుకు
సహబావి విగ్రహాల కూల్చివేతల సాంక్రమిక రోగం!

వివక్ష కనబడని వినూత్న గ్రహాల అన్వేషణలో
మనోగతాన్ని గనక పసిగట్టే శతాధిక ఉపగ్రహాలు ఒకే రాకెట్లో దూసుకెళితే
సంవిధానకర్త తప్ప అంతా దేశభక్తుల వేషంలో కనబడతారు
'రాత్రి భూమిపటంపై అంటార్కిటికా చీకటిగా కనబడినా
గుడి మెట్లపై సదాచార పండితులు అస్పృశ్యతారాళ్ళు రువ్వే దృశ్యాలతో
ఇందిరమ్మ ఇళ్ళు ఊరికి మరిన్ని పిన్ కోడ్‌ల దూరం జరుగుతాయి!
మిసోజెనిస్ట్ ముద్రల జడివానలు పడితే పడతాయి గానీ
కాలమెప్పుడూ ద్వైదీబావగానం చేసే రూపవతులూ నయనతారలదే!
అంస్టర్డాం ఇష్టమేగానీ ప్రేమించలేమంటున్నదీ ప్రేయసీలే!
సంపూర్ణకాలం మహిళల విద్య కోసం వర్తమాన కాలమై

పేడనీళ్ళు కొట్టించుకున్న సావిత్రిబాయిని చెరిపేసిన జ్ఞాపకాలై
బాసర సరస్వతి ముందు బారులు తీరింది తెలుగు ఫెమినిస్టు పెడగోగి...

'దాపరికం లేని వ్యతిరేకి' ముద్రలకు ఇంకా దాపరికమెందుకు?
సమస్త స్త్రీ జాతికి సమానత్వ నగారా మోగించినా
విముక్తి ప్రతిపాదిత హిందూ కోడ్ బిల్లు నిరస్యమైన తర్వాత
అతని ఏకగళ గీతం మీకు స్వరమాధుర్యం కాబోదు
నుదుట బొట్టుకైనా మీ చేతివేళ్ళు అతని చిత్రాన్ని తాకబోవు
మీ ఐఫోన్ల లౌకిక సంగీతం అతని ఐపాడ్పై ఒక్క పాటైనా కట్టదు...
ఎలానూ మీ గాత్రాలు జైభీములు పాడబోవు
ఎలానూ మీ సత్సంగాలు మా బావజాల వాడల దాకా నడిచి రావు
గ్రీక్ హెల్లెనిస్టిక్ సంస్కృతీ వారసత్వ అమెరికా తెలుగు సంఘాలు
ఎలానూ మా దళిత కవిత్వతత్వ శ్రావ్యతను కనిపెట్టలేవు
ముక్తి దాతను తలవని కొన్ని స్వరాల సమూహ రాగాలతో గొంతుకలబోము
మిసాంత్రోపిస్టుల చీటీలు రాసి విమానాల మీద నుంచి విరజిమ్మండి!

జాతీయ ప్రాజెక్ట్ నిర్వచనాన్ని ప్రభుత్వమే మార్చింది గనక
సమాన భారతదేశ నిర్మాణానికి విమానాలపై పయనించే
అగ్రవర్ణాలు రాళ్ళెత్తాలి గనక
ఆర్యన్ కులపెద్దల రాగానికి ఎప్పటికీ నృత్యమాడనందుకు
మానవహక్కుల వీధుల్లో అంబేద్కర్ మెగాస్టార్ అవుతాడు!

కసబ్బును ఉరితీసిన జైలులోనే
వక్ర రేఖాచిత్రాన్ని గీచిన సత్యాన్యత అక్టోజెనేరియన్
మిలియన్ల నిమ్నజాతుల రక్తాన్ని నిమ్మరసంలా తాగినా
సమానత్వంపై రాజ్యాంగ ప్రవేశికను తొలగించగలవాడెవ్వడు!
కలడంబేద్కరు నా సహోదరుడు నాకై యష్టకష్టాలకున్ బలియై... ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 19, ఏప్రిల్ 2017*

## చిగురించే కాలాన

బండ్ల మాధవరావు - 88976 23332

శిశిరపు తొడుగుల్ని
విదిలించుకొంటున్న వేళ
పిలవకుండానే కొన్ని లేత చిగుళ్లు
నాలోంచి మొలకెత్తుతున్నాయ్
ఆశలకు ఊహలకు
ఉయ్యాలతాళ్లను కట్టి
ఆకాశం నుండి ఆకాశంలోకి ఊగుతున్నాను
ఎక్కడా నిలబడింది లేదు
గమ్యం నిరంతరం మారుతూనే వుంది
లోలకపు జీవితంలో
ఎండిపోవడం చిగురించడం
సాధారణ ప్రక్రియ అయింది.
దేహపు స్పృహ
మొదలవుతున్న కాలాన
నన్ను నేను రగుల్చుకోవడం
కొత్త వాసనలతో పరిమళించడం
ఓ వేడుకగా ఉండేది
సంభాషణలతో కరచాలించుకోవడం
ఉత్సాహపు నురగలతో తేటపడటం
సరికొత్త ప్రశ్నలై తలెత్తడం
ప్రవాహానికి ఎదురెళ్ళడం

అన్నీ నూతన శ్వాసై
గుండెల్లో నిలిచేవి
ఎదుగుతున్న చీకటికొసకి
దీపపు కాంతులు అంటించడం
విస్తరిస్తున్న శరీర దాహానికి
ఇంత వేడిని పుట్టించడం
కొమ్మల మాటున దాగిన
ఓ నల్లని గొంతును సవరించుకోవడం
నాకు నేనే ఓ ప్రశ్నగా ఎదురుపడటం
వింత అనుభవాలే!

దేహం స్పృహను
కోల్పోతున్న కాలాన
తడి ఇంకిపోతున్న మాటల్ని పేనుతున్నట్లు
రంగులన్నీ శ్వేతవర్ణంలో కలిసిపోయినట్లు
రాగాలన్నీ గొంతులో పూడుకుపోయినట్లు
మళ్ళీ మళ్ళీ అదే పేరుతో జన్మిస్తూ అంతరిస్తూ
వాడిపోయి వడలిపోయి అంతలోనే చిగురిస్తూ
అనుభవం కానిదాన్ని అనుభవిస్తున్నాను
నువ్వు అట్లా దేహానికి
కొత్తరంగు అద్దుతున్నప్పుడే
దేహకాంతులు విరిగిపడుతున్న చప్పుడు
మొలవని చెట్టుకు వేలాడుతున్న
వెన్నెల రాలిపడుతుంటుంది
పొంగుతున్న ప్రవాహాల సుడిగుండాలలో
ఆధారం కోసం ఆయాస పడాలి
అక్కడే సరికొత్తగా
జీవితాన్ని గురించిన అన్వేషణ మొదలవుతుంది
మూసుకుపోయిన మార్గాలలోంచే

ఓ కాంతిరేఖ చెయ్యిపట్టి
నన్ను నడిపిస్తుంది
శూన్యం ఇప్పుడు
నన్నో
నాలాంటి వాళ్ళనో
తనలో నింపుకొంటుంది
మళ్ళీ కొన్ని కొత్త చిగుళ్లు
నాలోంచి మట్టిలోంచి
కొమ్మచాటు గొంతుల్లోంచి పైకిలేస్తాయి. ■

*నవ్య వీక్లీ 19, ఏప్రిల్ 2017*

# బోధివృక్షం నీడలో

దర్భశయనం శ్రీనివాసాచార్య – 94404 19039

అతను జ్ఞానకాంతి అందుకున్న
ఈ బోధివృక్షం నీడలో కూర్చున్నానిపుడు –
సవ్వడి చేయకుండా, విస్మయచిత్తంతో –
అతని నీడలో విశ్రమిస్తున్నట్లుగా వుంది

ప్రశాంతత నాలో ఫల్గు నదిలా
మెల్లగా మెత్తగా కదుల్తొంటే
ఈ చెట్టు సమస్తాన్నీ అవలోకిస్తున్నాను
హృదయాకార పత్రాల తరళ కదలికల్లో
అతని సుదీర్ఘ యాత్రాగతిని దర్శిస్తున్నాను
నా కనులు శుభ్రపడుతున్నవి

సంబంధ సమృద్ధిని ఇష్టంగా త్యజించి
ఎక్కడెక్కడో తిరిగి తిరిగి అన్వేషిలా...
తనువు చిక్కి చివికి సారం చిక్కక కడకు
ఇక్కడ ఈ వృక్షచ్ఛాయలో వినూత్నజ్ఞానియై...
దార్ఢ్యతను ధరించి ధరణికి కొత్త దారి చూపి
వెళ్ళిపోయాడు వుండిపోతూ...
ఒక అచంచల అన్వేషికి ఈ వృక్షం
అర్థాన్నిచ్చిన పచ్చని ఆలంబన అయింది
చెట్టు అద్దంలో తన్ను తాను లోతుల్లోంచి
దర్శించుకున్నాడేమో జ్ఞానోదయం దక్కింది

అద్దంలో ఇపుడు నేను చూస్తున్నాను

నా మనసు శుభ్రపడుతున్నది
అన్వేషించి అందుకున్న దాన్ని పంచిన
ఆ మహాపథికుడి యాత్ర ధన్యం
అతని శల్యదేహానికి పాయస వాత్సల్యాన్నిచ్చి
చేవనిచ్చిన స్త్రీమూర్తి సుజాత బతుకు ధన్యం
అతని అపురూపపు ఉనికి ముద్రల్ని హత్తుకున్న
ఈ క్షేత్ర ప్రాంగణమంతా ధన్యం
అతని దృష్టి దయాకిరణాల్ని పొందిన
ఈ బోధివృక్షపు అస్తిత్వం దన్యం
ఈ క్షణాన అతని తలపులో ఈ విశేష ఛాయలో
నిర్మలానందాన్ని అందుకుంటున్న
నేనూ ఎంతో ఒకింత ధన్యుడనే కదా!
ధన్యత బావనలో నా సమ్తమూ శుభ్రపడుతున్నది

చెట్టు నీడ నుంచి వెళ్ళిపోతున్నా –
అతని నీడ వెలుతురై నా కళ్ళల్లోకి చేరుతున్నది
ఇక యాత్రను కొనసాగిస్తా తేటపడ్డ చూపుతో –
నా దారిని నేనే వెతుక్కుంటూ... ■

*(బుద్ధగయను దర్శించిన సందర్భంలో)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 20, ఏప్రిల్, 2017*

## ???

వేణు ఊడుగుల – 90596 35799

చేతికిరాని కొడుకు చేతిలో
నిస్సహాయ శకలాలు
నిర్మానుష్య నేత్రాలలో
నిండా మునిగిన రాత్రులు
దాయలేక – మోయలేక
కొట్టుమిట్టాడు కొన ఊపిరి ప్రాప్తం

'ఈ రాఖీ పండక్కన్నా అక్కలకు చీరలు కొంటావా బిడ్డా?'
'పోయి ఇన్నేళ్లైంది. ఇంకెప్పుడ్రా బాగుపడేది?'

పరుగెత్తే మబ్బుల్లో హోరెత్తు ప్రశ్నలు
పట పట పట పట కన్నీటివాన
స్వప్నాలను రాసిచ్చిన నేత్రాలలో
సముద్ర తరంగ విలాపం
దారితప్పిన వసంతాన
గొంతు కోల్పోయిన మృదంగం
దేహంతా ద్రవీభవించి
మహా నదిలా ప్రవహించి
ఇచ్చోటనే స్తంభించిపోయింది
దయగల మాటలను గాలికొదిలేసి
ఉన్న దీపమెనుకకు జరిగె
చీకటంతా ముందుకొచ్చె

దిక్కులేమయ్యాయో తెలియని
దిక్కుమాలిన శూన్యమున
వాయువేగమాగదు
వరదరాక మానదు
అసలెవడిక్కావాలి తల్లీ నావలపోత...!
Struggle Strugele Struggle
Struggle for Existence
అప్పుల యాచన తెలియని చేతులు
నాలుగ్గడపలు ఎక్కిదిగలేని కాళ్ళు
దుకాణంవాడి కంట్లోపడకుండా
సిగ్గుతో తలదాచుకుతిరుగు మొహం!
తలవంచుట ఎరుగని ఆత్మ
కాలం పాదాల కాడ కుక్కలా పడివున్న ధైన్యం !
Struggle Strugele Struggle
Struggle for Achievement
నిద్రపోతున్నా కూడా
ఒక కాలూపుతూనే ఉన్నాను
లేదంటే చచ్చిపోయిన మనిషనుకుని
ఇక్కడ అవతలికి విసిరికొడుతారు
అందుకే, ఏదో ఒక పనిచేస్తూనో
చేస్తున్నట్టు నటిస్తూనో...
అస్తమానం కృష్ణనగర్ అడ్డా మీద
కూలీలా నిలబడి ఉన్నాను
పండుగల్లేవ్ పబ్బాల్లేవ్
అయినవాళ్లు లేరు. కానివాళ్లు లేరు
Everything Lost... సత్తె నాశనం!
అమ్మా... ఇప్పుడు నీ కడుపునపుట్టిన దేహాన్ని కాదు
నన్ను నేను భక్షించుకునే సర్పాన్ని

'నాకొడుకు ఎరుకేనా?' అని
పొరపాటున కూడా ఎవ్వరినీ అడగొద్దు
హైదరాబాద్ బస్సెక్కేవాళ్లను ఆరాతీయొద్దు
నా చిరునామా మారిపోయింది
నేను నేను కాదు
ఇప్పుడు నా పేరు 'Ouroboros'
నా ఊరి పేరు...
నా ఊరి పేరు...
??? ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 24, ఏప్రిల్ 2017*

# నీడలు

లాస్యప్రియ కుప్పా - 96405 51664

ఎన్ని నిశ్శబ్దాలు కబళిస్తున్నా
ఎన్ని నిరాశలు కమ్మేసినా
ఎన్ని నిస్పృహలు ఆవరించినా
కొంత ఏకాంతం ఊరడిస్తుంది
నిదానించమని నిమ్మళించమని

సంద్రాన్ని సంగమం అలరిస్తున్నా
కెరటాలు కేరింతలతో కవాతుచేస్తున్నా
ఆటుపోటులు తప్పవంటూ
ఉప్పెనలు ఊపిరాడనివ్వవనుకుంటూ
దిగులు దిగులుగా దిగమింగేస్తున్నా

ఏదో ఒకనాడు
కొన్ని మౌనాలు పగుల్తాయి
కొన్ని నిశ్శబ్దాలు శబ్దిస్తాయి
కొన్ని జ్ఞాపకాలు చిట్లుతాయి
కొన్ని నీడలు జడలిప్పుతాయి
కొన్ని నమ్మకాలు నిలబెడతాయి
నిజాలు భగ్గుమన్నా పర్వాలేదు
నీ హృదయం ముక్కలు కానివ్వకు ■

*'కవితా!' 46, ఏప్రిల్ 2017*

# పాములూ పద్యాలు

మమత – mamatha7621@gmail.com

ఇప్పుడైతే పేర్లు కూడా నానుంచి వెళ్లిపోయాయి గానీ
ఒకప్పుడు ఒక నక్షత్రం, ఒక చెట్టూ ఉండేవి
పెదవులపై కాసేపు నాట్యం చేసిన వెచ్చని కిరణాలు కూడా ఉండేవి
ఏ ప్రేమా, ఏ నిశ్శబ్దమూ వాటిని వెనక్కి తీసుకురాలేవు
పొదవుకున్న క్షణాలన్నీ పొరపాట్లేనేమోనని చింతించినపుడు
చెప్పుకున్న మాటలన్నీ
చలిపొద్దున గుప్పుమన్న పొగమంచు ముద్దలై తేలిపోయాయి

గుక్కపట్టి ఏడుస్తుంది తన ఇంట్లోనే బంధీ అయిన పాపాయి
నాపై ఎవరి శాపమిది? తనను హత్తుకోలేని దుఃఖం ఇక ఎప్పటికీ

ఏ పువ్వులు, ఏ పచ్చరాళ్లు, ఏ అగ్ని
దాహాన్ని తీరుస్తాయి?

పద్యం ఎప్పుడూ ఉంటుంది
అది పొంచి ఉంటుంది
ఎప్పుడూ ఆకలితో ఉంటుంది
నా నొప్పి ఇక నాది కాదు
అది ఇప్పుడు పాకుతున్న పొలుసుల పద్యమైంది

నన్ను నేనొక అలజడి అనుకున్నాను కదూ, ఎంత అహంకారం నాకు?

ఇదో ఆట మాత్రమే అని తెలీక, ఈ గదుల్లో చాలాసేపు తిరిగాను
నిచ్చెనలో నేనొక మెట్టు మాత్రమే
ఇప్పుడిక మరుపులోకి జారుకున్నా ఏం పర్వాలేదు

రాత్రి నా మీద జరజరా పాకుతుంది –
లెక్కలేసుకుంటూ, పరీక్షిస్తూ
ఇప్పటికైతే అది నన్ను మింగెయ్యలేదు
సీతాకోక విడిచి వెళ్లిన గూటి అవశేషాల్ని పట్టుకుని
అలసి వెలిసిన ఇంద్ర ధనుస్సు నీడలో నడుస్తునే ఉన్నాను
పాములనూ, పద్యాలనూ చుట్టుకుని నడుస్తూనే ఉన్నాను ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 1, మే 2017*

# దక్షిణం వైపు ఇల్లు

మానస చామర్తి - manasachamarthi@gmail.com

రెండవ రూము రాత్రి
సన్నగా కురుస్తూ వాన
వీది దీపపు పసుపు కాంతి
పాకీ పాకీ ఆ వాకిలి దాకా వస్తుంది
సీతాకోక రెక్కల గేటు క్రింద
ఆకులు వలయాల్లో తిరుగుతాయి
చందమామనెవరో చూరుకి వేలాడదీసినట్లు
వరండాలో ఊగుతూ లాంతరు
గోడ మీద ధ్యానముద్రలో బుద్దుడు,
లక్షణ రేఖలాంటి తారురోడ్డుకవతలి ఇంట్లోకి
గాజుపెంకులు గుచ్చిన గోడకవతలి వైపుకి
ఈ రెండో అంతస్తులో నుండి చూసినప్పుడల్లా
గుచ్చుకునేదొక్కటే...
నిండా విరిసిన
ఓ పూల చెట్టు!

❊ ❊ ❊

కాసేపు విసురుగా కాసేపు జాలిగా
అలకలో ఉన్న ప్రేయసి మాటల్లా
వర్షపు చినుకులు
రయ్యిమని గాలిని కోసుకుపోతూ
వాహనాలు మిగిల్చిన నిశ్శబ్దం

పియానో మెట్ల మీద నుండి
కొక్కేనికి పట్టుకు చిరిగిన
పరదా సందుల్లోంచీ
సీతాకోకరెక్కల మీదుగా తప్పించుకుని
పైపైకి పాకుతూ వస్తుందో రాగం
కనపడని వేళ్ళ క్రింద పడి
మనసు నలిగిపోతుంది.

* * *

కోరుకున్న పూల మత్తే
ఊపిరంతా చేరి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది
రెక్కలు విప్పుకున్న సీతాకోకలన్నీ
కనురెప్పల మీదమీదకి సవారీకొస్తాయి
నీలంగా మారుతోన్న చందమామను
కళ్ళార్పకుండా చూస్తాడు బుద్ధుడు
నా అరచేతుల్నిండా గాజుపెంకులు...
విలవిల్లాడుతూ లేస్తాను కానీ...
చుక్కలుచుక్కలుగా కారే రక్తం
ఎంత ఒత్తినా ఆగదు
మరకలంటని పూలచెట్టుని
మళ్ళీ చూసేందుకు మొహం చెల్లదు
వాన నిలిచిపోయినట్లేనా? ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 1, మే 2017*

# మిరప కోరులో

పాపినేని శివశంకర్ - 85008 84400

ఎన్నిసార్లు విత్తనమై మెలకెత్తానో
అన్నిసార్లూ మరణించాను
ఎన్నిసార్లు బస్తాలై, బళ్లై, ట్రాక్టర్లై రేయింబగళ్లు
కొనుగోలు కేంద్రాలముందు పడిగాపులయ్యానో
అన్నిసార్లూ దారుణంగా దగాపడ్డాను
కోత లేకుండా చేలో రాలిపోయే మిరపకాయల్ని చూడు
మండే ఎండల్లో మంట రేపే కాయల్ని మించి
మండిపోయే గుండెల్ని గుడ్లు మిటకరించి చూడు

ఏటికేడాదీ ఏటికి ఎదురీతల గురించీ
జడ్డిగంలో మిడతపోటు గురించి నిన్నడగటం లేదు
కాళ్లల్లో దిగబడ్డ మోళ్లు పీకలేని
నీ యాప్‌లు, సబ్సిడీలు, సవాలక్ష పథకాలెందుకని
మీటలు నొక్కే వేళ్లకి మొక్కని సాకే చేతుల వైనమెట్లా తెలుస్తుందని
ఎద్దుముడ్డి పొడుచుకునే వాడికి చౌక విమాన యానాలెందుకని
ప్రశ్నించటం లేదు
ఆకాలంలో ఆకాశాల అకాండతాండవం ఎట్లాగూ ఆపలేవు
పల్లె పల్లెనా పారించే మద్యపుటేర్లతో
బెట్టగొట్టిన చేలని ఎట్లాగూ తడపలేవు
ఆకుపచ్చని నేలంతా సిమెంట్ రంగులోకి
మార్పిడయ్యే మతలబు ఎట్లాగూ విప్పలేవు
ఇసుక మేటల చాటున డబ్బు మేటల్ని ఎట్లాగూ నివారించలేవు

నేలమాళిగల్లో నల్ల నాగుల లెక్కలెట్లాగూ చెప్పలేవు
బురదమట్టల్ని తప్ప తిమింగలాల్ని ఎట్లాగూ వేటాడలేవు
కనీసం
మీ అందాల సభాభవనాల ముందు
ఎన్ని మిరపటిక్కీలు తగలబెట్టాలో నిర్ణయించు
ఎంత కోరులో నువ్వు కంట్లో జల్లిన కారం ఘాటులో
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి కావాలో చెప్పు
రక్తమాంసాలు దారపోసే నేలబిడ్డల నెత్తి మీద
రాబందులెందుకు వాలాలో వివరించు
ఈ నాగలి మొనదేలిన కర్రుతో ఇంకెన్నిసార్లు తన గుండెల్లో పొడుచుకోవాలో
పగ్గాలు పట్టే చేతులు ఎన్నెన్ని ఉరితాళ్లు పేనుకోవాలో చెప్పు
ఇంకెన్ని తరాలకి ఈ గొడ్డుమోతు విత్తనాలకి, ఈ పొలాల
ఎడారులకి, ఈ చావు శోకాలకి చివరి బిందువో చెప్పు
ఈ కండెలు గట్టిన, కాయలు గాసిన కాళ్లూ చేతులే నాలుగు
పాదాలుగా నిలిచిన సింహాసన విరూపాల్ని
ఎప్పుడు తల్లకిందులు చేయాలో
అది కూడా నువ్వే చెప్పు ■

*(రెండు రాష్ట్రాల మర్చి రైతుల ఆక్రోశంతో కలిసి)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 8, మే 2017*

# వూరూ... నేనూ... వానా... ఏరూ...

సిద్ధార్థ - 96033 64634

నేను రెక్కలున్న పక్షిని
నన్ను నడవమంటే ఎట్ల
పట్నం తొవ్వ వెనుకకు మల్లుతుందని నేననుకోలేదు
మలుపులో తెగిన పాదాలు
నా కండ్లకు తగులుతాయనీ అనుకోలేదు
నేను రెక్కలున్న పక్షిని
నన్ను నడవమంటే ఎట్ల
మబ్బుల్ల మైలపోలు తీస్తుంటాను
నీరు కోసం...

చెరువు దుగూట్ల గీకురు పిట్టను
నిద్రపుచ్చే డక్కలోల్ల పాటను
రాళ్ళూ గుట్టలూ సర్కారు తుంపలు
నా చింతలను తీర్చే మధ్యాహ్నాలు
ఎవ్వరేమన్నా నేను నడిచే చెరువును ఎగిరే వాగును

మాట్లాడే వానకార్తెను
ఉత్త ఎండపొడను
పంటకోత వాసనను
కొత్త బట్టలేసుకొని నవ్వే పురానవ చిత్ర జీవాన్ని జీవ రసాన్ని

నాకు నేను మిగలకపోయినా
అందరూ ఎగిరిపోయినా

నా మందీ బలగంతోనే వుంటాను
గంపెడు వొడ్లను కండ్ల జూడటం ఎంత సుఖం నాకు
గింజను కౌగలించుకునే నులిపురుగూ కవిత్వమే చెబుతుంది
గింజ నిరసిస్తుంది... విలపిస్తుంది
గింజ ప్రవహిస్తుంది
అని పూర్తిగా నాకు తెలుసు

కొన్ని వేల పుట్టుకల వెనుక
నేనొక కడగొట్టు తీర్థాన్నయ్యాను
జాతరనయ్యాను
జంగమ జన సంగమాన్నయ్యాను
జాతరనయ్యాను
జంగమ జన సంగమాన్నయ్యాను
జైన వటవాటిక సిద్ధినయ్యాను
నా వొంటి మీద పుట్టెడన్ని ఇండ్లూ పుండ్లూ
పొలాలు... చెరువులు... కుంటలూ...

కురిసే వానల కింద నిద్రతీసే ఆకుపచ్చటెండను
చీకటి పాపిట్లల్ల వాగుల్ని దిద్దుకునే యాసంగి పాటను
వొరుసుకునే ప్రతీ కణం దాన్యపు గింజయ్యి సూక్తిని వెలిగిస్తుంది

గింజ లోపలి గింజ
ఒక మహానిశ్శబ్ద సూఫీ తీర్థంకర ముద్ర
దఖ్కనీ సంధి ప్రకాశం
గింజలో వొక గజల్ కూడా స్వరం దిద్దుకుంటుంది
నేను దాన్యపు గింజతో కలిసి శావనెక్కుతాను
కాలకాలాలుగా...
జ్ఞాపకం పెను మాయ కాదు
కనువాస్తవం
వాస్తవానంతర వాస్తవం

నా చుట్టూ కతల మోకులు
కలల కల్లురేకల ధారలు
జొన్నగింజల్ని మక్కగింజల్ని సాబుదానాగింజల్ని
నోట కరుచుకున్న పొలమే నాకు పదసంపదనిచ్చింది
పొలమే నా వాక్య నిర్మాణాన్ని సవరిస్తుంది సాలుతీరుస్తుంది
కాలంలోని అంతర్నదులు నా కండ్ల ఊసుల్ని తీస్తుంటాయి
పోద్దాటి డొంకలూ ఈత వనాలు
నా సంకేతాలుగా ఎగురుతుంటాయి
ఈనె గుండ్లు... నా కుల దేవుండ్లు
వానవాల్ జడ... నా మహావాచకం
గట్టు మై
మ్మ ముసురు వెన్నెల నా అచలాచల ధ్యానం
నేను నా వేళ్ళతో ఇప్పటికీ భూకంపాలను స్వరపరుస్తూనే వుంటాను
నాది... ఇచ్ఛా మరణం
నన్నెవరూ చంపలేరు
రెక్కలున్న పక్షిని నడిచి దారి తొలగమంటే ఎట్ల నేను...
ఎప్పటికీ భూకంపాలను స్వరపరుస్తూనే ఉంటాను ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 22, మే 2017*

# ఏ దృశ్యమూ అస్పృశ్యం కాదు

సతీష్ చందర్ - 9866192685

దూరం ఒక దృశ్యం
సమీపమే స్పర్శ

చూపుకో మేఘం
కౌగిలికి వాన

మురిపించేదొకటీ
మోజు తీర్చేదింకొకటీ

అందనిది అనుభూతి
అందినది అనుభవం

కంటికీ, ఒంటికి
విరుద్ధ కాంక్షలు

ఇలా అనుకునే
ఇదే మబ్బు తునకని
ఇంకాస్త ఎడమగా
వెనక్కి వెనక్కి అవని ఆవలకి

దూదిపువ్వంతయ్యేంత వరకూ జరిగి, జరిగి
ఆగి, ఆగి అపురూపం చేసుకొని
కనుపాపలతో క్లిక్ చేస్తానా...
ఓ చిన్న ఎదురు చూపుకు
నిలువెల్లా కరిగిపోయే నెచ్చెలిలాగా

ఆ తునకే చినుకయి
మిన్ను దిగి, మన్ను కరచి
జర జరా మైళ్ళకు మైళ్ళు పాకుతూ వస్తూంటే
కింద కిందకు అగాదాల్లోకి నేను పారిపోతుంటాను.

✳ ✳ ✳

దరి చేరిన దృశ్యమేదీ
నిలవదని నా మూఢనమ్మకం

ఏడు వన్నెల ఇంద్ర ధనువయినా అంతే
చూసినంత సేపే సొగసు
చెయ్యి వేస్తే చెదరిపోతుంది

ఒంటరి చెట్టు మీది తుంటరి పిట్ట మాత్రం తక్కువా ఏమి?

వీక్షించిన సేపే వయ్యారం
రెప్పల చప్పుడు చాలు.. తుర్రుమంటుంది

గడ్డిపరకల మీద కూర్చున్న కుందేలు పిల్ల
తెల్లని బుల్లి హిమగిరిలా లేదూ!
ఏం లాభం? ఆశతో వదలిన ఒక్క నిశ్వాస చాలు..
అది ఎండలోని మంచు కావటానికి

కానీ
ఈ వాన జాణ అలా లేదు
వెంట పడుతోంది
అంటుకొస్తోంది
లేచి వస్తానంటోంది
దూకి చస్తానంటోంది

ఎక్కడో వెలుతురు లేసుల మాటున
చీకటి చువ్వల చాటున
తొంగి చూసిన సిగ్గుల మేఘమే కదా అనుకున్నానా...!

అనంతాకాశం కింద
అందమైన దేదయినా 'టచ్ మీ నాటే'
అంటుందని తెంపు చేసుకున్నానా....?

ఇదేమి వైపరీత్యం?
అల మీద చేప వద్దన్నా వలలోకి వచ్చినట్టు
కలలోని హంస కూన, పొడుచుకుని ఇలలోకి వచ్చినట్లు
నా కోసం నల్లబోయింది.

శ్వేత మేఘం కాస్తా కత్రిమబ్బయింది
కఠిన శిల మీద తలబాదుకుని
వలవలా ఏడ్చింది
విలవిల లాడిపోతూ నా ఒంటి మీదకు
ఒక్క ఉదుటున దూకింది.

దృశ్యం స్పర్శగా రూపాంతం చెందింది
తెలుపు నలుపుల విలక్షణాద్వయితమయ్యింది
కోరికను కడతేర్చిన యేలికయిపోయింది
పాలపొంగుల జలపాతమయి పోయింది
అణువణువూ ముద్దాడిపోయింది
తనువులోని ప్రతి తంత్రినీ తెంచుకుని పోయింది

నా యీ వానపిల్ల ముద్దు పేరు
కాదు కాదు....
నా ముద్దు పిల్ల వాన పేరు.. నయాగరా
ఆమె బిగి కౌగిట్లో మాత్రమే నేర్చుకోగలిగిన పాఠం
ఏ దృశ్యమూ అస్పృశ్యం కాదు ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 22, మే 2017*

# ఒక దుఃఖానికి కొంచెం ముందు...

బొల్లోజు బాబా – 98493 20443

అప్పటికింకా అతను
చెట్టుకొమ్మకు పిడికెడు మట్టై వేలాడలేదు
చేనుగట్టుపై కూర్చొని ఎండిన పంటను
ఓదారుస్తున్నాడు, ఇసుక నిండిన హృదయంతో.

అప్పటికింకా అతని భార్యలో
సగభాగం ఖననం చేయబడలేదు
కలాయిపోయిన అద్దంలో చూసుకొంటూ నుదుటిపై
సూర్యబింబమంత కుంకుమ దిద్దుకొంటోంది.

అప్పటికింకా ఆ చీర
ఉరితాడుగా మారలేదు
ఒక్క ఉతుకు వానకే రంగువెలసిన ఆకాశంలా
దండంపై వట్టిపోయి వేలాడుతోంది

అప్పటికింకా ఆ చెట్టుకొమ్మ
ఉరికంబం పాత్రను ధరించలేదు
పక్షిగూడు దిశగా పాకుతున్న పామును
శ్రద్ధగా చూస్తోంది.

అప్పటికింకా ఈ ప్రపంచానికి తెలీదు
రేపు ఉదయం ఒకడు దాని నాగరికత అంతా
ఒక కుట్ర అని ప్రకటించబోతున్నాడని
ఏ దోషం చేయనిదానిలా ప్రశాంతంగా నిద్రిస్తూంది. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 29, మే 2017*

# మార్కెట్ శ్మశానంలోకి

యింద్రవెల్లి రమేష్ – 86392 93560

దేనికీ పూచీలేదు
దేనితో పేచీలేదు
దేశగతి ఇంతే
యువత గతీ ఇంతే!
చిన్న సవాలు లేదు, పట్టుమని పదివేళ్ళు కలసిన ధ్వని లేదు
ఏమని చెప్పాలి? ఎన్నని చెప్పాలి?

రహదారుల నిండా శాపాలు
రహదారుల నిండా శవాలు

వొక్కొక్కటే దాటుకుపోవడం ఏమంత పెద్ద పనేం అనుకునేరు?
అది సముద్రాన్ని ఈదినంత సులువు కాదు బుజ్జి కన్నా!

మహాశ్చర్యం ఏమిటంటే
అపరాత్రి వేళ ఏమీ పాలుపోక
తలుపు తెరిచి చూస్తే... శవాలే శవాలు
వెనక్కి తిరిగి చూసినా... శవాలే శవాలు

ఏదీ అర్థం కాకపోతే బాగుండు
ఏ కొంచెంలో కొంచెంలో కొంచెమే అర్థమయినా బాగుండు
మక్కికి మక్కీ, చెక్కకు చెక్క, పోకకు పోక
అన్ని రేణువులూ, పరమణువులూ విషాణువులూ
కంటి రెప్పమీదే ఎగురుతున్నాయి
ఇంటి గడపమీదే తొక్కిసలాడుతున్నాయి

మస్తిష్కంలోకి బార్లా విచ్చుకుని విరగబడుతున్నాయి

ఇంకేమని చెప్పాలి? ఇంకెంతని చెప్పాలి?
ఇలాగ ఎవరో నిష్క్రమిస్తుండాలి అలాగ ఏమిటో ప్రవేశిస్తుండాలి
ఇటు వచ్చి అటు వెళ్ళిపోయి పతనమవుతుండాలి, పునరుత్థానమవుతుండాలి
పండు రాలిపోతుండాలి చలినెగళ్ళు నిమిష నిమిషమూ ఎగసిపోతుండాలి
అప్పుడే ప్రకృతి పరిమళాలు ఆనందంగా వీస్తాయి మనోహరంగా వీస్తాయి
అప్పుడే గెలాక్సీలు ఒక్కుదుటున సమావేశమై పండుగ చేసుకుంటాయి

హాస్యాస్పదమైన నిన్నటిని
అనుమానాస్పదమైన రేపటితో జత కలపలేను
యెంత చెప్పినా యెంతెంతటి వర్ణనలు గుప్పించినా
నేడే నేను నేనే నేడు
తెలుసో తెలియదో మీరు కూడా అంతే
మీకు మీరు కూడా అంతే
కాలం పొడుగునా కవ్వించే రహస్యాలన్నీ అంతే

ఉల్లంఘనకూ ఉల్లంఘనకూ మధ్య
మరో ఉల్లంఘనను మేల్కొలుపుతాను
అధోలోకంలో నిత్యం సంచరించే నేను
అప్పుడప్పుడూ మార్కెట్ శ్మశానంలోకి దూకుతుంటాను
మరణం లేని పాటను వెదికి వెదికి వెనక్కి తీసుకొస్తాను
చెట్టుకూ గాలికీ మధ్య సంభాషణను వింటుంటాను
మనిషికీ నీడకూ మధ్య సంగీతం వింటూనే వుంటాను. ■

*నవ తెలంగాణ 29, మే 2017*

# రూపాయి

అరసవిల్లి కృష్ణ - 92472 53884

చెల్లని రూపాయిని జేబులో వేసుకొని
దేశమంతా తిరుగుతున్నాను
దారుల్ని విశాలం చేస్తూ
రూపాయి నోటుతో మట్లాడుతున్నాను
ఆకాశం నామాట విని పగలబడి నవ్వింది
జేబులో రూపాయి నోటు ను తడిమాను
చెమటకు తడిచి ముద్దయింది
ఎండలో ఆరబెట్టాను
ఆకాశం మళ్ళీనవ్వింది
ఎండకు ఆరిన రూపాయి గాలిపటం లా ఎగిరింది
ఇంత వరుకు రూపాయి తోడనుకున్నాను
రూపాయి జేబులో వుంటే
ప్రపంచం నాదనుకున్నా
నా చెమట బిందువు ఆకాశంలో
నక్షత్రంలా మెరుస్తుంది
అతనెవరో మైకు ముందు మాట్లాడుతున్నాడు.
భారత దేశప్రధాని అట-
నా రూపాయి నాకివ్వమన్నాను
కోటా బియ్యం కొనాలన్నాను
నా దేశానికి ఆకలేస్తుందని అరిచాను
అతనేదో మాట్లాడాడు
అతని భాష నాది కాదు అతను నావాడు కాదు
మళ్ళీ ఆకాశం నవ్వింది ■

*'కవితా!' 47, మే 2017*

## రాత్రి చెరువొడ్డు

విజయ్ కుమార్ ఎస్వీకే - 970 333 5955

రాత్రి సమయాల్లో
అలిసిపోయిన భూమిలా
చెరువులో పడవ

గడిచిన కథల్లాగా
అప్పుడప్పుడు
చేపలు గెంతుతాయి

అలలు రాని
మూగ నీళ్ళ చూపు
నక్షత్రాలని పోగేసుకున్న చంద్రుడు
రెప్పకొట్టని
మబ్బుల కన్నవుతాడు
యే చెట్టు గూడులో
దాగుందో గాలి
స్పర్శించదు
ఒడ్డున నేను
మట్టి శూన్యాన్ని ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 5, జూన్ 2017*

## అవసరంలాంటిదే

కాశిరాజు - 97010 75118

చిన్నదానికేనా అని కొన్ని తీసి పడేయలేం
బాగుంది. భలే ఉంది అనడానికి మధ్య తేడా
కేవలం కనురెప్పలు పైకి లేవడమే
మొహమాటంతో మూతి చిన్నదవడం,
సంబరంతో గుండె చిక్కబడ్డం
నా కళ్ళకి కనిపించుద్ది
రాలేనని చెప్పదల్చుకున్నది
వస్తాలే అంటూ దొరికిపోతావ్
మొహమాటాన్ని అలా ముందరేస్తున్నప్పుడు
ప్రేమ పెట్టిన ఇబ్బంది ఏంటో తెలుస్తాది
రాసుకోవడమో, దాసుకోవడమో,
గుర్తెట్టుకోవడమో కొద్దిగానైనా అవసరం గనక
మొహమాటం కూడా జీవితమని మాట వరసకి అనుకుందాం
చెప్పలేకపోయేవన్నీ అబద్ధాలు కాదని అప్పుడైనా తెలిస్తే సరి ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 5, జూన్ 2017*

## డెజావు

శ్రీకాంత్ కె. – 98186 66840

మబ్బులు కమ్ముకుని
చెట్లు గలగలలాడతాయి నీడలతో, నీ జ్ఞాపకాలతో, నీ మాటలతో
వాన వాసన అప్పుడు నాలో –

కాల్చివేసిన నిరుటి వేసవి ఎన్నటికీ మానుతుందిన నేను అనుకోలేదు.
అయినా
ఛాతిపై కమిలిన ఒక ముద్రికను చూసి అడుగుతారు పిల్లలు
'నాన్నా, ఇదేమిటి' అని –

అది, నేను చేజార్చుకున్న నీ ముఖం అని
నీ రంగుతో నీ కాంతితో మెరిసే ఆ సీతాకోకపూవులకు నేను ఎన్నడూ చెప్పలేను.
పాలు తాగుతూ ఒడిలోంచి చేజారి చనిపోయిన ఓ శిశువు గురించి
ఏ తల్లయినా ఏం చెప్పగలదు?

మబ్బులు కమ్ముకుని
చెట్లు స్థంబిస్తాయి అప్పుడు, నీడలతో, రాలిన ఆకులతో, నీవు
లేనితనంతో –
కురియక మరలిపోయే వాన తడి ఇక నాలో –

మరి గుర్తుందా
అడిగావు నువ్వు నన్ను సరిగ్గా ఇలాగే ఒకప్పుడు
మబ్బులు పట్టి, పగలు ఒక నైరాశ్యపు వెలుతురుతో భారంగా,
అతి నెమ్మదిగా

కదులుతున్నప్పుడు 'రాళ్ళు!
'రాళ్ళు మాట్లాడతాయా!?'ని –

ఇదిగో, ఇప్పుడు చెబుతున్నాను విను
రాళ్ళకూ హృదయాలుంటాయి. అవి మాట్లాడతాయి.
నవ్వుతాయి, గాపడతాయి
ఏడుస్తాయి. మరి ఇక అందుకు సాక్ష్యం?
ఇదిగో అదే ఈ చిన్న పొయెం! ■

*సాక్షి, 5, జూన్ 2017*

# మాఊరి పురాణం

మామిడి హరికృష్ణ - 99088 44222

ఇంటింటికో మంటి పొయ్యి
ఊరురుకో చరిత్ర
మట్టి పొరల కింద వెదుకుతావేమో
జనం గుండెలని అలుముకొని చూడు
ప్రజల సామూహిక స్మృతుల శిథిలాలను
తడిమి చూడు

ఊరి పేరు పేరుకో పురాణం
మైలురాయి మీది అచ్చరాలల్ల
పురావస్తు పరిశోధనలల్ల దొరకదు
మూడు తరాల గతాన్ని తవ్వ
ముసలోళ్ల ముచ్చట్లు విను...

ఊరు పొందుబాటు గావాల్నంటే
ఎన్ని ఇగురాలుండాలె
ఊరు అనేది
తిరిగే సారె మీంచి మొలుసుకచ్చే కుండ
కొలిమిలో ఇనుమును కరిగించి
చేసే నాగలి కర్రు
భ్రమణ పరిభ్రమణాల తండ్లాట తర్వాత
నేల మీద పొడిచే సూర్యుడు
మబ్బుల మధనంలోంచి జారిపడే చినుకు
రైతు చేతుల కాంచి దిగి వచ్చే ఇత్తనం

ఎన్కట ఇదంతా ఓ అడవి
లేకపోతె ఓ పడావు పడ్డ భూమి
జనం పాదాలు
మట్టితో సంభాషణ మొదలు పెట్టిన సందే
పచ్చని చెట్లు కూడా కళకళ లాడినై
జనం వచ్చినంకనే ఈ నేల
జొన్న కంకుల తోట లెక్క నిండుగ నవ్వింది

మొదట్ల మా ఊరి పేరు సాయమ్మ పేట
అదయినంక జిన్నూరు శాయంపేట
ఆ తర్వాత పరకాల శాయంపేటగా
మండలం శాయంపేటగా పేరు పడ్డది
పచ్చ బస్సు పుణ్యమా అని
ఇది పత్తిపాక శాయంపేట అయింది

ఇగ, ఒక్కసారి మా ఊరి మొఖాన పోదామా
మాందారిపేట మలుపు తిర్గంగనే
మా ఊరి వరి చేనుల వాసన
అమ్మ పురిటి పరిమళాన్ని తీసుకత్తది
గుంటలు పడ్డ డాంబర్ రోడ్ మీదినుండి
రంగనాయకుల బోడు దాటి
బీసీ కాలనీల ఇండ్లు కండ్లపడంగానే
ఊరు గడపలకు వచ్చినట్లనిస్తది
దావఖానా దాటి, పెద్ద బడి దాటి
పోలీస్ ఠాణా దాటి, పంచాయతీ
ఆఫీసు కాడికి రాంగానే
అక్కడి ఐలమ్మ విగ్రహం –
దాని పక్కన సెల్‌టవర్
మా ఊరు ఆత్మను ఎర్కజేత్తయ్
అస్తిత్వ సోయిని – ఆధునికత తీరుని

బాండు పేపర్ మీద రాసి మరీ ప్రకటిస్తయ్
రామసక్కదనాల జలతారు – మా ఊరు !
మా ఊరు నిత్య చైతన్య శీలి !
లోకానికి తగ్గట్టు,
కాలానికి అద్దినట్టు
ఎప్పటికప్పుడు
మారుకుంటూ వస్తోంది
దశావతారాలలో
తొలి అవతారం గుడి ఉన్నందుకేనేమో
నిరంతరం చలన శీలమై, చర్యాలోలమై
తనని తాను మార్చుకుంటూ
"యుక్తతమముల స్థాక జీవనము" సాగిస్తోంది
ఊరి సుట్టూ కొలువైన ఐదు చెరువుల్లో
సీత కుంటను పోగొట్టుకున్నా
మిగిలిన చెరువులనే
ఊరికి నాలుగు స్తంభాలుగా నిలుపుకొన్నది
మా ఊరు కర్మయోగి –
పోయిన దాని మీద చింత లేదు
వచ్చేదాన్ని ఆపడమూ తెలియదు

మా ఊరు–
డార్విన్ కు కూడా అందనంత పరిణామ పథగామి !
మట్టిగుడిసెలు, పెంకుటిండ్లు
దంగు సున్నం – ఇటుకల ఇండ్లు
కాంక్రీటు పిల్లర్ల ఇండ్లు
ఒక్కంత్రం – రెండంత్రాలు – మూడంత్రాలు
ఇట్ల కాలానికొక్క తీరుగ మారింది
కచ్చురాలు – మొద్దు బండ్లు – నా గండ్లు
కార్లు – ట్రాక్టర్లుగ మారినై

మొగ్గం గుంటలు – కట్టె మొగ్గాలు
పవర్ లూమ్ లుగా ఎదిగినై
భీమండి – సూరత్‌ల రైలు
ప్రయాణాలు దారి మార్చి
అమెరికా – ఆస్ట్రేలియా దిక్కుగా
కలలకు రెక్కలు కట్టడం షురువైంది

మా ఊరు శాయంపేట
ఎన్నిసార్లు తల్చుకున్నా తరగని ఊట
దూప అయినప్పుడల్లా నేను ఎనుకులాడే చెలిమె
దిక్కుతోచనప్పుడల్లా
నాలో సూర్యున్ని రాజేసే కొలిమి
మనసుకు ఆకలైనప్పుడల్లా
ముడి విప్పే జ్ఞాపకాల
సద్ది మూట
కండ్లు నెత్తికెక్కినప్పుడల్లా
యాదికచ్చే బాపమ్మ మాట

అగులు బుగులు అయినప్పుడల్లా
నాకు దారి చూపే బోధి వృక్షం
బతుకు కింద మీద అయినప్పుడల్లా
నన్ను దగ్గరికి చేర్చుకునే మాత వక్షం

మా ఊరంటే –
నా జీనోమ్ మ్యాప్ కథ
నా ఏడేడు తరాల పురా గాథ ! ■

*మన తెలంగాణ 12, జూన్ 2017*

## పిట్టల తొట్టెలు

మునాసు వెంకట్ - 99481 58163

కామంచి చెప్పిన కత కప్పుకొని పడుకున్న
పిట్ట నా నిద్రను పొడిచి
కలలు పట్టుకుని పోయింది
పోతుపోతు కొన్ని భూమి మీద
కొన్ని ఆకాశాన చల్లుకుంటు పోయింది
అవి కొన్ని మొక్కలుగాను కొన్ని చినుకులుగాను

రాత్రంత చీకటిని పొడిచి పొడిచి
పొద్దురేకలను రెక్కల మీద మోస్తు
కాలాన్ని గీసుకుంటు
పడమటికి ఎగిరిపోయింది
రుతు కట్టడితో వచ్చి
పండ్లను పంటను ముందే ముట్టే

తాటిజెగ్గల్లో గుడ్డిగువ్వ
పొద్దుమీద అలిగింది
ఎద్దుమీద వాలిన మంగళిగిజ్జిగాడు
మారం జేస్తుండు

సుట్టుకాముడేసినట్టు
నన్ను మాయజేసి బాల్యంజేస్తే
గడ్డి మీద మిడతనయ్యా
నాలో నేను ఎగురుతుంటే

బుడుబుంగలా మునిగి తేలిన

సెలగపిట్ట ఆకాశాన్ని సేలిగేసింది
సెరువు కూడా తెడల రెక్కలతో
ఎగరాలనిజుస్తుంటే
వెన్నెల్లో దిగి చుక్కలు ఏరుకున్నా
బురక లేసింది
కుందేలు ఉరికింది
పోదలో యద ఇరికింది
కిచకిచమంటు కిన్నెర మాయ
వెన్నెల పాయా
మేను మేనలో వుంది

జమ్మిపిట్ట జరగదు
ఉల్లంగి పిట్ట ఊకోదు
ఏ పిట్ట పాట ఆ పిట్టదే
పాటలు తాగి ఊగే ఉయ్యాల నా ఊరు
పిట్ట ఈకే నా ఊరు సంతకం
పిట్ట నా ఆత్మ వాహనం
నా మార్మిక బలగంలోకి పిట్ట
మేనరికంలా వచ్చింది

రాజు రారాజుపైన
రెక్కల రాజు
స్వప్న కిరీటం మెరిసింది
పిట్టగూడుకని నా హృదయమిచ్చా
పిట్టల గుంపు నుంచి
పిల్లలతో పాటు
ఇప్పుడే ఇంటికి రెక్కలతో ఎగిరొచ్చా ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 26, జూన్ 2017*

# ఖర్మభూమి

సిరికి స్వామినాయుడు - 94940 10330

చీకటి స్వాతంత్ర్యమింకా
చీకట్లోనే...
చట్టాలు
కనిపించని ఖద్దరునీడలు
నాయకులు
కీచకుని వారసులు.
న్యాయస్థానాలు
కడదాకా నడచే వాయిదాలు
ఖర్మభూమి....జనారణ్యం
రక్షణ కరువైన సందర్భం !

ఏదీ...
పోత్రంతో రంకెలేస్తున్న
వాడి పురజాలమీద
ఒక్క తాపుతన్నవే తల్లీ...
వాడి అహంజెండా కూలిపోవాల.
నీ ఎదవేపుజూస్తున్న ఎంగిలి కళ్లను
చింతపండుకు పిక్కతీసినట్టు
పెరికెయ్యవే...
వాడి పొగరుకళ్లు పేలిపోవాల.
అంగాంగాన్నీ
ఓ ఆయుధం జేసుకోవే....

పాడు ఆలోచనకే....
వాడు భయకంపితుడు కావాల !

పూవులా గాదు
పదునెక్కిన ఖడ్గమవ్వాల.
సీతాకోకలా గాదు
చెట్లబెరళ్లను తొలిచే
చెకుముకిపిట్టవు గావాల.
అత్తిపత్తి కాదు - నీ దేహం
ముట్టుకుంటే కంపనమెత్తే
కరెంట్ తీగవ్వాల !

కలువపూలు కాదు కళ్లు
చీకటిరాత్రిలో మెరిసే
చిరుతపులి చూపవ్వాల.
బెండకాయలు కాదు వేళ్లు
పదునెక్కిన చురకత్తులవ్వాల.
కుందేలువు కాదు
గదిలో తెగించి తిరగబడ్డ
ఆడపులివి గావాల !

ఆడది ఘర్జిస్తే....
అర్ధరాత్రి సూరీడు తుళ్లిపడి లేవాల.
ఆకాశంలో సగం కాదు
అనంతవిశ్వమే నీవవ్వాల !! ■

*'కవితా!' 48, జూన్ 2017*

# మాస్టారూ

నూకతోటి రవికుమార్ - 98481 87416

మాస్టారూ
మీరిక ఇక్కడ కనబడరు కదా
నా మస్తకం వెలుగు పూలవనం చేసిన
ఈ బడి గోడలు
ఇక మొండి గోడలుగా మిగిలిపోతాయా?
ఇది ఎవరి పాపం
ఇది ఎవరికి శాపం?
పల్లె బడిగా
పిండి బడిగా
ఎన్ని ఆకటి కడుపుల్ని
సంపద్వంతం చేసాయీ నల్ల బోర్డులు?
ఇక
ఏ స్వప్నాలు కొలువుదీరని భూమి ఇది?
ఇక ఎవ్వరూ
పలకరించని పుస్తకాలు ఇవి?
అవును.
మనమంతా తెలివి మీరి పొయ్యామ్.
పొయ్యి లో పిల్లి లేవని రోజుల్లో
ప్రేమగా అక్కున చేర్చుకున్న అద్భుత బెత్తం
ఇక అదృశ్యం అవుతుందా?
నా అక్షరాల తల్లీ

నా బతుకు బావుటాని ఎగరేసిన కల్పవల్లీ,

ఇకనుంచి నువ్ గతానివి.

నేను –

నీకోసం ఏమీ చెయ్యలేని

నడుస్తున్న శవాన్ని. ■

*(9 వేల బదులు మూసేసి బదుగుల బతుకును పరిహసిస్తున్న*
*ప్రభుత్వం వైఖరి కి నిరసన గా)*

*'కవితా!' 48, జూన్ 2017*

# ది రెయిన్ డాన్స్

నరేష్కుమార్ సూఫి - 98493 08875

ఎప్పుడైనా డాన్స్ చేశావా నువ్వు..
పెదాలు పాదాలై
పగుళ్లు పగుళ్లుగా విచ్చుకున్న నేలమీద..?
పోనీ...!
ఎప్పుడైనా పాడావా ఒక గీతాన్ని? వరినారు ఒంటిపై సంధించి
Have you ever danced like a peacock ??

కాలిలో ముల్లు దిగబడ్డప్పుడో,
పాదానికో రాయి పరమైనప్పుడో
చిందేసావా నువ్వెప్పుడైనా?
మేఘాన్ని చూసి, వర్షాన్ని మోసీ అనంతానంత విశ్వ వేదిక మీద
నీ దేవుడు గంతులేస్తాడు చూడూ అలా...
మరి కలలో అయినా...
I know man you never and you can

తెలుసా నీకు rain dance ?
ఒక్క చినుకు భూమిని తాకితే,
మరొక్క మబ్బుతునక
అతని కనుగుడ్డుపై విచ్చుకుంటే
చెళ్లుమన్న చర్నకోలా చివరంచు దారప్పొగై
అతని దేహమెలా చిందులు తొక్కుతుందో...
నాగలి నడుంమీద చెయ్యేసి
తొలిచినుకు మద్యాన్ని దోసిళ్ళ నిండా సేవించి

బురదలో నడిచే మూన్ వాక్
Dude , you can't even imagine
తాతల, తండ్రుల ఒక్కగానొక్క కల ఆ వర్షం అని..

నిన్న సాయంత్రం అతను
పొలంగట్టు మీది చెట్టుకొమ్మకి
నిర్జీవంగా వేలాడేముందు
భూమిని ముద్దాడిన చెమ్మ ఇంకా ఆరిపోలేదనుకుంటా
yah..! He is dancing now....
శరభశరభ... అశ్శరభశరభ...

సుక్షేత్ర స్వప్నమొకటి నీ దొంగ ప్రజాస్వామ్యపు
నమ్మకంలా కుప్ప కూలినపుడు
నీ వంటింట్లో రక్తం మరిగిన వాసన
నీ ఇల్లంతా శవం కాలిన దుర్గంధం, వొళ్ళంతా కారిన చీమూ, రక్తపు
చారలు
రోడ్డెక్కిన రైతులు ఆడతారిపుడు...
Yes... Yes... they will dance now
కపాలమాలా, కంకాళ హేలా... చల్ బిడ్డా ఆట...
ఎల్లమ్మ డప్పుళ్ళ, పోతరాజు చిందుల్ల
ఆటమీద ఆట, చిందు మీద చిందు....■

*'కవితా!' 48, జూన్ 2017*

# నగర 'వరూధిని'

అశోక్ అవారి - 90005 76581

శ్వేత హిమ సొబగుల కులుకులతో
హైమాస్ లైట్ల నిషా నగరం
సాంకేతిక అల్లసాని మనునాయిక
నవ 'వరూధిని'లా మెరుస్తుంటది
మెరిసే నల్లంచు తారుచీరను కట్టి
కార్బన్ మల్లెలను తల్లో తురుముకొని
క్రీగంటి ఓర చూపులతో
పల్లె ప్రవరాఖ్యులను మోహిస్తుంటది
ముస్సోలినీ సామ్రాజ్య విస్తరణలా
సంక్షేమ కేంద్రం లేని వృత్తమై
మట్టి తల్లి మధుర మృదు గుండెలపై
కార్పొరేట్ 'సెజ్ గద్దె' విహరిస్తుంటది
ఊరించే నగర విప్రలంబ విరహ చేష్టలకు
ఉపాధి పాదలేపనం పూనుకొని
తన్ను గాడంగా వలచిన వూరుని విడ్చి
నగరంపై ఆబగా ఆశగా వాలుతుంటరు.
సంకోచ వ్యాకోచాల ఊపిరితిత్తుల్ని
ప్లాస్టిక్ పరమాణువులతో చుట్టేసిన
ఉచ్ఛ్వాస నిశ్వాసలసలే లేని
నిర్జీవ సోయగాల 'స్కెల్టన్' ఈ నగరం
కిరణజన్య సంయోగక్రియనెప్పుడో మరచిన

కార్బన్ మోనాక్సైడ్ మొక్క నగరం
పరిమళ శూన్య నడి నిశీ ఉత్పుల్లం
రాగ రిక్త కాంక్రీట్ సభ హర్మ్యం నగరం నగరం...
కుంభాకార కుటిల మాయా దర్పణం పల్లెటూరు...
హరితధర్మ మట్టి పుటాకార దర్పణం ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 3, జులై 2017*

# దువా

షేక్ కరీముల్లా - 94415 02990

అన్ని తోవల్లోనూ
అబద్ధాల ముళ్ళకంపల్ని నాటి
మన దగ్గరలన్నీ దూరాలేనని
అందర్నీ నమ్మిస్తున్నావు కదా!
ఆయుధాలనుకున్న రాజ్యాంగ ఇరుసులన్నీ
నీ ముందు నిరాయుధాలేనని
అహంకరిస్తున్నావు కదూ!
గో ఉన్మాది...
గుబురు మేఘమై గుక్కపట్టిన
నా అస్తిత్వం
విరామచిహ్నాల్లేని విసుగు వాక్యంలా
నీకన్పించవచ్చు
నువ్వు చిదిమే నా ఊపిరి
చరిత్ర బోనులో నీ రూపాన్ని
ఎలా ప్రదర్శిస్తుందో నీకు తెలీదు
స్వేదాల జడివాననై
మట్టి పరిమళాన్ని ఆస్వాదించేవాడిని
నీలా ఉద్రేకాల్లో
విద్వేషపు ఉన్మాదాల్లో ఊరేగలేను
ఆవు జడ కుచ్చును
నా కంఠం చుట్టూ ఉరితాడులా

నువ్వు బిగిస్తున్నప్పుడే
నీ కుర్చీ గోస నాకర్థమయ్యింది
నా కలల చౌరస్తాలో జొరబడి
నువ్వు రెడ్ లైట్ వెలిగించినప్పుడే
నువ్వేమిటో స్పష్టమయ్యింది
వంద ఎలుకల్ని తిన్న పిల్లి
కాశీయాత్ర చేసినట్టు
శాంతి రాట్నాల మగ్గం నువ్వెంత నేసినా
నా భవిష్యత్తుపై నువ్వద్దుతున్న
నెత్తుటి కలంకారీలను తెల్సుకోలేననుకోకు
శోకాల చీకటితో విసిగి
నీపై ఉరిమే సందర్భం కోసం
ఓ పిడుగునై ఎదురుచూస్తున్నా
ఐనా నీలో మార్పు కోసం దువా చేస్తున్నా
శాంతి నా విశ్వాసం కనుక
భారతీయత నా ఆత్మ కనుక. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 17, జులై 2017*

# కల దొంగిలించబడింది

ఊర్మిళ – shobha.urmila@gmail.com

ఇరుకు గది
తుప్పు పట్టిన కిటికీ వూచలు
వాసనేసే గోడలు

నలగని దిండు
చెదరని పడక
ఏకాకితనం అంచులో ఇద్దరం

నిరంతరం వెంటాడే
రహస్య ప్రియుడి సంకేతం

రెండు చూపులు మూసి
మూడవ కన్ను తెరుస్తాడు

ఎన్నెన్ని మాయ పొరలు
సాలీడు గూడులా అల్లుకున్న కవచాలు

ఒక మాటైనా చెప్పను
కొన చూపు వెనక్కి తిప్పను

దారి పొడవునా ఎరుకపరిచే
ఒంటి వాసనలు
సరిహద్దు కట్టడాలను ఛేదిస్తూ

కనిపించని నిచ్చెన మెట్ల వెంట
శిఖరాగ్రం వైపు అడుగులు

శూన్యావరణంలో అంతరంగం
ఆకృతిని మరిచిన తనువులు
ఊపిరాడని తమకంలో
విరుచుకు పడిన కొండచరియలు

ఆగిపోయిన ఫాన్ గాలి
ఒక్కసారిగా తడిచి ముద్దయిన మనసు

జంకుగా పక్కకు తిరిగితే
ఎగిసి పడుతున్న
ఉచ్వాస నిశ్వాసలు
అలజడిగా తిరుగుతున్న
కంటి పాపలు

బిగుసుకుపోయిన కట్టె
వికారంగా ముఖకవళికలు
నా చీకటి కలను తాను కంటూ

ఫెళ ఫెళ విరిగిన అద్దం రెక్క
నిజాన్ని రేపటి ముందు నిలుపుతూ

దొంగిలించిన కలను
భుజాన వేసుకొని
పరిశుద్ధాత్ముడిలా తను...

అంటిన మరకలు
తుడుచుకుంటూ
ఎప్పటిలా నేను... ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 24, జులై 2017*

# నల్ల జెండాలు

శ్రీరామ్ పుప్పాల - 9963482597

చేనంతా
చెమట చుక్కలతో స్నానమాడాక
తడిసిన నేల ఒళ్ళంతా
పాటల్లాంటి గింజల్నే నాటింది
పదునెక్కిన సాళ్ళు మొత్త
గొంంతునొక్కేసిన చేతులూ కాళ్ళే మొలిసింది.

పనిముట్లకి కంచె కట్టి
ఆకలిమీద ఊచకోత కోసిన ప్రతిసారీ
పచ్చగా పండిన మండువా లోగిళ్ళలో
మరక్కాగిన పొలిమేరే ఊపిరి తెగ్గోసుకుంది

ఈరోజు
పొయ్యిలోని పిల్లిలా
గుడిసె మొత్తం నిశ్శబ్దమే గానీ

ఊళ్ళోని మేడల మీద మాత్రం
వెలేసిన చెరువులోని కలువ పూలన్నీ
నల్లజెండాల్లా రెపరెపలాడుతున్నాయ్!! ■

*సాక్షి, 24 జులై, 2017*

# ఘర్ వాపసీ

వరవరరావు - 96765 41715

ఓటు హక్కు కూడా రాకముందే
ఆ పదహారేళ్ళ పసిబాలుడు
తన తలిదండ్రుల పరిరక్షకుడయ్యాడు [1]

రంజాన్ చంద్రుణ్ణి చూసానని
జామా మసీదు ఇమామ్ చెప్పాడు గనుక
ఈద్ రోజు ఢిల్లీకి వెళ్ళి
కొత్తబట్టలు, చుట్టేకి సేమియా కొన్నాడు

ఈ దేశ రైళ్ళలో కూడా
ముస్లింలకు చోటుండదని
తెలియనంత పసితనం అతనిది

పండుగపూట కలిసుందామనే
ఆత్రంతో స్టేషన్‌కే వచ్చిన తండ్రికి
కొడుకుల జాడ
క్షతగాత్ర నెత్తుటి ఒడి
ఖండిత నెలబాలుని శవమై
పొడగడుతుంది

ఊళ్లో అందరూ ఎందుకు అంత
ఆరాటంతో పలకరిస్తున్నారో
జ్ఞానదంతం వచ్చిన కొడుకునప్పుడే

గుతకాలపు జ్ఞాపకంగా
ఎందుకు తలచుకుంటున్నారో
తల్లికి తెలియదు –

సూర్యుడు అస్తమించకుండా
తిరిగొస్తాానన్న కొడుకు మృతదేహంపై
కొత్తబట్టల నిండా నెత్తుటి మరకలు
తల్లి గుండెల్లో గుచ్చుకున్న బాకులు

కషాయమైన ఈ దేశ ఆకాశంలో
చవితి చంద్రునికే తప్ప
నెలవంకకు నిషేధం

తలలు నరికేసి తీసేసినంత కసితో
నెత్తిమీది బుట్ట టోపీలు విసిరేసారు
మూలాలు పెరకే జిగీషతో
'ముల్లాలు' అని చూపిస్తూ గడ్డాలు పీకారు

గొడ్డు మాంసం తింటారంటూ
పాశవికంగా ప్రవర్తించారని చెప్పి
పోలికలతో ఏ జీవినీ
అవమానించలేం మేం

మానవజాతిలోనే ఒక విశ్వాసి
జాతి విద్రోహి ఎల్లా అవుతాడో మాకు తెలియదు

మాకు నెత్తురు చెమటగా పసళ్ళు కావడం తెలుసు
అత్తర్లు కావడం తెలుసు
సహస్ర వృత్తులు కావడమే తెలుసు
మాకు నెత్తురు పాలు చేవులయి ప్రేమగా
మోసులెత్తడం తెలుసు

చిదిమితే పాల్గారే శిశువు
నెత్తురు కళ్ల చూసే కరడుగట్టిన ద్వేషం
ఇప్పుడే అనుభవానికొస్తున్నది

ఒకే అకాశం నీడలో బతికే నేల మీద
ఒకే దేశం ద్వేషంగా ఆవహిస్తున్నది

హోమ్ కమింగ్[2] ఉండవా దోస్త్
ఉన్నదంతా ఇటువంటి
ఘర్‌వాపసీలేనా ! ■

[1] *పరిరక్షుడు : ఖురాన్ మొత్తం కంఠస్తం చేసి చెప్పగలిగిన వాడు – హాఫీజ్*
[2] *హోమ్ కమింగ్ : బైబిల్ సూక్తి – జీసస్ వాగ్ధానం. ఎన్గూగీ నాటకం. 1994లో పాలస్తీనా ప్రజలను ఉద్దేశించి యాసర్ అరాఫత్ చేసిన సుప్రసిద్ధ ప్రసంగం.*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 24, జులై 2017*

# నశ్యెం డబ్బ

వడ్లకొండ దయాకర్ – 94404 27968

గోరుకొయ్యలు గూటికి
చేరకమునుపే నిద్రలేశి
కళ్ళద్దాలు సవరిచ్చుకొని
నశ్యెండబ్బ మూతదీసి
తుమ్ముల అలారం మోగిచ్చి
ఒళ్ళులుకజేసుకున్నంకనే
న్యాలమీదకాలుమోపేది
నాయినమ్మ

గలుమట్ల కూసోని
లోకంమీది ముచ్చట్లు
కోలాటమోలె కొలుపుబెడ్తె
చేతిల నశ్యెంకాయ చిడుతై ఆడేది

బాటెమ్మటి పోయెటోళ్ళు
ఊకెనన్న మందలిచ్చి
ఎంకటవ్వ నువ్వేంగల్పుతవో.. గని
నీ నశ్యెం కమ్మటి వాసనొత్తదే... అని
బుదుగరిచ్చి నశ్యమడ్కపోయేటోళ్ళు

దినమంత ఒక్కపొద్దుండి
కావాల్సిన సామానుదెచ్చుకొని
బోనంకుండపుదిచ్చినంత ఇగురంగ

నశ్యం నూరుకొని
బతుకమ్మ పేర్చినంత ఒడుపుగ
వస్త్రగాలం పట్టి
గుమ్మిల గాసం నింపుకున్నంత
సంబ్రంగ డబ్బ నింపుకునేది

రొండ్లె శెక్కుడు సంచి
ఒళ్ళె నశ్యంకాయ లేంది
ఏ వూరికి పయానం కాకపొయ్యేది

సిందు భాగవతాలాడ్తాంటే
కథ రసపట్టుమీనుంటె
నశ్యండబ్బ సగమయ్యేది
కథ ఎందాన్కచ్చెనే నాయినమ్మ అని
అడిగితె డబ్బా అయింతొడిశేది
నశ్యం ఆఖరైతానప్పుడు సూడాలే
ఎవలన్న అప్పడిగితే
గుడ్లురిమినట్టు సూసి
కస్సుమని కసిరిచ్చిపెట్టేది

తెలిసో తెల్వకనో...
ఎరిసి మరిసి మాట్లాడితె
అది వొదిలే సామెతల బాణాలకు
మాకు నశ్యం నశాళానికి
ఎక్కినంత పనయ్యేది
ఎప్పుడన్న నశ్యండబ్బ కానరాకుంటె
ఇల్లంత సందులేకుంట సోదిచ్చి
ముక్కుపుల్లపోయినంత
గాబర పడేది
మొకమంత సిన్నబుచ్చుకొని

నశ్శెంసీస కండ్లల్ల మెదులబట్టెనని
తిండిమాని కలువరిచ్చేది

నశ్శెం ఒంటికంత మంచిదికాదే
అంటె
ఎన్నాళ్ళ సోపతి బిడ్డా
సావుదలకు గిప్పుడు మర్తనా..అని
గతం తల్సుకొని గుడ్లళ్ళ
నీళ్ళు దీసుకునేది

మూడొద్దుల పిట్టకుబెడ్తె..
శాన సేపటికి
గొ(ౌ)రెంకలొచ్చి నశ్శెండబ్బనే తన్నినై
ఇప్పటికి ఏన్నన్న..
నశ్శెండబ్బ కనవడ్తె
ముందుగ నాయనమ్మే యాదికత్తది
దాని గ్నాపకాలు మన్సును మెలిబెట్టి
తెల్వని తత్వాన్ని బోధిత్తై. ■

*మన తెలంగాణ 31, జులై 2017*

# దిగులు మబ్బు

మహమూద్ -

మళ్ళీ మళ్ళీ అదే సాయంత్రం
మరలా అదే దిగులు

మబ్బులు పట్టిన ఆకాశం
రాలని చినుకులు

ఏ దూరతీరాల్నించి తరలి వచ్చాయో
ఈ విహంగాలు
గుండె గంటల వేగాన్ని
వాకబు చేస్తూ దొర్లుతున్నాయి ఘడియలు

సీమకు పట్టిన కమురుకు కరువు అని
ఎవరు పెట్టారు పేరు?
రవ్వంత కనికరం చూపదుకదా అని నిందించుకుంటూ
సాగుతున్నాయి వలసలు
దేశం వొదిలి వెళ్ళడానికి మొరాయిస్తున్న కాళ్ళ
నొప్పి తెలిసింది కాబోలు
ఆగకుండా జారుతున్నాయి కనుల నీళ్ళు

మళ్ళీ
మళ్ళీ
మళ్ళీ
అదే

తరతరాల

దిగులు మిగులు

ఎందుకంటే

ఆకాశం ప్రతిసారీ కొత్త నైరుతీ మబ్బుల
చొక్కాను తీసి వేలాడదీసేది
కోస్తా కొక్కానికే...! ■

*అరుణతార, జూలై 2017*

# నక్షత్రాల పంట

శిఖా-ఆకాష్ - 70958 74172

అతడు జీవని
అధివాస్తవిక రచనా శేఖరుడు
మాయాలాంతరు పట్టుకుని
ఐదోహంసను వెదికి తెచ్చినవాడు
చిట్టచివరి రేడియోనాటకంగా
జీవితాన్ని మొట్టమొదట వినిపించినవాడు
శివుడికే తెలుసు
శివ శంకరునికే తెలుసు
అతడెంతటి లయకారుడో...
రుద్రుడో... చంద్రతేజుడో...
అతనెటువెళ్లి వుంటాడు?
బహుశా...
మంత్రవిద్యేదో నేర్చి
కథా తంత్ర తాత్వికత అంచులు చుట్టి
రహస్యాల అంతు తేల్చడానికే
వెళ్ళి వుంటాడు.
కొత్త కిటికీలు తెరచినవాడు
చెమట నెత్తురుల కన్నీళ్ళకు చైతన్యమద్ది
మానవీయ స్పర్శతో
అనుబంధాల విలువల్ని సిరాలో ఒంపి
డొల్ల బతుకులనొలచి చూపి

జీవితాన్ని వెల్గించిన మానవ పరిమళం అతడు –
విషాదాల లోతుల్లోంచి
ఆనందానుభూతి తీరాల్నీ లోకానికి పంచినవాడు
స్వప్నలోకాల రంగు రుచి వాసనలను
తెలుగు నేలన కథలు కథలుగా విరజిమ్మినవాడు
నూత్నభావాల కుండపోత
శిల్పవిన్యాసాల కొండ ఊట
వాక్య లావణ్యాల ఉక్కపోత
జీవన్వేదనల దిమ్మరింత
అంతర్ముఖ లోకాల దార్శనికత
అధోఃజగత్ శోకాల పలవరింత
నూత్నాకాశపు పూదోట
అవును అతడు
ప్రపంచమంత కథల పంట – ■

*కథా మాంత్రికుడు వి. చంద్రశేఖర రావు గార్కి*
*కన్నీటి నివాళులతో...*

*'కవితా!' 49, జూలై 2017*

## జొన్న రొట్టెలు

రమేశ్ కార్తీక్ – 72869 42419

మీరు చెప్తే నమ్మరు గాని
మా జొన్న రొట్టెలు
తండాకు రానన్న ప్రతీవాడి గల్లాపట్టి
మా కడుపుని మోసె మూడు ఇటుకల
దగ్గరికి లాక్కొస్తాయి

పాదరసంలోని జారుడుతనం
మా రొట్టెదేహం నిండా
కనబడని పచ్చిదనం
నాలుకలోని తడిని పీల్చుకుని
నాలుకని నమలి తినేస్తుంది

రొట్టెలు పురుడోసుకోవడానికి
మా అమ్మ, నానమ్మ చేతివేళ్ళతో
సహజీవనం చేస్తాయి
వేళ్ళకు, పిండికి మధ్య జరిగే చర్య
కడుపులోని ఖాళీని వెలివేస్తుంది
రొట్టెని తాకగానే
బొగ్గుల దేహమంత బుగ్గలుగా చిగురిస్తుంది
సిగ్గుతో ఎరుపెక్కుతుంది

రొట్టెకి చుట్టు నానమ్మ కాల్చి
కాటుక పెట్టి దిష్టి తీసి

మంటనోట్లో వేస్తుంది

రొట్టెలన్ని
చాట ఒడిలో కూర్చుని
కూర ఏంటని అడుగుతాయి
పచ్చిమిరపకాయల్ని కరకర నములుతు ■

*'కవితా!' 49, జులై 2017*

# సంకేతం

కె.శివారెడ్డి – 040 24064195

నాకు తెలుసు
ఇది 'చివరకు' దారి తీస్తుందని
దీన్నెవడూ ఆపలేడని –

పళ్ళు బిగబట్టి, కాళ్ల మునివేళ్ళు
భూమికి తన్నిపట్టి
ఎంత గుంజినా వెనక్కిరాదు

బొక్కలో జొరబడ్డ పాముని
బయటికి లాగటం చాలా కష్టం
సగానికి తెగినా తెగుతుంది కానీ
అది బయటికి రాదు

వీటంటిలో నా ప్రమేయముందా
దేన్ని కాపాడగలను, ఇది ఓటమో
విజమో తెలియదు,
గుంజాటన సాగుతూనే వుంది –

'అంతం' భయపెడుతుందా
నది చివరికి సముద్రంలో అంతర్ధానమౌతుంది
కాలవలోని నీళ్లు చేలో అదృశ్యమౌతాయి
చివరి క్షణపు స్పందనల్ని
ఇపుడీ మునివేళ్లు గ్రహిస్తున్నాయా –

అతడికీ అర్థం కాదు
ఆమెకీ అర్థం కాదు – ఒక క్షణాన్ని
చెరి సగం పంచుకుని ఇంత దూరం వచ్చారని –
ఎవరికయినా అర్థమౌతుందా
భవిష్యత్తుని వర్తమానం సంకేతిస్తుందని. ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 14, ఆగస్ట్ 2017*

# జీవ బంధం

గోరటి వెంకన్న -

మూఢమతుడ ఏ కీడు ఎరుగని
మూగజీవులను తెగిడెదవు
మాటికి గాడిద పందని
మాట మాటకు నోరు జారెదవు

మంచిచెడులు నీలోని గుణంబులు
ఎంచి వాటిలో వెతికెదవు
కొంచెమైన ఇంగితము లేక
నీ వంచననాపాదించెదవు

కొన్ని గొప్పవని గొడుగు పడతవు
కొన్ని అల్పమని గొడవ పెడతవు
లేని శకునముల అంటగడతవు
నీవే వాటికి శకునివిర

కొన్నింటిని భజియించమంటవు
కొన్నింటిని భుజియించమంటవు
ఒక్కడిదేనా ఈ జగము
నీకెక్కడిదిర ఈ ఆగడము

వేలెడంత ముక్కున్న గద్ద
ఎంతొ ఎత్తుకు ఎగిరితె వింత
గంపెడంత నోరున్న గాడిద
మోపున ఎప్పుడు బరువుల గంత

వేలెడంత ఆ ముక్కు రూపుకు
కోడిపిల్లలకు వణుకంట
గంపెడంత ఆ గాడిద నోటికి
గరిక పోసలె ఇంపంట

జీవుల పొడిసె గద్దనెందుకొ
దేవుని మోసె వాహనమంటివి
బరువుల మోసె గాడిద సేవను
మరిసి చులకనలాడుచుంటివి

మల్లెవోలె తెలుపున్న నాగులో
నల్లని విషమే వున్నదట
మబ్బువోలె నలుపున్న బర్రెలొ
తెల్లని పాలె వూరునట

కాటువేసె ఆ పాముకెందుకొ
నాగదేవతని పూజచేసెదవు
పాలనిచ్చె ఈ బర్రెనెందుకొ
బడితపూజతొ బాదపెడతవు

పాపల పొట్ట నింపె పాలను
పాముకు పోసెదవో నరుడ
లోపలి కోపం ఎళ్ళగక్కుటకు
బర్రెను తిడుతవు పామరుడ

సందమావలాగున్న మూతితో
ఊరి కసువును ఊడిసె పంది
పందెము కత్తుల వంటి కోరలతో
పాడియావులను మింగె పులి

ఆవును చంపె ఆ పులి రూపం
అమ్మవారికి ఆసనమా
ఊరికె చాకిరి చేసె పందిని
దారిని చూసితె దూషణమా

హాని ఎరుగని సాదు జీవుల
హీనమని నీవెంచెద వేల
పానందీసె గాయి మెకముల
పబ్బతి పడతవు మిడిమేల

బురద నేలను సులువుగ దున్నె
దున్న తుంగనె మేయునుర
గుహల వెచ్చగ పండె బెబ్బులి
గుండెల నెత్తురె కోరునురా

సలికి వెరవక సాగె అరకల
దున్నకు బలిపోలి గండాల
ఇలపై వెలసిన సుర రూపంబని
నరసింహానికి దండాల

పేడ పంచకం ఎత్తిన వాడ
ఆవుకు అమ్మకు చూడని తేడ
దమ్మపదం వెలుగొందినవాడ
గోవద కామద దూరం చూడ

బతికిన ఆవును సంపే వాటికి
బాగున్నది లోకం మొక్కు.
సచ్చిన గోవు చర్మము వొలిసితె
నేరం మోపేదే ధర్మం

మూగజీవుల ఈ కతలెరుగవు
నీ తేడాలు మురువవు మొరుగవు
వాటితొ పాచికలాడకుర
పాపం వాటికి పంచకుర. ■

*(మైసమ్మకు దున్నను బలిచ్చిన వార్త,*
*సెరువు పనికి పందిని సజీవంగా పాతిపెట్టిన ఘోరం విని...)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 14, ఆగస్ట్ 2017*

## ఖాళీ గమ్యం

ఎం.ఎస్.నాయుడు – 94914 39739

గుమ్మానికి యే వైపునో
రాత్రి తిరుగుతోంది
కలే కుదురుకోదు

మోయలేని భావం
భాష కాలేదెన్నడూ

ఊహించిన ఆలోచనే
ఉపన్యాస సన్యాసంలో

సీతాకోక చిలుక
మొరుగుతోంది
తూనీగ గాండ్రిస్తోంది

దేహాంతాల్ని దర్శించే
దుర్బల అక్షరాలు

ఏ సమాధానమూ వినపడదు
ప్రేక్షకుడా
తోలులేని తెర దిగింది

శ్వాసకూడా
వెనువెంటనే తిరిగి చూడకు
కదలని చిత్రాలే నిద్రలో

యింకా వొదలదు గుమ్మం ■

*సాక్షి, 28, ఆగస్టు 2017*

# నేను లేను...

కృష్ణుడు - 9810223863

మౌనంగా మౌనాన్ని
అనుభవించలేను
రెక్కలల్లార్చకుండా
గూడులో నిద్రించలేను

రెప్పలు మూసుకుని
చీకటిలో కాంతిరేఖల్ని
స్పృశించగలనా?
పచ్చిక బయలుపై వాలి
ఆకసపు నీలి లోతుల్ని
అన్వేషించగలనా?

నుదుటిపై అమ్మ స్పర్శ
అంతరాంతరాల్లోకి పాకి
అనిర్వచనీయ అనుభూతిని
కల్పించి ఎంతకాలమైంది?

ఏమీ తెలియని పసితనంలో
చెట్టు క్రింద పచ్చికొబ్బరి తింటూ
గుడిగంటల చప్పుడులో
పునీతమైన క్షణాలేవి?

కనుల నుంచి రాలకుండా

గుండె కన్నీటితో నిండిన వేళ
మౌనంగా సంతాపం కూడా
వ్యక్తం చేయలేను

కూలుతున్న చెట్ల మధ్య
పక్షుల శవాల్ని చూసే
ఓపిక లేదు
విరిగిపడ్తున్న మేఘాల మధ్య
రాలుతున్న నక్షత్రాలను
లెక్కించే సమయం లేఉద

పాదాలకంటిన నెత్తురు
మనసుకు పాకి
చాలాకాలమైంది
దగ్ధమవుతన్న చితిలో
అక్షరాలు రగిలి
ఎంతోకాలమైంది

శవాలు సాగుతున్నాయి
శవవాహనాలు
వేగం పుంజుకుంటున్నాయి
రోడ్డు ఎప్పుడూ
శవం ఖాళీ చేసిన ఇల్లే.
జీవించడం, ప్రశ్నించడం
పరిమళించడం
చూసిందెప్పుడూ తెలియదు
నీపై నీవు తిరగబడటం
జరిగిందెన్నడో తెలియదు. ■

*సాక్షి 4, సెప్టెంబర్ 2017*

# తలుపులు

పాలపర్తి ఇంద్రాణి – ipalaparthy@gmail.com

బార్లా తెరిచావనీ రాను
భళ్ళున మూసావనీ పోను

నచ్చిన తలుపు తట్టి
మనసు మెచ్చిం సేపే ఉంటాను

ఒకసారి
లోపలికొచ్చాక
తలుపులు మూసేసేవో?
గడీపెట్టేసేవో?

హహ్హహ్హా

పిచ్చివాడా!
ఏ తలుపులూ
నన్నాపలేవు

నా తలపులు తప్ప. ■

*ఆంధ్రజ్యోతి 4, సెప్టెంబర్ 2017*

# డెలీరియం

పసుపులేటి గీత - 83094 71351

నిత్యం అంతెరుగని నీ డెలీరియంలో
నిన్ను కత్తులు భయపెట్టవు
తుపాకులు భయపెట్టవు
నిప్పుకూడా నిన్ను కాల్చలేదు
వరద కూడా నిన్ను ముంచెత్తలేదు కానీ....
ఆ నేలమీది ఉల్క కోసం...
తన కోసం నింగి తలవంచి పిలిపించిందంటే...
ఒక యుద్ధవిమానం నినాదాల నిప్పుల వర్షానికి
రెక్కలు విప్పార్చిందన్నమాటే!
చర్మంలోకి రహదారులు పరచుకునే కత్తులూ
దేహాన్ని ఆలింగనం చేసుకునే మంటలూ
అమాంతంగా మింగేసే వరదలూ
అంతెందుకు అంతటినీ ఎగరేసుకుపోయే మృత్యువు కూడా...
ఒక్కటంటే ఒక్కమాట...
దాని ముందు అంతా దిగదుడుపే!
ఆమాట అక్షరాల్లోకి అనూదితమైనప్పుడు
అక్షరాలు మరణానికి మరణశాసనం రాస్తాయి
మరణాన్ని జయించిన గాయం నినాదమవుతుంది
ఒక నినాదగాయం మనిషిని ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది
మనిషి ముందు మరణం కూడా గడ్డిపోచే!
మరి గజగజలాడుతూ

క్షణక్షణం చస్తూ కూడా
మనుషుల్ని చంపేస్తానంటావేమిట్రా?
మనిషి ఆపాదమస్తకం సైనికుడైతే
మరి మరణానికి శరీరంలో చోటెక్కడుంటుంది...
ఒక్క నీ గుండె దింపుడుకల్లంలో తప్ప! ■

*(గౌరీ లంకేష్ హత్యకు నిరసనగా)*

*ఆంధ్రజ్యోతి 11 సెప్టెంబరు 2017*

## పాలమూరు వలస

ఎన్. గోపి – 93910 28496

రాజకీయ జలాలు
ఊరి పక్కనుంచే ప్రవహిస్తుంటాయి
ఊర్లో పొలాల నోళ్లు తడువవు

కాంట్రాక్టర్ల మనుషులు
ఊరిలో తిరుగుతూ
ఆత్మీయుల అవతార మెత్తుతారు.

ఎల్లని బతుకులు
ఎల్లగొట్టే ఊరు
ఎల్లలు లేని
అనంతమైన ఆకలియాత్ర

రైల్వే ప్లాటుఫారాలూ
బస్టాండులూ
వర్షం లేకుండానే
చిత్తడిగా మారుతాయి

డాలర్ల వలసలు కావవి
కరువు జాలర్ల చేతికి
చిక్కిన బక్క చేపలు.
బరువెక్కిన జీవితాలను మోసే
అలవిగాని మానవ యాతన

పాతచీర లాంటి
పాలమూరు పల్లెలకు
వజ్రాల అంచులా
బెంగుళూరు హైవే రోడ్డు

చీచీ!
ఈదారి ఇప్పుడు
ఎంత వికారంగా కనిపిస్తుందో ! ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 18, సెప్టెంబర్ 2017*

# రోహింగ్యా

అజిత –

నేల ఏదీ
పాదముద్రికలకు తావేదీ
యుగాల ఉనికి దగ్ధమై కన్నీరై నెత్తురై..

ఏమిటిది
చూడటం వినడం ఆలకించడమే
దుర్భరమైన అనుభవం కావడమేమిటి?

రోహింగ్యా..

ఏ భాషోత్పత్తి ఈ పదం
ఎక్కడి మానవులు
పది లక్షల మంది తమ నేలకెలా పరాయివాళ్లయ్యారు?
ఎందుకయ్యారు?
పౌరసత్వం లేని ప్రజలు
ఎవ్వరికీ పట్టని మనుషులు
మృత్యువు తప్ప మరేమీ సొంతంకాని జనులు

పోగా బతికుంటే వలస
దేశం నుంచి, కన్న భూమి నుంచి
కలల నుంచి
బతుకు లోలోపలి స్మృతుల నుంచి
బంధాలన్నిటి నుంచి
నేల నాలుగు చెరగులా కన్నీరై పరుచుకున్న వలస

సముద్రం వంటి కల్లోలం
నిజ సముద్రాన్ని ఈది ఏ దరి చేరుకోగలదు?
ఎక్కడ గడియ విరామం దొరికి
తల్లి తనివార బిడ్డకు పాలు కుడపగలదు?
వెంటాడే మరణం
అంతేనా..
ముఖంపై తీవ్రవాద చిత్రం

గుర్తింపు లేని మనుషులపై
గుర్తింపు ఉన్న రాజ్యం దాడి
కాళ్లూ చేతులు
కడివెడు దుఃఖం మాత్రమే ఉన్న వాళ్లపై సైన్యం దాడి
ఎవరో తెలియనివారిపై ఎంచుకొని దాడి
వేల శవాల గుట్టలపై
మయన్మార్ జాత్యహంకారం
మానవ వ్యతిరేకం
రఖైన్ స్వాధీనం కోసం జాతి హననం

నేల ఏదీ?
కన్న నేల
కనుకున్న కల
గుండెలపై బిడ్డ తుది శ్వాస విడిచినప్పటి మాతృత్వపు ఆక్రందన
దిక్కులు పిక్కటిల్లే పరాయితనానికి
దుఃఖమొక్కటే ఆలంబన

వినగలమా?
చూడగలమా?
హృదయం విప్పి ఆచ్ఛాదన కాగలమా?
ఈ నిస్సహాయ పెను ఘోషకు గొంతివ్వగలమా?

రాజ్యానికంటే మనిషి మహోన్నతుడు

అతి ప్రాచీనుడు
ఎక్కడెక్కడి నుంచో ప్రవహించే కన్నీటిని ఒడిసిపట్టే సాహసికుడు
మానవతకు తప్ప మరి దేనికీ సాటిరాని సున్నితుడు
రాజ్యం వెంటాడేవాళ్ల పట్ల దుఃఖితుడు
నిలదీసే తెగువ కలవాడు
మానవీ మానవుడూ కలిసి నిర్మించిన భూమి ఇతిహాసమిది
కలసి శృతి చేసిన సంగీతమిది

ఇప్పుడు రోహింగ్యాల కోసం కూడా. ■

*అరుణతార సెప్టెంబర్ 2017*

# కవనవనం

టి. నందకిషోర్ –

నెగడు వేసున్నాది నెత్తుటీ పొయ్యంత
చలికాచుకుంటాను కూడిపోయి

రాజేసి ఉన్నాది రక్తమాంసపు కొలిమి
స్వర్గమెళతా స్వర్ణభస్మమయ్యి

నిప్పు తునకల నీళ్ల వైతరిణి వరదెత్తి
నీ కాళ్ళ మధ్యలో పారుతోంది

నిద్ర తెప్పల మీద
దాటుకుంటూ

ప్రియసఖీ!
తీరాన బూడిదవనీ

❊ ❊ ❊

ముద్దు ముద్దుకు నేను మూడంకె వేస్తాను
కొసరు ముద్దుకి రెండు తగ్గుతాను
ఒక్కటైపోయాక ఒళ్లంతా నిను తడిమి
శూన్యరాసుల్లల్లో ఒరుగుతాను
నిట్టూర్పులో నిన్ను కైవల్యమొనరించి
నీ శ్వాసతో కలిసి కదులుతాను
నీలిమేఘాలల్లో
చేరుతాను
ప్రియసఖీ!

స్పృహలేని సంతోషము.
దేవదారుల మించు నీలగిరి తరువులు
నిలబడే రోజులూ ఉండవచ్చు
బేల పశువుల తోల కస్తూరిమృగరాశి
మత్తెక్కెగాలి వ్యాపించవచ్చు
ప్రౌఢ అందము తగిలి ప్రవరుడే కరిగితే
పాదలేపనయొక్క లెక్క కాదు
మంచులోయకి
సిగ్గు ఎగ్గు లేదు
ప్రియసఖీ!
చలి కాల మహిమ వల్ల...

❊ ❊ ❊

కాళ్ళు చేతులు కట్టి జోకొట్టమంటాది
నిదరపట్టని లాలి అడుగుతాది

కన్ను మిన్ను కానే కాలాన్ని వెలివేసి
పసికందు చేలాన్ని కోరుతాది

మోకాళ్ళ మీదేసి లాల పోసే గడియ
మొహము దాచూకుంటు మెసలుతాది

చన్నీళ్ళు తగిలితే
వణుకుతాది
ప్రియసఖీ!
ఊయలా శిశువు తనువు

గుర్తేది మిగలదు గాయమైనా చోట
గుణము కనిపించదు వైద్యమున్నా

కాటు కానగరాదు దిగజారినా చోట
మణి దోచ వీల్లేదు మంత్రమున్నా

తృణమోపణమో దక్కి తూలినడిచే చోట
తుడిచిపెట్టుకపోదు కాలజ్ఞానం

తృప్తిపడనీయదు
కాలసర్పం

ప్రియసఖీ!
తప్పదీ మందగమనం.■

*ఆంధ్రప్రదేశ్ మ్యాగజైన్ , సెప్టెంబరు 2017*

## ప్రజాయుద్ధ కనుపాప

సంహితా కిరణ్ –

సెంట్రీ
ఒక యుద్ధ సైరన్
సెంట్రీ
ప్రజాపోరాట ప్రాణమై
శత్రువు గుండెలో
తొలి తూటా పేల్చే ప్రజాయుద్ధ కనుపాప

సెంట్రీ
నిప్పుల ప్రవాహ కవాతు

మిత్రులను శత్రువులను వేరుచేసే ప్రజాహం

వీచే గాలుల విశ్లేషకుడా!
శత్రుజాడల ఆనవాలు కనిపెట్టే రాడారా!!
కుట్రల కాలంలో
నమ్మకానికి చిరునామా! నా సెంట్రీ!!
నా విశ్వాసమా!
నా సంరక్షకుడా!
తల్లి ఒడిలో ఆదమరిచి నిదురించే పసిపాపల్లాగా
నీ ఒడిలోనే కదా ప్రజాయుద్ధవీరులు
ప్రజారాజ్య స్వప్నాలు కంటూనే రేపటి పోరాటానికి సిద్ధమయ్యేది
రాజ్యం ఇనుపరెక్కల సవ్వడిని
సవాల్ చేసే తొలి యోధుడా! ■

*అరుణతార, సెప్టెంబర్ 2017*

# నేల ఈనుతుంది

దేవరాజ్ –

రంగులన్నీ చిట్లిపోయాయి
అక్షరాలు చేజారిపోయాయి
ఉన్నట్లుండి మాటల ఊట ఒట్టిపోయింది

గాలి పారాడదు
నిలువెల్లా మనిషి సర్పబంధి
ఇక ఏ పువ్వు పూసేను
ఏ నవ్వు విరిసేను
ఏ పదం ఒక మహోగ్ర తేజమై ఆశ్చర్యపరిచేను

ఒక ప్రశ్న
ఒక నిలదీత
ఒక అంతర్లోక దర్శనం
పెంజీకటిపై వెలుగుల నదీ ప్రవాహం
రెక్కలల్లార్చే మేధకు చుక్కాని దీపం

ఇక వేటికీ చోటు లేదు
భిన్నమైన తీరు నడయాడే దారి లేదు
అంతా ఏకత
అంతా అఖండత
అంతా శిలాకృతం
కాదంటే తల్వార్లు తుపాకులు త్రిశూలాలు
కాషాయపు మడుగుల్లో విలవిల్లాడే ప్రాణాలు

బెదరించే శంఖు చక్రాలు

రక్తం ఎగజిమ్ముకుంటూ
కాలభైరవుడు వస్తున్నాడు
నిప్పులు చల్లుకుంటూ
వీధి వీధినా తిరుగుతున్నాడు
వెన్నెల జలతారుపైకి
నీడలను విసిరేస్తున్నాడు
చిన్నారుల బుగ్గలపై
మసి పూసి ఆనందిస్తున్నాడు

మొగ్గలు వాడిపోతున్నాయి
చుక్కలు రాలిపోతున్నాయి
తేనెపట్టు బుగ్గిపాలవుతున్నది
వందల వేల ఏళ్లుగా
మనిషి పోగు చేసుకున్న ధిక్కార స్వరంపై
ఇనుప గజ్జల పాదం నాట్యమాడుతున్నది
పురా ప్రకృతిని
తీరొక్క రీతిగ వికసించే తోటను ఛిద్రం చేస్తున్నది
పత్రహరితాన్ని ధ్వంసం చేస్తున్నది

పరాగమొలికిన మట్టిలోంచే
మానవి పునర్జీవిస్తుంది
వేయి మానవ హస్తాలు మొలుచుకొస్తాయి
ఈ నేల పులకించే
భావధారలు ప్రవహిస్తాయి
ఇంద్రధనస్సులైన అక్షరాలు
హృదయాలను అలంకరిస్తాయి
ఒక గొప్ప నమ్మకంగా ప్రతి ఇంటి గుమ్మానికి వేలాడుతాయి

తరతరాల ఆశ్వాసనగా వెన్నుతడతాయి
నెత్తురొలికిన పేజీల్లోంచి
వేకువలు లేచి వస్తాయి
వెలుగుల తీరమంతా
నాగరికత సాగవుతుంది

అప్పుడామె చిరునవ్వుతో మనందరి మధ్యా.... ■

*అరుణతార, సెప్టెంబర్ 2017*

# ఆమె

రేఖాజ్యోతి – rekhapoetry@gmail.com

ఆమె
ఓరగా తీసిన తలుపు సందులోనుంచి
రెండు జ్ఞాపకాలు తీసి నా మొహం మీదికి
గిరాటేసింది
‘ఇంకేం లేవు నా దగ్గర... పో,
ఇంకెప్పుడూ రాకు జోలె కట్టుకొని.
మిగిలున్నవి చెప్పుకోలేను.
లేనిపోనివి ఇప్పుడు ఓపిగ్గా అల్లనూ లేను,
పో, తప్పి పోయాను కదా నీ దారిలోనుంచి,
ఒక్కగానొక్క జన్మలో మరలి రావడాలు
ఉంటాయా?
లోకం ఎరుగవా?’

ముత్యాలు వర్షించడం తెలిసిన ఆకాశం
ఇప్పుడు నిప్పులు కురుస్తోంది
నేను దగ్ధమవుతున్నాను.

వెంట తెచ్చుకున్న ఆశ మాత్రం
ప్రాణాలు కాపాడుకుంది
ఈ అగ్ని మొత్తం చల్లారిపోయాక ఎప్పుడో
ఆమె వెనక్కి వచ్చి
నీ దగ్గర దాచుకున్న నా కథ ఏది?’ అని
అడుగుతుందేమోనని! ■

*సాక్షి 3, అక్టోబర్ 2017*

## సోహం

దాము - 99890 77699

యింకా వుపయోగించని శంఖం వుంది
చేతిలో
వంచని తల వుంది
గుండె వుందిరా
నడచిన దారి వుంది
వెలుగుతూ
విచ్చుకొనే లక్ష రక్త కణాలున్న దేశం వుంది
కాంక్షతో
లోనికి లోనికి లోనికి చూచుకొనే అద్దం వుంది
మెరుస్తూ
నిరంతరం ప్రవహించే నది లాంటి
దుఃఖం వుంది కదా
నీతో నువ్వు నిశ్శబ్దించే స్వప్నం వుంది
కురుస్తూ
యింకా తెరవని మరణం వుంది కదా
మోహంతో ■

*సాక్షి 9, అక్టోబర్ 2017*

## బైపాస్

రమణ జీవి – 99516 18021

అంటే ఏమీ లేదు
నువ్వు లేనప్పుడు నీ శరీరాన్ని తెరవడం
కాలిదారిని కత్తిరించి
చెట్లు కూలిన రహదారికి అతికించడం
వైద్యులు గుండెప్రాంతాన్ని మాత్రమే తెరుస్తారు
గుండెను మాత్రం నువ్వు తెరవాల్సిందే
తెరిచి –
నువ్వే అయిన లోకానికి
రక్త తివాచీ పరవాల్సిందే
పరచి –
నీలోకి ప్రవేశించిన కత్తుల్ని, పువ్వుల్ని
మౌనంతో కడగాల్సిందే
కడిగి –
వెచ్చటిభయంగా తాకే
చల్లటి మృత్యువుకు
నేనుండగా నువ్వుండవని చెప్పడమే
చెప్పి –
ఇంతదాకా రోజులుగా గడిచిన కాలాన్ని
క్షణాలుగా వికసింప చెయ్యడమే
చేసి –
నీలోకి ప్రవేశించిన లోకంలో
లోకమే అయిన నువ్వు కరిగిపోవడమే ■

*(నేను తాకని నా గుండెను తాకిన డా. మన్నం గోపీచంద్‌కి, మూసుకుపోయిన నన్ను తెరచిన దర్భశయనం శ్రీనివాసాచార్యకి)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 23, అక్టోబర్ 2017*

# నీడ్స్ వర్సెస్ ఛాయిస్

అరుణ గోగులమండ - 88971 07984

సుబ్బరమైన సీర కట్టుకొని, నున్నగా నెత్తి దూసుకొని ఆపీసులకెల్లటం సూసి,
మాల మాదిగ ముండలకు మా సోకొచ్చి పడిందని
ఈ ముండమోపి మొకాల్ని పొద్దున్నే సూడాల్సొత్తుందని...
మెడలు మూతులు ఎయ్యోంకర్లు తిప్పుకుంటుంటే తలొంచుకుపోతుంటాం

అదేదో 'నో బ్రా డే' అంట...
దాని కోసం ఆడీ కారుల్లో తిరిగే మయిళామణులంతా
ఏసీఆల్లో మీటింగులెట్టుకుని
బాబ్డ్‌హెయిరూ, లిప్టిక్కు పెదాలూ, జీన్సుపేంటుల్లో వచ్చి
రొమ్ము కాన్సర్రాకుండా సానా కట్టపడతుండారంట

మా వాడలో సదూకునే మాలాంటోళ్ళకి తప్ప
మా అమ్మలసొంటోళ్ళకి రైగ్గుడ్డుంటే సీరుండదు, సీరుంటే రైకుండదు
ఇళ్ళల్లో పంజేసినందుకు అమ్మగోరిచ్చిన ముతకసేరని
మయ్యానికి సింపి, అడ్డేసుకుంటాది మాయమ్మ.

కోడి కూసింది మొదలు కాయకట్టం సేనుదేగానీ
మాకూ రొమ్ముకట్టుందనీ, మాయీ ఆడబతుకులేననీ గేపకమేరాని
మాకూ రొమ్ముకట్టుందనీ, మాయీ ఆడబతుకులేననీ గేపకమేరాని మాయదారి
బతుకులు బాబూ
ఇస్సర్లూ బాడీలూ మా కాడేదుంటయ్యయ్యా...!
సీకటితో సేలోకెళ్ళి, గంజి బువ్వలో ఉల్లిపాయ నంజుకుని
వంచిన నడుమెత్తకుండా పంజేసొచ్చిన మాఅమ్మకూ అయ్యకూ పచ్చిపుల్చే

పరమాణ్ణం.
పొంతలో మసిలిన నీళ్ళే పులిసిపోయిన వొంటికి నవనీతం.
బిడ్డల సదువుల కోసం, కంచంలో నాలుగు మెతుకుల కోసం
మట్టిపనికీ,రోడ్లేసే పనికీసుత ఎనకాడకుండా పరిగెత్తే
మా వాడకట్టు ఆడోళ్ళకి
రైస్రాళ్ళవ్వడమూ, నెలనెలా ముట్లుండటమూ గొప్పింటి ఆడోళ్ళకుమెల్లే సెప్పుకునే తీరికేది?

అయ్యదో అన్నదో లుంగీగుడ్డ సింపి అడ్డెట్టుకుని
తొళ్ళు కోసుకుపోతున్నా మైళ్ళకుమైళ్ళు నడిసి ఊడ్పులికీ కోతలకీ ఏరోజూ మేమెళ్ళకపోతే గడిసేతీరేది?
ఇంటి నిండా జెనం మసిలే మాసుట్టిళ్ళల్లో
సెంబిచ్చుకెళ్ళే వంకతో కంపల్లోకెళ్తే తప్ప గుడ్డ మార్చుకునే ఈలుసిక్కని మేము
కడుపులో నొప్పిని బలివింతరాన బరించి ఇంటెడు పనీ సెయ్యికపోతే మా బతుకులు కడతేరవు తల్లుల్లారా!
మరి మాబోటి ఆడోళ్ళకి పెద్దిళ్ళ అమ్మలక్కలు సెప్పే
ఏపీ టు బ్లీడంటేనూ, నో బ్రా డే అంటేనూ, అంతా మై సాయిస్ అంటేనూ అర్థమవ్వుద్దా సెప్పండి? ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 30, అక్టోబర్ 2017*

## నాన్నగొడ్డలి

తగుళ్ళ గోపాల్ – 95050 56316

నాకు ఊహ తెలిసినప్పటినుంచీ
నాన్న చేతుల్ని రోజూ
ఆప్యాయంగ ముద్దాడింది ఈ గొడ్డలే....
నాన్న పిడికిట్లో కూర్చోని
గుండెబాసలను విన్నది ఈ గొడ్డలే..

మాలాగే నాన్న భుజాలపై కూర్చొని
ఎన్నో అడవుల్ని, కొండల్ని తిరిగి
ఏరోజుకారోజు
ఇంట్లో పొయ్యి వెలిగేటట్లు చేసింది...

ఈ ఇనుపగొడ్డలి
మానాయనకు జిందగిదోస్తు
నాన్న అరచేతి రేఖల్ని ముద్దాడి
మా నుదుటిరాతల్ని మార్చింది ఈ గొడ్డలే...

దీనికి జబ్బుచేస్తే
సాన్రాయిమీద మెత్తగా నూరి
వైద్యం చేసేటోడు...

మా ఇంట్లోని పేదరికాన్నంతా
కొంచెం కొంచెంగా నరుక్కుంటూ వచ్చింది
ఈ బంగారుగొడ్డలే...
బాల్యంలో నాల్గు అక్షరాలను తిన్నానంటే

నాన్నకిది చేదోడువాదోడుగా ఉండడం వల్లె

ఈ గొడ్డలితోనే
చిటారు తుమ్మకొమ్మల్ని నరికి
మేకలకు మంద దెచ్చేటోడు
పెళ్ళిపందిర్లకు
"సక్కని" గుంజల్ని దెచ్చేటోడు...

నాన్న చనిపోతే
ఈ గొడ్డలితోనే "పాడెకట్టెలు" కొట్టుకొచ్చారట
నాన్న మరణం చూడలేక
ఆ రోజే సగం విరిగిపోయింది
మొనదేలిన ఇనుపగొడ్డలి
పెళుసులుపెళుసులుగా రాలి
నాన్నకు నివాళినర్పించింది
ఆ దినం నుంచి ఒంటరిగా ఏడుస్తూ
ప్రాణంగా చూసుకున్న దోస్తులేదని
మొద్దుబారి కూర్చుంది ఓ మూలకు

అందరూ నాన్నఫోటోకు దండంపెడుతుంటే
నేనుమాత్రం గొడ్డలి ప్రక్కన కూర్చున్న
నాన్న రూపం గొడ్డలిలో కనిపించేసరికి! ■

*'కవితా!' 51, సెప్టెంబర్ – అక్టోబర్ 2017*

# కవిత్వం వెలిగితే దీపం ఎందుకు?

కొండేపూడి నిర్మల - 99493 03626

గాలికి కొవ్వొత్తి ఆరిపోయింది
కళ్ళముందున్న దృశ్యాలు
తటాల్న రాలిపోయాయి
గోడకి అటు తిరిగి రాసుకుంటున్న నా నీడ
విరుచుకు పడి మరణించింది
సగం రాసిన కవిత వెనక పేజీలోకి తూనీగలా
ఎగిరిపోయింది.
హటాత్తుగా పరిసరాలు అపరిచతమైపోయాయి
నేనిప్పుడు దీపం కోసం వెతకాలో
కవిత్వం కోసం వెతకాలో
నా కోసమే వెతకాలో తెలీడంలేదు
చీకటిలో చేతులు చాచి ఈదుకుంటూ
నిప్పుల పెట్టే అందుకోవాలి
నిప్పుని కనిపెట్టడం అంటే మాటలా
చీకటి యుగానికి రాకెట్ యుగానికి
వున్నంత ప్రయాణం వుంది
ట్యూబులైట్ల వెలుగులో అరకొరగా సర్దుకుని
మనసుకింకా మచ్చిక కాని ఈ కొత్త ఇంటి చీకటి కొట్టంలో
నుంచున్న చోటినుంచి ఎన్ని మలుపులు గదులు దాటి
ఆరలు వెతికి నిప్పుని పట్టుకోవాలో తెలీదు
నాలో వున్న నిప్పునంతటినీ రెండు కాగడాలు చేసి

కళ్లలో సర్దుకుని నడుస్తున్నాను
గాయం కూడా ఒక దీపమేనని తెలుసుకుంటున్నాను
నిప్పుని కనిపెట్టడానికి ఆదిమ మానవుడు
గుహ లోపలి రాయిని చెకుముకి చేస్తే
నేను పుట్టుకతో అమరిన సుఖ జీవన లాలసలోంచి

మానవ నాగరిక చరిత్ర మూలాల్ని తడుతున్నాను
వెతగ్గా వెతగ్గా వెతగ్గా
వుంది అనుకున్న చోటు కాక వుండదు అనుకున్న చోట ఒక అగ్గిపెట్టే దొరికింది
అరచేతిలో ఇమిడేంట అంత చిన్న పెట్టెలో
నిండు సైన్యం నిబ్బరంగా చేతికి తగిలింది
మూలిక చూడగానే సగం రోగం తగ్గినట్టు
కాళ్ళకి కొత్త చీకటి కళ్ళకి అలవాటవుతోంది
ఒక పుల్ల గీసాను, సగానికి విరిగిపోయింది
ఇంకొక పుల్ల తీశాను ముఖం చిట్లించి వూరుకుంది
దమ్ముకున్న పెట్టె మీద పుల్ల మీద పుల్ల గీసి అఖరి బాణం తీసేసరికి
నా పట్టుదల రెట్టింపయింది
బహుశా నాలోపలి నిప్పు గదిలోపలి చీకటితో యుద్ధం మొదలెట్టిందేమో
దీపం వెలిగింది
ఆకలికి ఆగలేని మా పెంపుడు పిల్లి
ఆత్రంగా పళ్ళాన్ని బోర్లిచుకుని పాలు తాగినట్టు
గది లోపలి పుస్తకాల అరా, బట్టల బీరువా,
మంచమ్మీద పరచిన గళ్ళ దుప్పటి అన్నీ
తన్మయంగా వెలుతురు తాగుతున్నాయి
ఒక చీకటిని జయించిన గర్వంతో నా నీడ గోడని తన్ని నిలబడింది
దీపం ఆరేలోపు కవిత రాయాలి
కవిత్వం వెలిగితే దీపం ఎందుకు? ■

*( 2017 దీపావళి ప్రత్యేక కార్యక్రమ– ఆకాశవాణి ప్రసారితం )*

# అచేతనం

కోడూరి విజయకుమార్ –

గోడల మీది అనేకానేక పోస్టుల నడుమ అతడి ఉత్తరం
మూసుకుపోయిన మన హృదయ కవాటాల ముందర
నిస్సహాయంగా వేలాడుతూ అతడి ఉత్తరం.
2
కొంచెం గాలీ వెలుతురు కోసం
కిటికీ రెక్కల్ని తెరవబోతాను
నిస్సహాయుల జీవితాలలో వెలుగుల కోసం
గాలీ వెల్తురు చొరబడని చీకటి గదిలో
అతడు బందీ కావడం గుర్తుకొస్తుంది
దేహావయవాల ఆరోగ్యం కోసం నడకకు బయల్దేరతాను
దేహాలను తూట్లు పొడుస్తున్న
ఆయుధాలను ప్రశ్నించినందుకు
ఒక్క చేయి తప్ప తక్కిన దేహం అచేతనమైన
అతడి దయనీయ స్థితి గుర్తుకొస్తుంది
రాబోయే శీతాకాలంలో వెచ్చదనం కోసం
రగ్గునీ, మంకీ క్యాపునీ సర్దుకోబోతాను
అమాయకుల ఆశ్రయాలను ధ్వంసం చేస్తోన్న
కర్కశ కరాలను నిలదీసినందుకు
ఇక తనకు మృత్యు శీతల కాలమే అని
నిరాశ్రయునిలా దుఃఖించడం గుర్తుకొస్తుంది
నిన్నూ నన్నూ లూటీ చేసి దర్జాగా సరిహద్దులు దాటిన

మల్లయ్యల మీద వ్యంగ్య బాణాలై ఎగిసిన మాటలు
అతడి ఉత్తరాన్ని చదివి
ఒక నిరసన వాక్యంగా పెగల సాహసించవు

3

అందరి గోడల మీద అతడి ఉత్తరం
నిలువెత్తు నిరసనలా వేలాడుతూ ఉంది
ఏదీ పట్టని ఒక నేరమయ నిర్లక్ష్యంతో
బిగుసుకుపోయిన హృదయ కవాటాల ముందర
గోడల మీది అనేక పోస్టుల్లో ఉత్తరం కనుమరుగవుతుంద. ■

*5, నవంబర్ 2017*

# తాత కోసం

ప్రసాదమూర్తి – 84998 66699

అతని ముఖం నిండా
ముడతలు పడ్డ చరిత్ర
అతని గొంతు నిండా
చెమటలు గక్కుతున్న కాలం
వణుకుతున్న అతని చేతి వేళ్ళలో
కోటలు నిర్మించి కూలిపోయిన ఎముకల గూళ్లు
పరచిన తువ్వాలు మీద
రాలిన నోట్లలో
రుతువులు రాల్చిన నెత్తురు బొట్లు
అతని జంత్ర వాద్యం చుట్టూ
రాజుల చిత్ర పటాల మీద ముసురుకున్న
గబ్బిలాల కారు చీకట్లు

క్షమించు తాతా...
ఊపిరి తిత్తుల్లోంచి
నువ్వు తోడి పోసిన స్వరాలకు
నా నరాలు తెగలేదు
నీడలాంటి నీ దేహంలో
సింహాసనాలు మోసి అలసిపోయిన
అస్థిపంజరాల జాడలు దొరకలేదు

వినోదం కోసం నిన్ను తాకాను
నాలో ఒక తుఫాను రేపావు

ఈసారి నీ కోసం ఓ గుర్రాన్ని తెచ్చి
నీ చేతుల్లో ఖడ్గాన్ని పెట్టి నీతో దౌడు తీయిస్తా
తిరగబడ్డ భూమిలోంచి సామాన్యుల కళేబరాలు
కొత్త పుస్తకాలు పూచిన చెట్లై మొలుచుకొస్తాయి
పొడిచే సూర్యోదయాలన్నీ
నీ నుదుటి మీదే తాతా!! ■

(జైసల్మేర్ కోట ముందు తువ్వాలు పరుచుకుని రాజస్థానీ జంత్ర వాయిద్యంతో అందరికీ వినోదం పంచిన ఓ తాత జ్ఞాపకంగా)

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 13, నవంబర్ 2017*

## లవ్ జిహాద్

సాబిర్ - 91547 05556

ఆమె ఐ లవ్యూ చెప్పింది
నాకేం తెల్సు ప్రేమించడం నేరమని!
ప్రేమించి పెళ్ళాడ్డం ఉగ్రవాదమని
పెళ్ళి చేస్కోని సంసారం చేయడం
దేశద్రోహమని!!

ఆమె తెల్లవారుజామున
సుప్రభాతం పాడుతూ
ఇంటిముందు రంగుల ముగ్గేసేది
నా గుండెల్లో గంటలు మోగేవి
నేను తూర్పు సూర్యుడ్ని నిద్రలేపుతూ
మసీదు మినారెక్కి
అజాన్ పిలుపునిచ్చేవాడ్ని
ఆమె మనసు ఖవ్వాలీ పాడుకునేది

మతవాసన తెలీని హార్మోన్లేవో
మా చూపుల్ని కట్టిపడేస్తే
చుక్కల ఆకాశంలో
యౌవనాల్ని ఆరేసుకునేవాళ్ళం
మల్లెతీగల్లా అల్లుకుపోయేవాళ్ళం

ఆమె నుదుటి బొట్టు
నాకళ్లకు రాసుకునే సుర్మా అయ్యేది

నాఒంటి అత్తరు సుగంధం
ఆమె పాదాల పారాణై పరిమళించేది
మా జంట
భరతమాట చేతిలో జెండాలా
మూడురంగుల ముచ్చటైంది

మా కలయిక
పవిత్రమో అపవిత్రమో
వాడికి మాత్రమది
పవిత్రయుద్ధమే అయ్యింది
ఎన్ఐఎ చేతిలో లాఠీకర్రయ్యింది

నేను పంజరంలో పావురమయ్యాను
ఆమె లంకలో సీతమ్మ తల్లిలా
కన్నీటి చారికయ్యింది
నేలమ్మ ఒడిలో వాడిన
జాజిమల్లె జానకమ్మయ్యింది!

మాకేం తెల్సు
ప్రేమించడం కుట్రని
ప్రేమించి పెళ్ళాడ్డం విధ్వంసమని
సంక్రాంతి రంజాన్ పండగల్ని
కలిసి చేస్కోవడం రాజద్రోహమని

మేమిద్దరం మనసున్న మనుషులం కాదని
కేవలం రెండు మతాలమని
మాకేం తెల్సు....! ■

*ప్రజాశక్తి 13, నవంబర్ 2017*

## పచ్చి కడుపు వాసన

యార్లగడ్డ రాఘవేంద్రరావు - 99854 11099

ఇక్కడ అడుగుపెట్టేవరకు తెలియదు
ఇలాంటి భాష కూడ ఒకటుంటుందని
ఒక్కో అక్షరం ఏరుకుంటున్నప్పుడు కానీ తెలియలేదు-
అది వేలవేల వానజల్లులు
బాహువులు చాచుకున్న అద్భుత ఆలింగనమని
ఆలింగనాల్లో నలిగిపోతున్నప్పుడు కానీ తెలియలేదు -
అప్పటిదాకా ఎరుగని కొత్త రుతువేదో
గుండెకొమ్మ మీద గొంతు సవరించుకుందని
అక్కడొకటి, ఇక్కడొకటిగా కూత పెడుతున్న
గుసగుసలేవో కొత్తరాగాలై ఈడ్చుకెళుతున్నాయని

ఒరుసుకుంటూ పోతున్న ఈ భాషను
ఒడిసిపట్టుకోవటం అంత తేలికేం కాదు
భాషంతా ఈలపాటల జలపాతమై అంటుకుని
నగారాల్ని మీటుతుంటే అది మరీ కష్టం కదా!
సురలోకంలో కొలువైన దేవతల్లా
బారులు తీరిన తరువుతరువొక
అక్షరమక్షరంగా అల్లుకున్న ఆముక్తమాల్యదల్ని
ఎవరో ఒడిబియ్యంగా వంపుతన్నట్లుందిక్కడ
క్షణంలోనే బతుకును మించి కమ్మేసిన
పచ్చపచ్చని సాగర పరిమళాల్లో
కాసేపు నడుంవాల్చి

నేను చుట్టుముట్టేసుకున్న నన్ను
తోడిపారేసుకోవడానికి బుడిబుడి పరుగులు పసితనం
తటాలున హత్తుకున్న వరమయిందిక్కడ

ఋతువుల పిల్లలు వాలి పోయినప్పుడల్లా
వదిలెల్లిపోయిన స్పర్శల్ని నెమరేసి నెమరేసి
రాగరాగరాగాలుగా ప్రవహింపజేసుకుంటున్న
ఆ మహామౌన సంబరాల్లో
వటపత్రసాయినైపోతుంటే
అమ్మ కడుపులో మళ్ళీమళ్ళీ మునగదీసుకున్నంత
హాయిలోకి మనసు తెరచుకున్నట్లుంది
అప్పుడే పితికిన పాలను గుటకేసినట్లుగా
ఈ గాలిలో గెంతులేస్తున్న రాగాల్ని
గుండె నిండుగా గుటకేస్తుంటే
ముఖం మీదే కాదు... మనసు మీది అలసటను కూడా
ఆమె చెంగుతో తుడుచుకున్నట్లుంది
మెలికలు దిగబడిన తీరాల మీద
ఏరువాకల్ని మెత్తడానికి
వయసోసుకున్న చిలిపి పరవళ్ళతో వస్తున్న నన్ను
అలా ఠీవిగా నుంచుని కన్నార్పకుండా చూస్తున్న
ఆ మహావృక్షాల్ని చూస్తుంటే
చిన్నప్పుడెప్పుడో వదిలివచ్చిన మిత్రులు
అక్కడే నిలబడి నాకోసం ఎదురుచూస్తున్నట్లనిపిస్తోంది
ఏ ఋషులో కొలువుదీరి
నేను మరిచొచ్చిన మంత్రోపదేశాన్ని దేన్నో
మళ్ళీ నానిండా జీవచక్రంగా చెక్కుతున్నట్లనిపిస్తోంది

❊ ❊ ❊

ఒక్కసారిగా ఇన్ని పురాతన సుగంధాల్ని

ఇంతగా తొలిచి అరచేతిలో పోస్తున్న
ఈ అడవి బాషలో ఇంత యోగముందని
ఇప్పటిదాకా ఎందుకు తెలియలేదో
ఈ కొండల ఊయల తెలియని లోకాలకు
తేనెపాకాలు చిలుకుతున్నానని
ఇప్పటిదాకా ఎందుకు కబురు పెట్టలేదో

...అయినా
అప్పుడే బయటపడ్డ బిడ్డనంటిపెట్టుకుని
వచ్చిన అమ్మకడుపు పచ్చివాసనలా
ఈ అడవి ఎంత కమ్మకమ్మగా ఉందని....
ఇంత వయసంత దూరం నడిచొచ్చాక కూ
చంకనెత్తుకుని చనుబాలజున్నును
కొసరికొసరి తినిపించి – ఈ చెట్ల తల్లి –
ఎంతగా కడుపులో దీపం పెట్టిందని...
పోతపోసుకున్న ఈ ఒక్క బతుకు మీద
ఈ కాస్తలోనే
ఎంతెంత జీవితాన్ని అక్షతలుగా చల్లిందని... ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 20, నవంబర్ 2017*

# పగలు - రాత్రి

పాయల మురళీకృష్ణ - 94410 26977

ఆ ఒంటరిని ఇంటిని
కావల్సినవాళ్లకు
చీకటి మాత్రమే
చాలా స్పష్టంగా చూపిస్తుంది
కురుస్తున్న ఆకాశంతో సహా
గదులోల్కిఇ వచ్చి వెచ్చదనాన్ని పుచ్చుకొని
వెళ్లిపోతున్న ఒక్కొక్కరూ
వెనక్కి తిరిగి చూడకపోవడంలో
ఏదో ఆంతర్యం దాగే ఉంటుస్త్రంది !
అన్ని చూపులూ
అవనతమైపోయినచోట
గదుల్లో మిగిలిన వాళ్లతో హా నిశ్శబ్దం
మూగగా రోదిస్తుంది
చీకటి మెల్లగా జారుకున్నాక
పక్కనే ఏరు ప్రవహించడం తప్ప
సంగతేమీ లేదు...! ■

*ప్రజాశక్తి 3, డిసెంబర్ 2017*

# ముఖం తుడుచుకుంటుంది నగరం

అరుణ నారదభట్ల - 97050 15207

పరిచిన తారుటద్దంలో
ముఖం చూసుకుంటూ మెరిసిన నీలాకాశం
కళ్ళు భ్రమిసే లోకం
పిల్లర్లచుట్టూ పెనవేసుకున్న రైన్ బోలు
పార్కింగ్ స్థలాల్లో కుర్చీలపై కూర్చున్న రంగోలి బతుకమ్మలు
ఫ్లయోవర్ గోడలపై వాలి పురివిప్పిన నెమళ్ళు
దారిపొడవునా నక్షత్ర జలపాతాలు
చేతికందిన చీపురుకట్టకు
రంగుడబ్బాల్లో ముంచిన కుంచకు
విరామ సమయం లేదు
అదంతా హైవే
వర్షం పడిన ఆనవాళ్ళు,
డివైడర్ల వంతెన కింద నిద్రిస్తున్న
చెత్తకుప్పలు, మట్టి బెడ్డలన్నీ ఆకుపచ్చని పీఠభూములైనాయి

ఆమని రాకను తెలుపుతున్నట్టుంది నగరం
పెళ్ళిబాజాలు, సన్నాయిమేళాలు
సంగీత విభావరుల పలకరింపులు
పూలచెట్ల గుసగుసలు

మేము మా వాడల్లో
మామూలుగానే ఉన్నాం

మధ్యతరగతి ముసుగులో
ఆ వచ్చే ఆమనేదో
ఈవంకో ఆవంకో నెలవంకై
ఆవలితీరపు ప్రవాసం నుండి ఇంటికొచ్చిన పెనిమిటిలా
మాటిమాటికి వస్తే బాగుండు
వరదలా చొరబడి
ఈ మట్టిని పట్టుశాలువలతో సన్మానించడానికి! ■

*నవతెలంగాణ 4, డిసెంబర్ 2017*

# సిట్టిగువ్వ

అందెశ్రీ - 98485 60986

రాయిమీదా రాయిగొట్టీ
రాజుకున్నా నిప్పుబట్టి
వంటజేసే కంటిపాపా
లేడికూనా తోడురాన
అచ్చనాలా పిల్లనవ్వా
మచ్చలేవీ మల్లెపువ్వ
కచ్చకాయా పొదలనీడా
అచ్చిపోయే గాలిజాడ

అడవిదొండా తీగసాలూ
ఆకుసోకూ ఊయలూగు
వెన్నుపూసా ఎండుటేకూ
జుంటితేనే జున్నుపాలు

ఏటిగట్టూ ఎదురుకొయ్యా
పొద్దుపొదుపూ మద్దిమాను
గడ్డిపూలా బొడ్డుతాడూ
జువ్విసెట్టూ జీవరాసి

కాలిమువ్వా నేలనవ్వా
పాలకంకీ రేలపాట
గూడెమంచూ గుట్టమీదా
పచ్చబొట్టూ పసుపుతాడు

కాటికంటీ సీకటమ్మా
కన్నుగీటే పూలరెమ్మ
నల్లగాలి సరసమాడా
మొండిమానూ మండేసెగడు

నింగినేలా సంఘమాలా
నీలికళ్లా చేపపిల్ల
బుగ్గమీదా పంటికాటూ
బుజ్జగించా సిగ్గుమొగ్గ

కొండకోనా కోరికమ్మా
కక్కడాలూ మొక్కడాలు
జొన్నసేలా మన్నుబువ్వా
సింతకాయా ఎంతమాయ

పుట్టువోలే పొట్ట పెరిగే
ఒట్టుతల్లీ కట్టుజారే
తట్టుకోనీ పురిటినొప్పి
సిట్టిగువ్వా పుట్టెనవ్వా ■

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 11, డిసెంబరు 2017*

## మోహనా !

లెల్లె సురేష్ –

మా మంచి గంధం
మధురానుబంధం
మా కలల పింఛం
మోహన ప్రపంచం

ఒక నవ్వు నడిచింది నదిలా
నీ నవ్వు నడిచింది నదిలా
ఓ మోహనా! ఓహో మోహనా!

కళ్ళలో కన్నీటి బొమ్మ
నీరుకారి రాలిపోయె
ఒక నింగి వాలింది రెప్పలా
మోహనా ! ఓ మోహనా!

వెలుగు మడుగు వెన్నెలా
వెన్నలా కరిగిపోయె
ఒక రాత్రి పిలిచింది కాకిలా
మోహనా! ఓ మోహనా !

వెదురు గాలి సొగసులా
పసి పాట మనసు ఊయలూగే
ఒక ఈల పలికింది జోలలా
మోహనా! ఓ మోహనా !

పరిగ జీవి బతుకులో
కాయమంత కదనమయ్యే
నీ జెండ కదిలింది దండులా
ఓ మోహనా ! ఓహో మోహనా !

తోలు డప్పు చిందులా
చెమట చుక్క సేద తీరే
నీ గురుతు మోగింది గుండెలా
మోహనా! ఓ మోహనా !
చితిలో మనిషి రూపులా
చూపు కొసన దీపమయ్యే
నీ మనసు తిరిగింది భూమిలా
ఓ మోహనా! జయహో మోహనా ! ■

*(ఆర్టిస్ట్ మోహన్ 67వ పుట్టినరోజు నివాళి)*

*ఆంధ్రజ్యోతి 'వివిధ' 18, డిసెంబర్ 2017*

## ష్..!

యాకూబ్ - 9849156588

లోపలికి చేతులు పెట్టి వెతికితే
ఎక్కడో వూరు తగుల్తుంది.
ఊరి జీవితం అంటుతుంది
జీవితం మాత్రం అక్కడే పాతేసిన గుంజలా మిగుల్తుంది
అవసరమైన విషయాలు, అనవసరపు రాద్ధాంతాలు,
చెదలు తింటున్న అనుబంధాలు, అన్నం పెట్టిన మడికట్ల చెక్కలు
కళ్ళల్లో నీటిచెమ్మలా కదులుతుంటాయి.

రాజేసినవేవో తగలబడుతుంటే, చల్లార్చినవేవో
బూడిదలా గాల్లోకి ఎగుస్తుంది.
ఊరినుంచి
రోడ్డుమీదికి అడుగుపెట్టాక నేల పరాయిదై
పదే పదే వెక్కిరిస్తుంది
పైగా కొత్త పిలుపుల్తో, పేర్లతో పరాచికాలాడుతుంది.

❊ ❊ ❊

ఊళ్లు తమనుతామే వెతుక్కుంటూ, పేర్లు కనుక్కుంటూ
లోపల్లోపల పళ్ళు నూరుతుంటాయి.

ఆ మధ్య యాకోబు గరగపర్రుకు సంకేతమయ్యాడు
ఇసుక నేరెళ్లగా పేరు మార్చుకుంది
పారిన రక్తం పేరు, ఒరిగిన దేహాల పేరు టేకులపల్లి ఎన్కౌంటర్.

లాఠీలు, తుపాకులు ఫర్మానా పత్రాల అధికారపు గుర్తులుగా మారాయి.

అవునవును – ఇక ఊరేగింపులొద్దు, నిరసనలొద్దు, కనీసం ఎక్కడా గొంతు పెగలవద్దు.
చెబుతున్నాను కదా, ఎవరూ అటూఇటూ కదలొద్దు,
ఎవర్నీ కదపొద్దు !

❊ ❊ ❊

నువ్వెవరైనా సరే – అతి సామాన్యుడివే
నీకంటూ ఏమీ మిగల్చలేదు నేను, నువ్వు ఏ మిగులు గురించి మాట్లాడినా,
ప్రశ్నించినా ఇక నేరమే
గొంతు విప్పడానికో, గోడు చెప్పడానికో
చేతులు కలపడానికో నానుంచి ఆజ్ఞల్లేవు
నిషేదాజ్ఞలు నేనెప్పుడో ప్రకటించి విధించాను
నువ్వొక ఉలుకూపలుకూలేని
పాతేసిన గుంజవి, అంతే!■

*నవతెలంగాణ 25, డిశెంబరు 2017*

# మట్టి పొరల్లోంచి

బాల సుధాకర మౌళి –  96764 93680

నానిన మట్టిముద్దని వేసి
కర్రతో తిప్పుతున్నప్పుడే
నిద్రలేచింది
ఆకాశం
తడి తడి
కుండ ఆకారంలోకి
పోతపోయబడి
నేలమీదికొచ్చాడు
సూర్యుడు
వూరి చివర
వొంటరి వూరుమ్మడి యిల్లు
ముంగిలిని
కుతితో నాకుతూ
పొద్దుటి కాంతి
ఒట్టి మట్టి పిడత ... ఇల్లు
మిణుకుమిణుకుమంటూ
ఇంటిళ్లపాది కళ్లు
వొక్క జల్లు రాలితే
మట్టిపొరల్లోంచి ఉబికే వాసన
అదిరే ముక్కుపుటాలు
ఆరుబయలు

తళతళ మిలమిల
కుండల వరస
మట్టితో
నిర్మించబడిన వూరిని
దాటి వచ్చాను
2
'ఆకలేస్తుందే అమ్మా'
పిర్రలపైకి జారిపోతున్న నిక్కరుని
పైకి లాక్కుంటూ
వచ్చి నిల్చొన్నాడా బుడ్డోడు
వొంటినిండా మట్టి
పిక్కలపైకి గుండార లాక్కుని
పొగబట్టిన పొయిలోకి
వొకటి వొకటి
పేడులు దూరుస్తుందా తల్లి
ఎల్తి ఎల్తి బతుకు
కూటికుండలోంచి ఎసర
నేలరాలి
సురసురమని
ఆకలి కడుపులో
ఆకలి
దాకలోకి
మిరగాయలు చిక్కి
కుసింత నూనె పోసిందా అమ్మ
రొండు వుల్లిరెమ్మలు లాగి
కరేపాకు జల్లింది
ఆకలేస్తుంది
ఆకలి

3

అరికాళ్ల కింద మంట
బొబ్బలెక్కుతూ పాదాలు
వీధివీధి తిరుగుతుందా
మట్టిపొయ్యి
గడపగడప దిగుతుందా
మట్టికుండ
చెల్లని పెంకైపోయిందా
మట్టిదాక
ఆకలేస్తుందే అమ్మా
బతుకుల్లో
మబ్బు ముసురుకుందిరా నాయనా
ఆకలేస్తుందే తల్లీ
కండ్లల్లో
వొక్క సినుకు పిసర
పడతలేదురా బావూ
బావురుమంది
ఇల్లు

4

సారెపై
మట్టిముద్దలు లేని సారె
ఎండి చిదిగిన పెళ్లలతో
గుమ్మం
పెంకులు పెంకులైన
మట్టిబొమ్మలు

5

ఒక్కసారి మాట్లాడవా
వూరికి ఆలంబనగా నిల్చిన

మట్టికేకని
వొకేవొక్కసారి
ఇంటిగుమ్మాలు దాటి
లోపలికి వినిపించేట్టు
పాడవా
ఆవంలో ఎర్రగా మండి మండి
వూరువూరంతటినీ
వొకే దారంతో నేసిన
మట్టికుండల దరువు
శిరసెత్తుకుని వినిపించవా

6

వూరి గ్నాపకాల్లోంచి
గ్నాపకాల మట్టివాసనల్లోంచి
వూరిని దాటి వచ్చాను
మట్టితో నిర్మించబడిన
వూరిని దాటి వచ్చాను. ■

*అడుగు, 30, డిసెంబర్ 2017*

# వలస

కాట్రాజు లావణ్య సైదీశ్వర్ – 96037 63848

ఈ తోవ నన్ను ఏ చోటుకు
చేర్చుతదో...
ఏ అంతుపట్టని దూరాలకు
పాకిందో....
ఏడేడు సంద్రాలు.... ఏటవతలకు
బడుగు బ్రతుకులకు బాట పరుసుకుందో
ఎవరికి ఎర్కా..

గడ్డిపోచైనా మొలవలేదు
ఎన్ని వేల అడుగుల దండయాత్రలు జరిగినయో...
కనుచూపులెక్కన అంతా ఎర్రమట్టి
మబ్బులే కానొస్తున్నయ్...
ముందు తరాలు... ఆ ముందు తరాలు
ఈ బాటలోనే నడిసిర్రు...
గిప్పుడు నేను నడుస్తున్న వారసత్వపు వలస బాట ఇది...
ఇంకెన్ని అడుగులు నడవాలో తెల్వదు
దూపగొన్న పాణానికి గుక్కెడు నీళ్ళైనా దొరకవు
రాబందుల రెక్కల సప్పుడు ఈడిదాక ఇనొస్తుంది
నేను చేతులు కాళ్ళు ఆడియ్యాలె
లేకుంటే నచ్చిన పీనిగనని పీక్కుతింటయ్
మా వోళ్ళు తిరగబడలేక తిరగబడి
పాణాలె ఇడిసింద్రు

నేను గోస తీస్తుంది చాలు
నా తోనే ఈ వలస ఆగాలె...
ఇంటిగాడ ఒదిలేసి వచ్చిన మా బుడ్డోడు
ఈ తోవలకెళ్ళి రావద్దు... ఈ దారి మూసేస్తా
కంపగొట్టి కంచె పాతుతా
నాదే ఆఖరి ఆకలి వలస కావాలె
గిదే నా ఆశ... ■

*సాహిత్య ప్రస్థానం డిసెంబర్ 2017*

# అంతర్జాలం ప్రేమ

సునీత చొల్లేటి – sunithacholleti@gmail.com

నా మనసు నీచుట్టే తిరుగుతోంది
పాస్‌వర్డ్‌లేని వైఫైలా...
నీ మనసేమో కదలనంటోంది
2జీలా...
నువ్వు నా పక్కనుంటే...
క్యాండీక్రష్ ఆడినంత సంతోషం
దూరమైతే.. డౌన్‌లోడ్ కాని వీడియో
అంత విషాదం
ప్రేమ గురించి చెప్పమంటే
గూగుల్‌లో వెతుకుతావు...
నా గుండెల్లో ఏముందో చూడు ముందు
బాధేస్తే బఫరింగ్ వీడియోలా
మారతావు...
నీ బాధలు నాతో షేర్
చేసుకొమ్మంటే...
షేర్‌ఇట్ ఓపెన్ చేయమంటావు...
అయినా...
నా కోపాన్ని ఓఎల్‌ఎక్స్‌లో
అమ్మేసి...
నవ్వును సెల్ఫీలో నీకందించి...
సిగ్గుని జీమెయిల్‌లో దాచేసి....
దూరాన్ని వాట్సాప్‌తో బ్రేక్ చేసి....
నా ప్రేమను నీ గుండెల్లో పోస్ట్ చేసి
నీకోసమే పరితపిస్తోంది
నా హృదయం.■

ఈనాడు 'ఈతరం'

# నాకు యుద్ధమో, శాంతో కావాలి

రెహనా బేగం - 94925 27352

జీలం, చీనాబ్, తావి
పరవళ్ల పరవశం అంచున
బారులు కట్టిన సైన్యం క్యాంపులు

నింగి-నేల కలిసే ఆ
చివరి రేఖ వరకు
పైర్ల పచ్చదనం మాటున
యుద్ధ ట్యాంకర్ల మోహరింపు

విశాల మైదానాల నుంచి
గాలి తెరలతో పాటు
తరలి వచ్చే తూటాల తుంపర్లు

పర్వత సానువుల్లో
లోయల ఊయల్లో
హిమానీ నదాలతో పాటు ప్రతిధ్వనించే
కాల్పుల నాదాలు

ఓ సాయంత్రం వేళ
వాకిట నులక మంచంపై
సేద తీరుతున్న దేహాన్ని
ఛిద్రం చేసిపోయే మోర్టార్
బాంబుల పలకరింపులు

అవును నాకు
యుద్ధమో, శాంతో కావాలి.... ■

*మాతృక, డిశంబర్ 2017*

# ధిక్కార కలం - స్వరం

ముసునూరి ప్రమీల - 94410 33179

ఇంకొక ధిక్కార స్వరం
తూటా గుళ్ళకు మూగవోయింది
అప్పుడు కూడా ఆమె
వాడి కళ్ళలోకి కళ్ళు పెట్టి చూసే ఉంటుంది
దొంగదెబ్బ తీసిన ఆ మతోన్మాదికి
సమాధానం చెప్పే ఉంటుంది
కాలాన్ని హత్య చేస్తున్నపుడు
వాడి చెయ్యి వణికే ఉంటుంది
ఇంకెన్నో ధిక్కార కలాలు
వాడి వేపు చూస్తూనే ఉంటాయి
నిప్పులు కక్కుతూ.... ■

*మాతృక, డిశంబర్ 2017*

## కలగంటున్నాను

శిఖామణి – kavisikhamani1956@gmail.com

కలగంటున్నాను
ఒకటా రెండా శిలాసదృశ్యమైన
ఏడు దశాబ్దాల నుండి
కలగంటున్నాను
భూమికీ ఆకాశానికీ నీటికీ
సరిహద్దు రేఖలు గీచినట్టు
మనిషికీ మనిషికీ మధ్య
ఎన్ని ఆంక్షల ముళ్ళ కంచెలు.
కులమనీ, లింగం అనీ
ఒకటారెండా ఎన్నెన్ని శాఖోపశాఖలు
శాఖాచంక్రమణాల అగడ్తలు
అందరం ఒక తల్లి బిడ్డలమే
అందరం ఒక తాను గుడ్డలమే
నీకేమో తల్లిపాలు
నాకేమో పోతపాలా?
నీ వొంటిమీద
రాజసంగా కులికే కులం చొక్కా
నాకే కురచై బొడ్డు పైకెక్కి
ఎందుకు వెక్కిరిస్తోంది?
ఎవరి గాయం చిమ్మిన
రక్తం అయినా ఎరుపే

ఏ కాలికి గొప్పు తగిలినా
అరిచేది అమ్మా అనే
అయినా శతాబ్దాలుగా నా విస్తరి
ఊరికి దూరంగా విసిరేశారు
కలగంటున్నాను
ఒకటా రెండా శిలాసదృశ్యమైన
ఏడు దశాబ్దాల నుండి
కలగంటున్నాను
జాతీయతను
మనసు నిండానే కాదు
రక్తం అణువణువునా నింపుకున్నాను
జాతి జెండాను నా గుడిసె వమీదే కాదు
నన్ను నేను జెండా కర్రనుజేసుకుని
ఎగరేసుకున్నాను
శిరసెత్తి వందనం చేస్తున్నప్పుడు
సర్వాంగీణ శరీరమూ
పులకిత హర్ష రోమాంచితమయ్యేది
వివక్షతల వడగళ్ల జడివాన ముంచెత్తినా
అవమానాల సర్పబంధనాలు
కాళ్ళను చుట్టుముట్టినా
నాలో నుండే
రోహిత్‌లూ, మధుకర్‌లూ
ఖండిత శిరస్సులై రాలిపడినా
గుండెను దిటవుచేసుకుని
గుట్టుగా గుప్పిట పట్టి నిలబడ్డాను
నాలుగు కాళ్ల పశువును పూజించండి
కానీ, రెండు కాళ్ళ మనిషిని కూడా ప్రేమించండి
ఎక్కడెక్కడో

ఆకాశమంత ఎత్తున
విగ్రహాలు నిర్మిస్తున్నారని విన్నప్పుడు
ఏడు తాళ్ల నిలువున
మువ్వన్నెల పతాకాలను
ఎగరేస్తున్నారని విన్నపుడు
ఇదిగో ఇప్పుడు
ఈ మట్టిచేతుల మనిషి కూడా
తలెత్తుకు నిలబడాలనీ
ఆకాశమే ఆత్మగౌరవంగా
రెపరెపలాడాలనీ
కలగంటున్నాను. ■

*21వ తానా సభల జ్ఞాపక సంచిక, 2017*

## ఊరిగాలి

నందిని సిధారెడ్డి – nandinisr56@gmail.com

తలపిస్తున్న
వేలిగోరు తీసి అక్కడ నాటుతాను
శరీర గ్రీష్మ భారమంతా
అది మోస్తది
రాత్రి ఎనిమిది దాటినా
ఎండ కాస్తున్న ఫ్రిస్కో
నా నివ్వెర
నేలమీద దిద్దినట్టు పచ్చిక
చీకటిని మోసుకొస్తూ
సన్నని సౌరకాంతులు పూస్తున్న
నిశ్శబ్ద వీధుల్లో
మన మాటలే

అడుగులు ఆగినప్పుడు
నిన్నూ నన్నూ వదలి
జ్ఞాపకాలు నడిచిపోతాయి
ఇక్కడైనా మనమాటలే
ఊరిగాలి
ఖండాలు దాటి
పరిమళిస్తుంటది
చెక్క ఇండ్ల మధ్య అయినా
హృదయాలు భద్రంగానే వున్నయి

డాలర్ల నడుమ అయినా
ఆత్మలు అలసిపోకుండా మెరుస్తున్నాయి

మరమనుషులనుకుంటాం
పొడి మాటలనుకుంటాం గానీ
ఎక్కడైనా
మనిషిని చూడగానే
మనిషి తడిసిపోతాడు
దీర్ఘకాల మౌనసమాధి నుంచి
తనను లోతుగా తవ్వుకుంటాడు
మాట వినగానే
ప్రాణం లేచి వచ్చినట్టు
మనిషి కొత్త చిగురుతో
కళకళలాడుతుంటాడు
డల్లాస్ ఉల్లాసం
డబిల్‌పుర గడబిడ
ఏదైనా మనిషే ■

*21వ తానా సభల జ్ఞాపక సంచిక, 2017*

## I SENT THE HORSES BACK HOME

- Asmakhan Jhahan



***English - Parvathy Mira***

Maai,
I sent the horses trotting,
And they found their way back home.
But, I couldn't.
My legs that you thought were
Swift as those of a deer,
They froze.
Maai, they froze.

But I sent the horses home.

Maai, them monsters,
They had no horns or fangs,
Or deadly long nails.
But they hurt me.

They hurt me bad, Maai.
The purple flowers,
The yellow butterflies,
They stood there helpless.

While I sent the horses back home.

Maai,
Tell Baba that I know,
I know,
I know he tried.
I heard him say out my name,
I heard him repeat it loud.
But,
I was sleepy Maai,
I was tired.
Them monsters,
They hurt me bad.

Strange as it may seem to you,
Maai,
It feels like your warmth now.
It doesn't hurt anymore.
The blood has dried
And it looks like the purple blossoms
That swayed with me in the meadows.
It doesn't hurt, Maai.

Maai,
The monsters are still out there..
And there are stories too.
Don't listen to them Maai,
Gut wrenching and agonizing they are
And a lot you've gone through.

Maai,
Lest I forget,
There's a temple there
Where lives a goddess.
Thank her,
For I think it's she who helped,

The horses find their way back home.

Kavita 2017

*a publication of*
*sahiti mitrulu*
*vijayawada*

₹ 150.00